అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 11-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 280 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



గాజా దిగ్బంధం

- ఆహారం, నీరు, ఇంధనం నిలిపివేత
- 1600 మందికి పైగా మృతి 2లో..



ప్రశ్నిస్తే... పగబడతారా!

స్వతంత్ర మీడియాపై బీజేపీ దాడి

- ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్'కు స్వేచ్ఛా?
- రైతుల ఉద్యమాన్ని కవరు చేయటమే న్యూస్‌క్లిక్ నేరమా?
- కేంద్రం సిగ్గుపడాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

జంతర్ మంతర్‌లో వామపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ : నిజాలు చెప్పేవారినే మోడీ సర్కార్ దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నదని, ప్రశ్నించే తత్వాన్ని అది జీర్ణించుకోలేకపోతున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. స్వతంత్ర మీడియాపై బీజేపీ కుట్రలు ఫలించబోమని తెలిపారు. న్యూస్ క్లిక్, ద వైర్ తదితర స్వతంత్ర మీడియా సంస్థలను నాశనం చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా స్వేచ్ఛను హరించే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ మంగళవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ...5లో

అరుంధతీరాయ్‌పై కేసు!

- 13 ఏండ్ల నాటి ప్రసంగంపై విచారణకు ఢిల్లీ ఎల్‌జీ ఆమోదం వివరాలు 6లో..

జ్యుడీషియల్ కస్టడీకి పుర్కాయస్థ



వివరాలు 13లో..

నగుబాటు సభాపర్వం..


ఏడాదిలో పని చేసింది నెలలోపే

- పూర్తి స్థాయిలో హాజరు కాని ఎమ్మెల్యేలు
- ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలే లేవు
- ఆర్డినెన్సుల జారీతో సరి
- ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల చట్టసభల తీరు



న్యూఢిల్లీ : ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. అయితే గత ఐదు సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్రాల చట్టసభల పనితీరును పరిశీలిస్తే ఎంత పేలవంగా జరుగుతున్నాయో అర్థమవుతుంది. ఈ శాసనసభలు ఏవీ ఏడాదిలో కనీసం నెల రోజులు కూడా సమవేశం కాలేదు. ఆ సమయంలో కూడా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిగిన దాఖలాలు లేవు. శాసనసభ సమావేశాలు జరగని సమయంలో మాత్రం ఆర్డినెన్సులు జారీ చేసి పని కానిచ్చారు.

రాజస్థాన్ శాసనసభ తన ఐదు సంవత్సరాల పదవీ కాలంలో ఉప సభాపతిని సైతం ఎన్నుకోలేకపోయింది. మధ్యప్రదేశ్‌లో 2020 మార్చిలో ప్రభుత్వం మారింది. అప్పటి నుండి అక్కడ కూడా శాసనసభకు ఉప సభాపతి లేరు. అందుబాటులో ఉన్న సమాచారం ...13లో



చర్చ లేకుండానే బిల్లుల ఆమోదం

సమావేశాలు జరిగింది తక్కువ సమయమే అయినప్పటికీ, కనీసం సభల్లో బిల్లులపై అర్థవంతమైన చర్చ జరిగిందా అంటే అదీ లేదు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీలలో ప్రవేశపెట్టిన బిల్లుల్లో 48% బిల్లుల్ని ఒక రోజులోనే చర్చించి, ఆమోదించారు. అంటే ప్రవేశపెట్టిన రోజు లేదా మరునాడు వాటిని ఆమోదించారన్న మాట. దీనినిబట్టి ఏపాటి చర్చ జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత సమావేశాల్లో మిజోరం అసెంబ్లీలో 57 బిల్లుల్ని ప్రవేశపెట్టారు. అవన్నీ ప్రవేశపెట్టిన రోజో లేదా మరునాడో ఆమోదం పొందాయి. 2020లో కేవలం ఆరు గంటల పాటు సమావేశమైన ఛత్తీస్‌ఘర్ శాసనసభ ...13లో

పెరిగిన కుబేరులు

- 12 ఏండ్లలో 4.4 రెట్లు పెరిగిన సంఖ్య
- ఏడాదిలో రెట్టింపైన పలువురి సంపద
- అదానీని వెనక్కి నెట్టిన అంబానీ
- గౌతంకు హిండెన్‌బర్గ్ మర్చిపోని దెబ్బ
- ప్రతీ 20 రోజులకు ఇద్దరు కొత్త బిలియనీర్లు
- హురున్ రిచ్ లిస్ట్ -2023 వెల్లడి



వివరాలు 13లో..

గ్రూప్-2 మళ్లీ వాయిదా

- జనవరి 6,7 తేదీల్లో నిర్వహణ
- ఎన్నికల నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో నిర్వహించాల్సిన గ్రూప్ -2 రాతపరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్‌ను విడుదల ...13లో

అమిత్‌షాకు సీసీఐ నిరసన

ఆందోళనకారుల అరెస్ట్

- సీసీఐ పునఃప్రారంభంపై స్పందించని నేత
- కేటీఆర్‌ను సీఎం చేసేందుకే కేసీఆర్ తాపత్రయమంటూ వ్యాఖ్య
- ఆదిలాబాద్ జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనకు సీసీఐ' నిరసన తాకింది. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని తెరిపించాలని డిమాండ్ చేస్తూ సీసీఐ సాధన కమిటీ నాయకులు ప్లకార్డులు, నల్ల బెలూన్లు పట్టుకుని, కండువాలు ధరించి నిరసన తెలిపారు. దాంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేపీ జన గర్జనసభకు అమిత్‌షా హాజరయ్యారు. అయితే, ఇందిరా ప్రియదర్శిని మైదానం నుంచి డైట్ మైదానానికి అమిత్‌షా వస్తున్నారనే విషయం తెలుసుకున్న కమిటీ నాయకులు బాబూజగ్జీవన్‌రాం చౌక్‌లో ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చారు. సీసీఐని తెరిపిస్తామని సభలో ప్రకటన చేయాలంటూ నినాదాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అడ్డుకొని బండి దత్తాత్రి, అరుణ్‌కుమార్, బుట్టి శివకుమార్, వాగ్మారే ప్రశాంత్, స్నుజన్‌జెట్టి, అఖిల్, ఆసిఫ్, సోహెల్, రఘు, కలీంలను అరెస్టు చేసి మావల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సభలో అమిత్‌షా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కారు పార్టీ స్టీరింగ్ మజ్లీస్ చేతిలో ఉందని, ఎంఐఎంపై ఆధారపడి ఈ సర్కారు నడుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ...13లో

భావ సారూప్య పార్టీలతో పొత్తు

బీజేపీ ప్రమాదాన్ని నివారించడమే లక్ష్యం

- ఇండియా కూటమితో మోడీకి భయం
- బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు
- మా పార్టీ నిర్ణయించిన స్థానాల్లో పోటీ చేస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




నవతెలంగాణ - నిడమనూరు

"మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మొదటి నుంచి ఖచ్చితమైన అభిప్రాయాన్ని కలిగి ఉంది.. ఈ దేశానికి ప్రమాదకరమైన బీజేపీ ఎదుగుదలను నిలువరించడమే మా లక్ష్యం.. బీజేపీ, దాని అనుబంధ సంఘాల విధానాలకు, మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఎవరు పని చేసినా మా సంపూర్ణ మద్దతు ఉంటుంది.. మాతో భావ సారూప్యం గల పార్టీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోడీ పతనం ప్రారంభమైందన్నారు. ఇండియా కూటమి విధానాలతో మోడీకి భయం పట్టుకుందని చెప్పారు. దేశం పేరును మార్చి భారత్ అని పిలవాలని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి భయానికి నిదర్శనమన్నారు. ఇండియా కూటమి పేరును ఉచ్చరించడానికే భయపడుతున్నారన్నారు. దేశం పేరు మారిస్తే దేశ ప్రజల బతుకులు మారవన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం హర్షనీయమైనప్పటికీ అమలుకు కాలయాపన సరైనది కాదన్నారు. ఈ బిల్లు పేరుతో మహిళల్లో సానుభూతి ...13లో

బస్సెక్కితే బహుమతులు

- టీఎస్ఆర్టీసీ దసరా ఆఫర్
- విజయదశమి రోజు లక్కీ డ్రా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజారవాణాను ప్రోత్సహించడంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులకు లక్కీ డ్రా నిర్వహించాలని టీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ప్రస్తుత దసరా సీజన్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా ద్వారా రూ.11 లక్షలు విలువైన బహుమతుల్ని అందిస్తామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. దసరా సీజన్‌లో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పూర్తి పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన ...13లో

పల్లాకే జనగామ...

- ముత్తిరెడ్డికి, రాజేశ్వరరెడ్డికి సయోధ్య కుదిర్చిన కేటీఆర్
- నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలంటూ విజ్ఞప్తి
- జిల్లాలోని మూడు సీట్లనూ కైవసం చేసుకోవాలని పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మొదటి నుంచి బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారిన జనగామ అసెంబ్లీ నియోజకవర్గపు పంచాయితీ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆ టిక్కెట్‌ను ఆశిస్తున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికి మధ్య ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ మంగళవారం సయోధ్య కుదిర్చారు. దీంతో పల్లాకు జనగామ టిక్కెట్ ...13లో



అడుగు పడని అచ్చంపేట

ముఖ్యమంత్రి డిజైన్ చేసిన ఎత్తిపోతల ప్రాజెక్టుకు మోక్షం కరువు

- ఎన్నికల కోడ్‌తో ఆగిన శంకుస్థాపన కార్యక్రమం

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

స్వయంగా ముఖ్యమంత్రి డిజైన్ ఫైనల్ చేసినా.. అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టుకు మోక్షం కలగ లేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి కోసం రూపొందించిన అచ్చంపేట ఎత్తిపోతల పథకం కాగితాలకే పరిమితమైంది. ఎన్నికల ముందు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాటు జరిగినా కోడ్ అమల్లోకి రావడంతో అదీ ఆగిపోయింది.

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతలలో అంతర్భాగంగా అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 71,600 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకం ఐదేండ్లుగా సర్వేకే పరిమితమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బాగా వెనుకబడింది అచ్చంపేట ఏజెన్సీ ప్రాంతం. ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందుబాటులో లేదు. 2018 ఎన్నికలకు ముందు అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఏజెన్సీ ప్రాంతానికి సాగు నీరు అందిస్తామని బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు. అమ్రాబాద్, పదర, బల్మూర్, అచ్చంపేట లింగాల, ఉప్పునుంతల, తెలకపల్లి తదితర మండలాల పరిధిలో 71,600 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి 25 కిలోమీటర్ల కాల్వ తవ్వి బల్మూరు ప్రాంతానికి నీటిని అందిస్తామన్నారు. లింగాల మండలంలోని సూరారం గ్రామం దగ్గర ఏర్పాటు చేసిన లిఫ్ట్ ద్వారా 70 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసి బల్మూరు దగ్గర కొత్తగా నిర్మించిన ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను నింపుతారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 2.50 ఎంసీలుగా నిర్ణయించారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ నుంచి కొత్త కాల్వను తీసి బల్మూరు, లింగాల, అచ్చంపేటలో 57,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. రెండు స్టేజీల్లో



కలిపి రూ.2500 కోట్లు ప్రతిపాదించారు. మొదటి స్టేజి కింద పనులను రూ.1530 కోట్లతో బృంద కంపెనీకి అప్పగించారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ నుంచి కాల్వ తీసి చంద్రవాగు ద్వారా చంద్ర సాగర్‌ను నింపుతామన్నారు. చంద్ర సాగర్ కట్టను మెరుగుపరిచి 0.3 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి, లిఫ్టు ద్వారా మున్ననూరు దగ్గర కొత్తగా నిర్మించే మద్దిమడుగు ఆంజనేయ స్వామి రిజర్వాయరుకు పంపించాలని ప్రణాళికవేశారు.

దీని సామర్థ్యం 1.5 ఎంసీలుగా నిర్ణయించారు. దీని ద్వారా అమ్రాబాద్ మండల పరిధిలో 14400 ఎకరాలకు సాగునీరు అందించాలనేది ప్రభుత్వ నిర్ణయం. అదేవిధంగా, నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలో 15 గ్రామాలు 23,220 ఎకరాలకు ...5లో

సీజన్ అదిరింది గురూ...

ఒకవైపు ఎన్నికలు.. మరోవైపు పండుగలు...

- ఓట్లతోపాటే బతుకమ్మ, దసరా నవరాత్రులు, దీపావళి
- ఈ రెండు నెల్లు సందడే సందడి
- అధికారికంగా బతుకమ్మ చీరెలు
- అనధికారికంగా మరెన్నో తాయిలాలు
- ఇటు మైకుల గోల..అటు టపాసుల మోత
- వేడెక్కనున్న శీతాకాలం



రాష్ట్రంలోని ఓటర్లకు బంపర్ బోనాంజా. ఒకవైపు ఎన్నికలు.. మరోవైపు పండుగలు... వెరసి ఇప్పటి నుంచి నవంబరు 30 వరకూ తెలంగాణ వ్యాప్తంగా హడావుడి.. అంతకుమించిన సందడి నెలకొననుంది. ఎన్నికలతోపాటే.. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు కలిసి సాగనున్నాయి. ప్రభుత్వం అధికారికంగా పంచే బతుకమ్మ చీరెలు, పార్టీలు అనధికారికంగా ఇచ్చే ఎన్నో తాయిలాలు... దీంతో ఓటరన్న ఉక్కిరి బిక్కిరి కావటం ఖాయం. గతేడాది నిర్వహించిన మునుగోడు ఉప ఎన్నిక, అంతకుముందు జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక చూసిన తర్వాత... వచ్చే నెల్లో రాష్ట్ర శాసనసభకు నిర్వహించబోయే ఎన్నికలు దేశంలోనే అత్యంత ఖరీదు కాబోతున్నాయని సర్వే సంస్థలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బి.వి.యన్.పద్మరాజు

ఓటరన్నను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలన్నీ పోటాపోటాగా, భారీగా ఖర్చు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటు న్నాయి. ఇందుకోసం రాబోయే పండగలను వేదికలుగా ...5లో

సారు షెడ్యూల్ ఖరారు..

- 15 నుంచి సీఎం సుడిగాలి పర్యటనలు 5లో..
- తొలుత హుస్నాబాద్ నుంచి ప్రారంభం

గాజా దిగ్బంధం

- ఆహారం, నీరు, ఇంధనం నిలిపివేత
- కొనసాగిన బాంబుల వర్షం
- 1600 మందికిపైగా మృతి
- సర్వం వదిలి లక్షలాది మంది వలస

జెరూసలేం : ఒకవైపు వైమానిక దాడులు మరోవైపు దిగ్బంధం..ఉగ్రవాద నెపం మోపి ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ఊగిపోతోంది. గాజాపై వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఆహారం, నీరు, ఇంధనం వంటి నిత్యవసరాలు ఆ ప్రాంతంలోకి వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించి అన్నివిధాలా దిగ్బంధం చేస్తోంది. ఇజ్రాయిల్ యుద్ధాన్ని ప్రారంభించలేదని, హమాస్ తెరలేపగా తాము యుద్ధాన్ని ముగిస్తున్నామని ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహూ పేర్కొన్నారు. హమాస్ దాడిని బూచిగా చూపి అమాయకులపై పాలస్తీనా ప్రజలే లక్ష్యంగా గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయిల్ విరుచుకుపడుతోంది. గాజాపైనా, పరిసర ప్రాంతాలపైనా మంగళవారం కూడా బాంబుల వర్షం కురిపించింది. భవనాలన్నీ శిథిలాల కుప్పలుగా మారాయి. భయకంపితులైన లక్షలాది మంది ప్రజలు సురక్షితంగా వుండే చోటు కోసం వెతుకులాడుతున్నారు. నలుదిక్కులా ఇజ్రాయిల్ సైన్యంతో దిగ్బంధించడంతో 'పట్టీ' లాంటి చిన్న ప్రాంతంలో సురక్షితమైన ప్రదేశమే కానరాకుండా పోయింది. ఎటు చూసినా బాంబుల మోతే, ఆర్తనాదాలే. ఆయుధాల గిడ్డంగులు, తయారీ ఫ్యాక్టరీలతో పాటూ సైనిక లక్ష్యాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు కొనసాగిస్తున్నాయి.

గాజాలో బాధితులకు సాయమందించేందుకు మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాల్సిందిగా సహాయక సంస్థలు విజ్ఞప్తులు చేస్తున్నాయి. బాధితుల ఆక్రందనలతో ఆస్పత్రులు భీతి గొలుపుతున్నాయి. చాలాచోట్ల ఔషధాలకు కొరత ఏర్పడుతోంది. గాజాలోకి ఆహారం, మందులు, ఇంధన సరఫరాలు ఏవీ వెళ్లకుండా ఇజ్రాయిల్ కట్టడి చేసింది. ఈజిప్ట్ నుండి వున్న ఏకైక దారిని కూడా మంగళవారం నాడు మూసివేశారు. ఇజ్రాయిల్ సైన్యం ఆపకుండా దాడులు కొనసాగిస్తుండడంతో



పరిస్థితి బీభత్సంగా మారింది. ఇప్పటికే ఇరు పక్షాల వైపు 1600 మంది మరణించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే వుంటుందని భావిస్తున్నారు. మరోవైపు గాజాలోని హమాస్, ఇతర మిలిటెంట్ గ్రూపులు 150 మందికి పైగా సైనికులను, పౌరులను బందీలుగా వుంచినట్టు ఇజ్రాయిల్ పేర్కొంది. మంగళవారం నాడు 3,60,000 మందికి పైగా రిజర్విస్టులను రంగంలోకి దింపడంతో ఈ ఘర్షణలు ఇంకా పెచ్చరిల్లుతాయని భావిస్తున్నారు. ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలో హమాస్ దాడి చేసి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలపై తాము పట్టు సాధించామని ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం తెలిపింది.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణ చర్యలపై వివరణివ్వండి: హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షల్లో వైఫల్యం చెందడం లేక ఆశించిన ఫలితాలు సాధించని విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చెప్పాలంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై దాఖలు చేసిన కౌంటరు అమలుకు అనుసరించే విధానం చెప్పాలని కూడా ఆదేశించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే. జస్టిస్ శ్రవణ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు ఆత్మహత్యల అధికారులు చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది ఎం. శంకర్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఇంటర్మీడియట్ బోర్డు తరపున కమిషనర్ నవీన్ మిట్టల్ కౌంటరు దాఖలు చేశారు. 2023 మార్చిలో ప్రయివేటు, ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధికారులతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేశామని వివరించారు. సందేహాలు నివృత్తి చేసేందుకు ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. టెలి కౌన్సెలింగ్ నిమిత్తం టోల్ ఫ్రీ నెంబరును కేటాయించినట్టు తెలిపారు. కార్పొరేట్ కాలేజీలు ఎక్కువగా ఒత్తిడి పెంచుతున్నాయనీ, కనీసం ఎనిమిది గంటలు నిద్ర పోవడానికి అవకాశమివ్వాలనీ, సీనియర్ విద్యార్థులను కౌన్సెలర్ గా నియమించడం, ప్రతి క్యాంపస్‌లో ఒక ప్రిన్సిపాల్‌ను నియమించడం వంటి సూచనలు చేశామని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాల సమయంలోనే విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నాయా? అని హైకోర్టు ప్రశ్నించింది. పరీక్షా ఫలితాలు వెల్లడించకుండా వేరే విధంగా విద్యార్థుల ఉత్తీర్ణత గురించి తెలిపే అంశాలపై ప్రభుత్వం, పిటిషనర్లు సూచనలు చేయాలని కోరింది. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఉండే సూచనలు కూడా చెప్పాలని ధర్మాసనం ఇరుపక్షాలను అడిగింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. షెడ్యూల్ ఏరియాలో మైనింగ్‌పై వివరణ ఇవ్వండని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

పంటల బీమా స్కీం ఎందుకు అమలు చేయడం లేదు?

నవతెలంగాణ -హైదరాబాద్

రైతులకు ఎక్కువ లాభం కలిగే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని రాష్ట్రాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పంటలతో సంబంధం లేకుండా ప్రభుత్వం రూ.10 వేలివ్వడం బాగానే ఉందనీ, అయితే, అంతకంటే ఎక్కువ లాభం ఉంటే పంటలా బీమా పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలంది. ఈ పథకం ఎవరిదో, ఏ ప్రభుత్వానిదో ముఖ్యం కాదనీ, రైతులకు ప్రయోజనమా? కాదా? అనేది కీలకమని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ప్రకటించింది. పీఎంఎఫ్‌బీఐ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ లాయర్ రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణించి మంగళవారం విచారించింది. గత మార్చి, ఏప్రిల్ నెలల్లో లక్షల ఎకరాల్లో పంటల నష్టం జరిగిందని పిటిషనర్ చెప్పారు. పంటల బీమా ఉండి ఉంటే రైతులకు మేలు జరిగేందన్నారు. రాష్ట్రంలో 2.20 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉందనీ, 58.33 లక్షల మంది రైతులు వివిధ రకాల పంటలు పండిస్తున్నారని తెలిపారు. కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కూడా అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆరు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

క్షేమంగానే అమర్త్యసేన్

- ఆయన కుమార్తె నందన వెల్లడి

న్యూఢిల్లీ : ప్రఖ్యాత ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ (89) క్షేమంగా ఉన్నారని ఆయన కుమార్తె నందనా సేన్ తెలిపారు. ఆయన చనిపోయారంటూ మంగళవారం సాయంత్రం సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాపించాయి. ఈ ఏడాది ఆర్థికశాస్త్ర నోబెల్ బహుమతికి ఎంపికైన మహిళా ఆర్థిక వేత్త క్లాడియా గోల్డెన్ పేరుతో ట్విట్టర్ (ఎక్స్)లో ఉన్న అన్‌వెరిఫైడ్ ఖాతాలో 'అమర్త్యసేన్ ఇకలేరు' అంటూ ఒక ట్వీట్ చేయడంతో ఈ వార్త కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది. అయితే అది తప్పుడు వార్త అని అమర్త్యసేన్ కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వదంతులను నిజం అనుకొని ఆందోళన వ్యక్తం చేసినవారందరికీ అమర్త్యసేన్ కుమార్తె నందనాసేన కృతజ్ఞతలు తెలిపారు. తమ తండ్రి సంపూర్ణంగా క్షేమంగా ఉన్నారని ట్వీట్ చేశారు. 'మిత్రులారా, నాన్న పట్ల మీ ఆందోళన వ్యక్తం చేసినందుకు కృతజ్ఞతలు, అయితే అది తప్పుడు వార్త. నాన్న పూర్తిగా క్షేమంగా ఉన్నారు. కేంబ్రిడ్జిలో నాన్నతో పాటు కుటుంబ సభ్యులమంతా వారమంతా అద్భుతంగా గడిపాం. సోమవారం రాత్రి వీడ్కోలు చెబుతున్న సమయంలోనూ ఆయన ఇచ్చిన ఆత్మీయ కౌగిలింత ఎప్పటిలానే



ధృడంగా ఉంది. హార్వర్డ్ యూనివర్సిటీలో ఆయన వారానికి రెండు కోర్సులు చొప్పున బోధిస్తున్నారు. అలాగే ఆయనకు సంబంధించిన రంగంలో ఒక పుస్తకాన్ని కూడా రాస్తున్నారు. ఎప్పటిలాగే బిజీగా గడుపుతున్నారు' అని నందనాసేన పేర్కొన్నారు.

రేవంత్‌పై ఎన్ని కేసులున్నాయో చెప్పండి

- పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ

నవతెలంగాణ -హైదరాబాద్

తనపై పెట్టిన కేసుల వివరాలివ్వడం లేదంటూ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వేసిన కేసులో హైకోర్టు పోలీసులకు నోటీసులను జారీ చేసింది. రేవంత్‌రెడ్డి అడిగిన కేసుల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తున్నామనీ, అప్పటిలోగా రేవంత్‌పై వివిధ పీఎస్‌ల్లోని కేసుల వివరాలు అందజేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలకు నోటీసులిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యిందనీ, పిటిషనర్ తన నామినేషన్ వేయాల్సిఉన్న నేపథ్యంలో కేసుల వివరాలివ్వకపోతే ఎలాగని పోలీసులను జస్టిస్ భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ లాయర్ వాదిస్తూ.. విపక్ష నేతగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా చేసిన రేవంత్‌పై ఎన్నో కేసులు నమోదయ్యాయనీ, వాటిని కింది కోర్టు కొట్టేసిందని తెలిపారు. సుమారు 20 కేసుల నుంచి రేవంత్ బయటపడ్డారని చెప్పారు. అయితే, తెలియకుండా ఇంకా ఏమైనా కేసులున్నాయో లేదో తెలుసుకునేందుకు ఈ నెల 3న డీజీపీకి లేఖ రాస్తే కేసుల వివరాలు ఇవ్వలేదని చెప్పారు. వివరాలిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. విచారణ 17కి వాయిదా పడింది.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఊరట

నవతెలంగాణ-హైదరాబాద్

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికను సవాల్ చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఓటరు శ్రీనివాస్‌రాజు దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌పై జస్టిస్ ఎం.లక్ష్మణ్ సుదీర్ఘ వాదనల తర్వాత ఈ నెల 9న తీర్పును రిజర్వులో పెట్టారు.

మంగళవారం పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు చెప్పారు. అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల సమయంలో తొలుత దాఖలు చేసిన ఎలక్షన్ అఫిడవిట్‌ను వాపస్ తీసుకుని మళ్లీ సమర్పించడం చట్ట వ్యతిరేకమన్న పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు చెప్పారు. ఆస్తులు, అప్పులపై తప్పుడు సమాచారమిచ్చారనీ, భార్య పేరిట ఉన్న ఆస్తుల వివరాలను సమర్పించలేదని పిటిషన్ వాదనను తోసిపుచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

తాత్కాలిక వాయిదా...

యూనియన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానం

- కార్మిక వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి : పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సమావేశంలో స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తిస్తామని చెప్పే ప్రధాని మోడీ దేశంలో మధ్యాహ్న భోజన కార్మికులను మాత్రం కార్మికులుగా గుర్తించడం లేదని విమర్శించారు. అదే విధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు జీవోలను అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. చట్టాలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్వులను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం గద్దె దిగితేనే న్యాయం జరుగుతుందని సూచించారు. కార్మికులుగా గుర్తించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, హెల్త్ కార్డులివ్వాలనీ, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలనీ, పెన్షన్ కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్న దాంట్లో న్యాయముందని తెలిపారు. తెలంగాణ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం వండే షెడ్లలో ఇప్పటికీ వెట్టిచాకిరీ, బానిసత్వం అమల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లను మ్యానిఫెస్టోల్లో చేర్చాలని ఆయన అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ప్రభుత్వం గడువు ముగిసేనాటికి కూడా మధ్యాహ్న భోజన కార్మికులను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు.

సీఐటీయూ కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ సీఎం అల్పాహార పథకం మంచిదేననీ, దాన్ని సిద్ధం చేసే కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇక సీఎం కేసీఆర్ ఇచ్చే హామీలను నమ్మేది లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ అధికారంలోకి రావడం, రాకపోవడమనేది మధ్యాహ్న భోజన కార్మికులపైనే ఆధారపడి ఉంటుందనీ, ఓటు సత్తా చూపించాలని సూచించారు. కేసీఆర్ తలరాతను రాయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ కు రాజకీయ సమాధి కట్టాలని కోరారు.

ఎస్.రమ మాట్లాడుతూ మాట తప్పిన ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్రలో నిలిచారని విమర్శించారు. దళిత సీఎం, డబుల్ బెడ్ రూం ఇండ్లు, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు తదితర అనేక హామీలను అమలు చేయకుండా విస్మరించారని తెలిపారు. మధ్యాహ్న భోజనంలోకి వాడే సరుకుల ధరలకు, ప్రభుత్వం ఇస్తున్న దానికి పొంతన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఎదురు పెట్టుబడి పెట్టే ఏకైక రంగం మధ్యాహ్న భోజనం పథకం అని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టామని తెలిపారు.

యూనియన్ ఏర్పడిన తర్వాత చేసిన పోరాటాల ఫలితంగా వేతనం నిర్ణయించారని చెప్పారు. ఆ వేతన పెంపు కోసం దశల వారీగా చేసిన పోరాటాల ఫలితంగా సీఎం ప్రకటన వచ్చినా ఇంకా అమలు చేయలేదని తెలిపారు. అన్ని రకాల ఆటంకాలను ఎదుర్కొని మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె చేశారని కొనియాడారు. రాబోయే కాలంలో సమరశీల పోరాటాలుంటాయని చెప్పారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలన చూశామనీ, ఇక బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఎం.సులోచన, రాజేశ్వరి, సుల్తాన్, స్వప్న, సరస్వతి, మాయా, బాల లక్ష్మి, రాష్ట్ర నాయకులు రమ్య, యాకలక్ష్మి గీతా, కృ ష్ణమాచారి, గోవర్ధన్, బాలరామ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమ్మె వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో 104 ఉద్యోగుల సమ్మెను వాయిదా వేసినట్టు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ - సీఐటీయూ అనుబంధం) తెలిపింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, వి.విజయవర్ధన్ రాజు, నవీన్ తదితరుల నేతృత్వంలో ప్రతినిధులు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదనీ, దీంతో హైదరాబాద్‌లో కమిషనర్ కార్యాలయంతో పాటు జిల్లాల్లో ధర్నాలు చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 12న సమ్మె నోటీస్ ఇచ్చినట్టు గుర్తుచేశారు. 2021 అక్టోబర్ 29న వాహనాలను పూర్తిగా నిలిపేసిన ప్రభుత్వం ఉద్యోగులను రీ-డిప్లై చేసి స్లాబ్‌ల పద్ధతిలో వేతనాలు చెల్లిస్తుండటంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. డీహెచ్‌ను కలిసిన వారిలో 104 ఉద్యోగ నాయకులు సాగర్, సుభాష్, శ్రావణ్, శ్రీనివాస్, మన్మధరావు, మహేట్కుందర్, రాజేష్, శేఖర్, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి

- కాంగ్రెస్ నేత మల్లు రవికి గౌడ, కల్లుగీత సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గౌడ సబ్‌ప్లాన్‌ను ప్రవేశ పెట్టా లని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమ న్వయ కమిటీ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ మ్యానిఫెస్టో సలహాదారులు మల్లు రవిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం చైర్మెన్ బాలగౌనీ బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గౌడ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన అంశాన్ని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు. వైన్స్, బార్లలో 50 శాతం సబ్సిడీతో కల్లుగీత సొసైటీలకు ఇవ్వాలనీ, లిక్కర్ కంపెనీలను 50 శాతం గౌడ్‌లకే ఇవ్వాలని చెప్పారు. 50 ఏండ్లు దాటిన గీత వృత్తిదారులకు రూ.ఐదు వేల పెన్షన్ చెల్లించాలన్నారు. గీత వృత్తిని ఆబ్కారీ శాఖ నుంచి తొలగించాలనీ, ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును, సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని కోరారు. గౌడల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చిన పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

ఫేక్ నేతలు.. ఫేక్ సర్వేలు..

- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఫేక్ నేతలతో ఫేక్ సర్వేలు చేయిస్తుందనీ, ఇది ఆ పార్టీకి మొదటి నుంచి అలవాటేనని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీ ఓటర్ అంటేనే కాంగ్రెస్ ఓటర్‌గా మారిపోయిందని విమర్శించారు. కేసీఆర్‌కు ఉన్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ కండ్లు మండుతున్నాయని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని ఆపలేరని తెలిపారు.ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నా.. పార్థా దాస్ చాణక్య కన్సల్టెన్సీ, సీ ఓటర్ నిర్వహించే సర్వేల్లో కాంగ్రెస్ పార్టీనే ముందుంటుందని చెప్పటం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఆయా సంస్థల సర్వేలకు ప్రమాణికం ఎంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

చర్చల దశలోనే 'పొత్తులు'

సీనియర్లతో సంప్రదించాకే సీట్లపై నిర్ణయం

- కాంగ్రెస్‌పై తప్పుడు వార్తలు ప్రసారం చేస్తే చర్యలు
- మెట్రో ప్రకటనలకు అవకాశం ఇవ్వాలి
- అధికారులు బీఆర్ఎస్‌కు కొమ్ముకాస్తున్నారు
- బస్సు యాత్ర ఎప్పుడనేది ఆలోచిస్తున్నాం.
- కేటీఆర్ తన తండ్రిని జంతువుతో కరెక్టుగానే పోల్చారు : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పొత్తుల అంశం చర్చల దశలోనే ఉందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. సీట్ల విషయంలో పార్టీ సీనియర్ నాయకులను సంప్రదించిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించేంత వరకు మీడియా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు వార్తలు ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెట్రోపై అధికార పార్టీ ప్రకటనలకు అవకాశం ఇస్తున్నారనీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్ర ఎప్పుడనేది ఆలోచిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత బస్సు యాత్ర చేయాలా? మధ్యలో చేయాలా? అనేది అధిష్టానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంత్రి కేటీఆర్ తన తండ్రిని జంతువుతో కరెక్టుగానే పోల్చారని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే అధ్యక్షతన జరిగింది. తాజా రాజకీయాలు, బస్సుయాత్ర, అభ్యర్థుల ప్రకటన, పొత్తులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. సీట్ల విషయంలో సీనియర్ల హోదాలు, గౌరవం తగ్గకుండా సమన్వయం చేసేందుకు కేసీ వేణుగోపాల్‌తో కమిటీని నియమించినట్టు తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా కమిటీ సభ్యులు ఠాక్రే, దీపాదాస్ మున్షి, మీనాక్షి నటరాజన్, కే. జానారెడ్డి అందుబాటులో ఉంటారని తెలిపారు. కొంత మంది అధికారులు బీఆర్ఎస్‌కు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘించి కొందరు అధికారులు నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. పెన్షన్ తప్ప మిగతా వాటికి ఎన్నికలయ్యేవరకు ఎలాంటి నిధులు విడుదల చేయొద్దని కోరారు. చట్టంలో లొసుగులు వాడుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు కొమ్ముకాసే పోలీస్, ఐఏఎస్, రెవెన్యూ, అన్ని విభాగాల అధికారుల వివరాలను కాంగ్రెస్ సేకరిస్తోందని హెచ్చరించారు. అందుకోసం ఓ ప్రత్యేక కమిటీ నియమించామనీ, తగిన వివరాలతో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల సొంత మీడియా కాంగ్రెస్‌పై అపోహలు సృష్టిస్తోందన్నారు. తప్పుడు వార్తలు వేసే మీడియా యజమాన్యాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. తప్పుడు వార్తలు వేసి కార్యకర్తల్లో గందరగోళం సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడితే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన ఆరు నెలల ముందు వేసిన అన్ని టెండర్లపై అధికారంలోకి రాగానే సమీక్షిస్తామన్నారు. భూముల అమ్మకాలనూ సమీక్షిమిస్తామని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగానే ప్రభుత్వం పని చేయాలని కోరారు. నియమ, నిబంధనలు ఉల్లంఘించి బీఆర్ఎస్‌కు ప్రయోజనం చేకూర్చే అధికారులందరిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

కాంగ్రెస్‌లోకి సిరిసిల్ల బీఆర్ఎస్ నేతలు

కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిరిసిల్ల నియోజకవర్గానికి చెందిన మాజీ ఫ్లోర్ లీడర్ ఏళ్ల లక్ష్మీ నారాయణ, మాజీ సర్పంచ్ వైద్య శివప్రసాద్, సీనియర్ నాయకుడు మాన్య ప్రసాద్, తదితరులకు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'చెరువు రక్షణకు ఎంత సమయం కావాలి?'

నవతెలంగాణ-హైదరాబాద్

రామంతాపూర్ పెద్దచెరువు, ఇతర చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలు నివేదించేందుకు ఎంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. చెరువుల రక్షణకు కంచె వేసేందుకు, ఎఫ్‌టీఎల్ రక్షణకు 2005 నుంచి చర్యలు తీసుకుంటూనే ఉంటారా? అని నిలదీసింది. ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ కె ఎల్ వ్యాస్ వేసిన పిల్‌పై మంగళవారం హైకోర్టులో చీఫ్‌జస్టిస్ అలోక్ అరధే బెంచ్ విచారించింది. ఈ విచారణకు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఇతర శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ నెల 12న జరిగే విచారణకు కమిషనర్ మళ్లీ రావాలనీ, చెరువు రక్షణకు తీసుకున్న చర్యలను వివరించాలని చీఫ్ జస్టిస్ ఆదేశించారు.

కల్తీ విత్తనాల కట్టడికి చర్యలేంటి? : హైకోర్టు



నవతెలంగాణ -హైదరాబాద్

రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్నారనే పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరధే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. కల్తీ విత్తనాల సరఫరా కట్టడికి తీసుకున్న చర్యలు చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2014-22 కాలంలో కల్తీ విత్తనాలకు సంబంధించి సుమారు వెయ్యి కేసులు నమోదయ్యాయనీ, అధికారుల చర్యలు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయని పిటిషనర్ వాదించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ హెూం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

హ్యాట్రిక్ ఖాయం

బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్‌బ్లాక్

- కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కైలాసంలో పెద్ద పాము మింగినట్టు
- కాంగ్రెస్ అంటే మాటలు, మూటలు, ముఠాల పార్టీ
- గౌరవెల్లి ప్రాజెక్టు హుస్నాబాద్‌కు గొప్ప వరం

ఈ నెల 15న హుస్నాబాద్ నుంచి ఎన్నికల శంఖారావం

వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హైదరాబాద్‌కు ఈశాన్యంలో ఉన్న హుస్నాబాద్ బీఆర్ఎస్ పార్టీకి కలిసి వచ్చే నియోజకవర్గమని, ఎవరు అవునన్నా.. కాదన్నా.. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ విజయం ఖాయమని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను, సభాస్థలిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీష్ కుమార్‌తో కలిసి మంగళవారం మంత్రి పరిశీలించారు. అనంతరం పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ హుస్నాబాద్ నుంచి ఎన్నికల శంఖారావం పూరించనున్నారని తెలిపారు. అక్టోబర్ 15న లక్ష మందితో హుస్నాబాద్ గడ్డమీద ప్రజా ఆశీర్వాద సభ చేపట్టామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సిద్ధమైందని, అన్ని వర్గాల అభ్యున్నతికి, జనరంజకమైన పాలనకు సీఎం కేసీఆర్ రూపకల్పన చేశారని చెప్పారు. బీఆర్ఎస్ గెలుపుకోసం ప్రతి కార్యకర్తా సైనికుడివలె పనిచేయాలని పిలుపునిచ్చారు. నేడు దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకున్నామని, ఈరోజు దేశంలోనే వరి ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలది కల్లబొల్లి కబుర్లు తప్ప వారు ప్రజలకు చేసిందేమీలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అంటే మాటలు, మూటలు, ముఠాల పార్టీ అని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు.

హుస్నాబాద్ నియోజకవర్గం ఒకప్పుడు కరువు పీడిత, కల్లోలిత ప్రాంతమని.. నేడు అభివృద్ధికి చిరునామాగా మారిందని తెలిపారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ప్రజల చిరకాల వాంఛ గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశారన్నారు. ఆసత్య సర్వేల పేరిట అధికారంలోకి వస్తామని కాంగ్రెసోళ్లు గ్లోబల్స్ ప్రచారం చేస్తున్నారని, కనీసం టికెట్లు కూడా ఇచ్చుకోలేని దయనీయ పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. తప్పిపోయి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కైలాసంలో పెద్ద పాము మింగినట్టు తెలంగాణ అభివృద్ధి కింద పడుతుందని తెలిపారు.

దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం నీటితో తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. అక్టోబర్ 15న సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ ఫామ్‌లు అందించి, బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసి మొట్టమొదటి ఎన్నికల సభ హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో సీఎం కేసీఆర్ ప్రజలకు తీపి కబురు చెబుతారన్నారు.

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ గడ్డ సీఎం కేసీఆర్ ఎన్నికల సమర శంఖారావం పూరించడానికి మరొకసారి వేదిక కాబోతుందని, 2018లోనూ ఇక్కడ నుంచే ఎన్నికల సన్నాహక సభ నిర్వహించి ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ సారి అక్టోబర్ 15న ఆదివారం మధ్యాహ్నం 3:00 గంటలకు హుస్నాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభ ఉంటుందన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మరొకసారి సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు వంగ వెంకట్రామిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మండలాల ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వారికే దళితబంధా..?

- గ్రామ పంచాయతీని ముట్టడించిన దళితులు



నవతెలంగాణ- ధర్మపురి


అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకే దళితబంధు ఇస్తున్నారని దళితులు గ్రామ పంచాయతీని ముట్టడించారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం జరిగింది.అర్హులైన వారికి దళితబంధు ఇవ్వడం లేదని, బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ లను నిలదీశారు. బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన నిరుపేద దళితులం దరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించి అర్హులందరికీ దళితబంధు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రవర్తనా నియమావళి అమలు కోసం స్రీనింగ్ కమిటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఏర్పాటయ్యే ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మెన్‌గా, ఆయా శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ) కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ఎంసీసీ అమలు ప్రతిపాదనలను పరిశీలించి ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదిస్తుందని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వర్ణకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



హైదరాబాద్ : ఇటీవల ఏర్పడిన మేడిపల్లి మండలం విశ్వకర్మ స్వర్ణకార సంగం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రెసిడెంట్‌గా సుదర్శన చారి, వైస్ ప్రెసిడెంట్‌గా వలబోజు సోమనరసింహచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వలబోజు సత్యనారాయణ చారీ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా వినోద్ చారి, కోశాధికారిగా రవిందరా చారి, గౌరవ అధ్యక్షులుగా కుమార్ చారి, ప్రభాకర చారి, సలహాదారునిగా కొండపర్తి నరసింహా చారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వర్ణకారులందరినీ కలుపుకుపోతామనీ, వారి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

అమిత్‌షా... సీసీఐ పునరుద్ధరణేది?

- అదానీ చేతుల్లో బీజేపీ స్టీరింగ్ : మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన ఆదిలాబాద్ పర్యటనలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పునరుద్ధరణపై కనీసం మాట్లాడకపోవడం దారుణమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్‌షా చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వానిది 'డబుల్ ఇంజిన్" కాదు... ట్రబుల్ ఇంజిన్ సర్కార్' అని ఎద్దేవా చేశారు. కారు స్టీరింగ్ కేసీఆర్ చేతుల్లో పదిలంగా ఉందని తెలిపారు. బీజేపీ స్టీరింగ్ మాత్రం అదానీ లాంటి కార్పొరేట్ల చేతుల్లో ఉందని విమర్శించారు. రైతు ఆత్మహత్యలు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఆదివాసీల సంక్షేమంపై మాట్లాడే అర్హత అమిత్ షాకు లేదని తెలిపారు. బీజేపీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయ హెూదా, ఆదిలాబాద్‌లో సీసీఐ పునరుద్ధరణపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

అసత్యాల అమిత్ షా : కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశానికి దిక్సూచిగా అనేక విప్లవాత్మక పథకాలను అమలుచేస్తున్న సీఎం కేసీఆర్‌ను పట్టుకుని ప్రజావ్యతిరేకి అని అమిత్‌షా మాట్లాడటం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ విమర్శించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ సభలో అమిత్‌షా అన్నీ అసత్యాలే మాట్లాడారని విమర్శించారు. అమిత్‌షాతో రాష్ట్ర ప్రజలకు పావల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. గాడిద గాత్రానికి ఒంటె 'ఓహెూ..' అంటే, ఒంటె అందానికి గాడిద 'ఆహా' అన్నట్టుగా మోడీ ప్రభుత్వ పనితీరు గురించి అమిత్ షా చెప్పుకున్నారని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ గడ్డమీద అసత్యాలతో ప్రచారం చేస్తే ఇక్కడి ప్రజలు నమ్మరనీ, తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి అండగా నిలబడే బీఆర్ఎస్ పార్టీకే మద్దతుగా ఉంటారన్న విషయం త్వరలో జరిగే ఎన్నికలతో బీజేపీ నేతలకు అర్థం అవుతుందని పేర్కొన్నారు.

అబద్ధాలు చెప్పటంలో అమిత్ షా దిట్ట.. మంత్రి సత్యవతి రాథోడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసత్యాలు చెప్పటంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు మించిన వారు దేశంలో ఎవరూ లేరని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం ఆదిలాబాద్‌లో జరిగిన బీజేపీ జనగర్జన సభలో ఆయన అన్నీ అబద్ధాలు చెప్పారని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం స్థలం చూపించలేదని చెప్పటం మూర్ఖత్వమేనన్నారు. 2014 నుండి యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని అనేక పర్యాయాలు ప్రధాని మోడీని కలిసి డిమాండ్ చేసిన విషయం నిజం కాదా?అని ఆమె ప్రశ్నించారు. ములుగు జిల్లా జాకారంలో రాష్ట్ర ప్రభుత్వం 335ఎకరాల స్థలాన్ని కేటాయించిన ఫైళ్లను సీఎం కేంద్రానికి నివేదించిన విషయాన్ని గుర్తుచేశారు. గిరిజనుల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే ఇన్నేళ్ళ ఆమోదించకుండా తొక్కిపెడుతున్నదెవరో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రూ.50 కోట్లతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జోడేఘాట్ నిర్మించామని తెలిపారు. గిరిజనుల ఓట్లు దండుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సంపాదకీయం

'కోడ్'కూసిన వేళ..!

దేశంలోని ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఢంకా మోగింది. షెడ్యూల్ తాజాగానే వచ్చినా, ఆ వాతావరణం ఎప్పటినుంచో ఉంది. కోడ్ అమల్లోకొచ్చినా, నోటిఫికేషన్ మాత్రం నవంబరు మూడున రానుంది. అన్ని పార్టీలు తమ భవితవ్యాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డాయి. తెలంగాణ రాజకీయాలు మాత్రం కప్పల తక్కెడనే తలపిస్తున్నాయి. జంప్‌జీలానీల జోరు నడుస్తున్నది. బీఆర్ఎస్, కాంగ్రెస్, అధికారంలోకి రావడానికి "శక్తివంచన లేకుండా" పావులు కదుపుతున్నాయి. పదునైన వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. బీజేపీ డీలాపడింది. ఈ క్రమంలో ఎన్నికల్లో విలువలు, వలువల సంగతే మరిచిపోయాయి. ఇంకా నోటిఫికేషన్ రానేలేదు, అప్పుడే గెలుపు కోసం నానాగడ్డీ కరుస్తున్నారు. ప్యాకేజీల పేరుతో బల్క్‌గా టికెట్ల బేరసారాలు బాహాటంగానే సాగుతున్నాయి. పార్టీలో చేరికల కమిటీ వేసిన బీజేపీ, మాఫీయాను లీడ్ చేసే వ్యక్తి చీకోటి ప్రవీణ్‌ను అక్కున చేర్చుకుంది. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి దూకిన నేతకు నేరుగా ఎంబీసీ కార్పొరేషన్ పదవిని కట్టబట్టింది గులాబీ సర్కారు. ఆరు గ్యారెంటీలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్, అధికార పార్టీని ముప్పుతిప్పలు పెట్టేందుకే పూనుకుంది. ఇలా ఈ పార్టీలు రకరకాల చర్యల ద్వారా ప్రజలకు హామీల పేర మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. కోడ్ కూసిందో లేదో అప్పుడే అక్రమాల తుట్టే కదిలినట్టయింది. తొలిరోజే రూ.2 కోట్లకు పైగా పోలీసు తనిఖీల్లో పట్టుబడటం గమనార్హం.



బీఆర్ఎస్ మ్యానిఫెస్టో 15న రానుంది. అప్పుడే సీఎం ఎన్నికల సభల తేదీలు ఖరారయ్యాయి. దీన్ని అవకాశంగా తీసుకుని బతుకమ్మ చీరెల పంపిణీని తాయిలంగా మార్చేసింది కేసీఆర్ ప్రభుత్వం. ఎన్ని హామీలిచ్చినా పార్టీలో నుంచి వెళ్లేవారే తప్ప, వచ్చే జాడ కనిపించడం లేదు బీజేపీకి. ఏడాది కింద చేరిన వారంతా తిరుగు ప్రయాణానికి సన్నాహాలు చేసుకుంటున్నట్టు వినికిడి. ఆలస్యంగా అభ్యర్థులను ప్రకటించడమే బీజేపీ వ్యూహమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సెలవిచ్చారు. మిగతా పార్టీల్లో టిక్కెట్లు దక్కని వారికి ఎర్రతివాచీ వేసి మరీ పార్టీలోకి లాక్కునే యోచన మో-షాల పార్టీకుంది. వీరికి అభ్యర్థులు కరువయ్యారనడానికి కిషన్‌రెడ్డి మాటలే సాక్ష్యం. సంఖ్యాలు కుదిరాయంటూ, మళ్లీ మేమే అధికారంలోకి వస్తామంటూ మంత్రి కేటీఆర్ సభలు, సమావేశాల్లో ఫీంకారాలు చేస్తూనే ఉన్నారు.

హాట్రిక్ సీఎం కేసీఆరే అంటూ కోరస్ పాడుతున్నాడు మంత్రి హరీశ్‌రావు. కాగా కాంగ్రెస్‌లో ఇంకా టికెట్ల పంచాయితీ కొలిక్కే రాలేదు, కుక్కర్లు పంచేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తూ దొరికారని బీఆర్ఎస్ ఆరోపణ. జనాభా లెక్కలు తీయని బీజేపీ ఏలుబడిలో, ఇండియా కూటమికి చెందిన బీహార్‌లో కులగణన చేయడం పట్ల రాష్ట్రంలో భారీగానే చర్చకు ఊతమిచ్చింది. కల్వకుంట్ల కవిత మాటల్లో అది కనిపించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దళితబంధు, బతుకమ్మ చీరల పరిస్థితిపైనా చర్చ జరుగుతున్నది. నిబంధనల ప్రకారమే పంపిణీ జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల సీఈవో చెప్పేశారు. కాగా ఎన్నికల కోసం వామపక్షాలు ఐక్యంగా నడవాలని నిర్ణయించుకున్నాయి. ఆ మేరకు చర్చలు జరుపుతున్నాయి. కాగా బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పైకి లేకపోయినా, అంతర్గతంగా అంతా సవ్యంగా ఉందనే వ్యాఖ్యానాలు ఉండనే ఉన్నాయి. మతోన్మాదులతో ఎలాంటి సం'బంధం' లేదంటూనే అంటకాగేందుకు తహతహలాడుతున్నాయి.

వియ్యం లేకపోతే అసలుకే ఎసరొస్తుందనే భయం బీఆర్ఎస్, బీజేపీలో నిజంగానే కనిపిస్తున్నది. ఎన్నికల్లో ప్రతిపక్షాలపై విజయం సాధించడానికి పదేండ్ల పాశుపతాస్త్రంతో సిద్ధంగా ఉన్నామంటూనే, ఒకింత ఉలిక్కిపాటు బీఆర్ఎస్‌లో ఉన్నది. తొమ్మిదేండ్లల్లో తెలంగాణకు రూ.9 లక్షల కోట్లు ఇచ్చామంటూ బీజేపీ ప్రచారం చేసుకుంటున్నా, ఆ పార్టీలో ఉత్సాహం కరువైంది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకోవడానికి విస్తృతంగా హామీలు ఇస్తూనే, మరోవైపు తమ పార్టీకే ఎందుకు ఓట్లు వేయాలో ప్రజలకు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ పరాజయాన్ని మూట కట్టుకున్న కాంగ్రెస్, ఈసారీ అమీతుమీకి సిద్ధమవుతున్నది. ఇటీవల అనేక సభలు, సమావేశాలతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్, త్వరలో రాహుల్, ప్రియాంకతో బస్సుయాత్రకు శ్రీకారం చుట్టే యత్నంలో ఉంది. నవంబరు 30న జరిగే ఎన్నికల కురుక్షేత్రానికి ఎవరికి వారు తమదైన శైలిలో వ్యూహంతో అడుగులేస్తున్నారు. ఎన్నికల్లో మ్యాజిక్కులు చేసి ఓటును కొల్లగొట్టే రాజకీయ పార్టీలపై ఓ కన్నేయాలి. కల్లబొల్లి కబుర్ల మాయలో పడకుండా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ఓటే ఆయుధంగా అప్రమత్తం కావాలి. ఎన్నికల్లో చర్చ జరగాల్సింది ప్రజా సమస్యల పైన. పునర్విభజన చట్టంపైన. సాగునీటి ప్రాజెక్టులపైన. షెడ్యూల్డ్ సంస్థలపైన. వీటిపై కాకుండా రాజకీయ తిట్లపురాణాలతో ప్రజలను గందరగోళ పరిచి తమ పబ్బంగడిపే యత్నాన్ని అడ్డుకోవాలి. విలక్షణ తీర్పునివ్వాలి. పారాహుషార్.

ఎన్నికల్లో మ్యాజిక్కులు చేసి ఓటును కొల్లగొట్టే రాజకీయ పార్టీలపై ఓ కన్నేయాలి. కల్లబొల్లి కబుర్ల మాయలో పడకుండా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి ఓటే ఆయుధంగా అప్రమత్తం కావాలి. ఎన్నికల్లో చర్చ జరగాల్సింది ప్రజా సమస్యలపైన. పునర్విభజన చట్టంపైన. సాగునీటి ప్రాజెక్టులపైన. షెడ్యూల్డ్ సంస్థలపైన. వీటిపై కాకుండా రాజకీయ తిట్లపురాణాలతో ప్రజలను గందరగోళ పరిచి తమ పబ్బంగడిపే యత్నాన్ని అడ్డుకోవాలి. విలక్షణ తీర్పునివ్వాలి. పారాహుషార్.

ఉగ్రవాదం సాకుతో పాలస్తీనాపై దాడులు!

పాలస్తీనా సమరయోధుల సంస్థ హమస్- ఇజ్రాయెల్ మధ్య మరోసారి చెలరేగిన పోరు ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారి తీస్తుందా అని ఒకవైపు ప్రపంచం ఆందోళన చెందుతుంటే, మరోవైపు అమెరికా స్టాక్ మార్కెట్‌లో ఆయుధ ఉత్పత్తి కంపెనీల వాటాల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇల్లు కాలుతుంటే బొగ్గులేరుకొనేందుకు చూడటం అంటే ఇదే. గత మూడేండ్ల లో ఎంతగా లేనంతగా సోమవారం ఒక్కరోజే ఎనిమిది శాతం ఎగువకు దూసుకుపోయాయంటే తమకు లాభాల పంట పండుతుందని మదుపు దార్లు వాటాల కొనుగోలు ఎగబడిన ఫలి తమే అది. ఇజ్రాయెల్‌కు మరింతగా సాయం చేయాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించటంతో ఆయుధ కంపెనీలకు చేతినిండా పని అన్నది తెలిసిందే. తాజా పరిణామాల్లో అటూ ఇటూ పెద్ద ఎత్తున జననష్టం, ఆస్తి విధ్వంసం గురించి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. తక్షణమే దాడులు నిలిపివేయాలన్న అభిప్రాయం వెల్లడవుతోంది. ఎవరు ముందు ప్రారంభించారు, ఎవరు ప్రతిఘటిస్తున్నారు అన్న విచక్షణలోకి పోతే పైకి హమస్ దాడులు కనిపించవచ్చుగానీ అంతకు ముందు ఇజ్రాయెల్ చేసిన దారుణాలు తక్కువేమీ కాదు. ఇది ప్రారంభం కాదు, అంతముకాదు. ఆకస్మికంగా జరిగిన ఈ పరిణామాలకు కారణాలు ఏమిటన్నది చూద్దాం. ఒకటి పాలస్తీనా ఏర్పాటును అడ్డుకోవటమే కాదు, ఐరాస దానికి కేటాయించిన ప్రాంతాలను క్రమంగా ఆక్రమించుకుంటున్న ఇజ్రాయెల్, దానికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాల వైఖరి ఒకటైతే, తక్షణ కారణాలేమిటన్నది మరొక అంశం.



ఎం కోటేశ్వరరావు
8331013288

పాలస్తీనా-ఇజ్రాయెల్ వివాదంలో జెరూసలెం పట్టణం ఎవరికి చెందాలన్నది ఒక అంశం. ఇటీవలి వరకు టెల్ అవీవ్‌లో ఉన్న తన ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాన్ని జెరూసలెంకు తరలించాలని అమెరికా నిర్ణయించటం ఏకపక్షం, పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమిస్తున్న ఇజ్రాయెల్ దుర్మార్గానికి మద్దతు ఇవ్వటమే. ఇంకా అమెరికా కనుసన్నలలో నడిచే అనేక దేశాలు అదే మాదిరి తమ కార్యాలయాలను కూడా జెరూసలెంకు తరలించాలని చూడటం యూదుల ఆక్రమణలను శాశ్వతం చేసే కుట్రలో భాగమే. జెరూసలెంలోని చారిత్రాత్మక అల్‌అక్సా మసీదును ఆక్రమించుకొనేందుకు ఇజ్రాయెల్ పూనుకోవటమే తాజాగా హమస్‌ను దాడులకు పురికొల్పిందని చెప్పవచ్చు. 2021 ఏప్రిల్‌లో రంజాన్, యూదుల పండుగ పాసోవర్ సందర్భంగా ఉద్రిక్తతలు తలెత్తాయి. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ముస్లి మేతరులు ఆ మసీదు ప్రాంగణాన్ని సందర్శించాలంటే అనుమతి తీసుకోవాలి. ఇజ్రాయెల్ ప్రభుత్వ ప్రోత్సా హంతో మసీదు పరిసరాలను ఆక్రమించిన యూదులు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాసోవర్ పండగ సంద ర్భంగా ప్రాంగణాన్ని దురాక్రమించి ప్రార్ధనలు జరి పారు. ఏప్రిల్ 14వ తేదీన ఇజ్రాయెల్ పోలీసులు బలవంతంగా ప్రవేశించి మసీదులో ఉన్న మైకుల వైర్లను తెంచివేశారు. ఎందుకంటే మసీదు పక్కనే జరుగుతున్న ఇజ్రాయెలీ అధ్యక్షుడి కార్యక్రమానికి అంత రాయం కలుగుతుందని సాకు చెప్పారు. తరువాత రెండు రోజులకు పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ పోలీసుల ఆంక్షలను తోసిపుచ్చి వేలాది మంది చేరి ప్రార్ధన చేశారు. మరుసటి నెలలో యూదు దురాక్రమణదార్లు పాలస్తీనియన్ల మీద జరిపిన దాడుల్లో వందలాది మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు. అదే ఏడాది ఇజ్రాయెల్-హమస్ మధ్య పదకొండు రోజుల పాటు దాడులు ప్రతి దాడులు జరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెలీ దళాలు ప్రవేశించి పాలస్తీనియన్ల మీద దాడులు చేశాయి. మసీదులో తిష్టవేసిన వారు తమ మీద రాళ్లు వేసినట్లు సాకు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ ఐదున కూడా ఇజ్రా యెల్ దళాలు మసీదు మీద దాడి జరిపాయి. మసీదులో ఉన్నవారు రాళ్లు విసిరినట్లు పాత కథనే తిరిగి వల్లించారు. అప్పటి నుంచి ఏదో ఒక సాకుతో అల్‌అక్సా మసీదు, పరిసరాల్లో ఉన్న పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించుకొనేందుకు ఇజ్రాయలీలు రెచ్చగొడుతుండటమే ఈ నెల ఆరున హమస్ దాడులకు కారణంగా చెబుతున్నారు. యాభై సంవత్సరాల క్రితం 1973 అక్టోబరు ఆరున ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలపై అరబ్బులు ఆకస్మికంగా దాడులు జరిపారు. నాటి ఉదంతాల గురించి ఇజ్రాయెలీ మీడియాలో గత కొద్ది రోజులుగా పాలస్తీనియన్లను రెచ్చగొడుతూ వార్తలు, విశ్లేషణలు వెలువడుతున్నాయి. దాన్లో భాగంగానే సిమ్‌చాట్ తోరా పేరుతో యూదులు పండుగ చేసుకుంటున్న పూర్వరంగంలో దాడులకు అక్టోబరు ఆరవ తేదీనే హమస్ కూడా ఎంచుకున్నదని, "ఆపరేషన్ అల్ అక్సా ఫ్లడ్" పేరు పెట్టినట్లు చెబుతున్నారు. దీని గురించి ఇజ్రా యెలీ గూఢచారులు ఏ మాత్రం పసిగట్టలేకపోయారు. తాడిని ఎక్కేవాడుంటే వాడి తలదన్నేవాడుంటాడు.

ఆయుధాలతో అరబ్బులను బెదిరించి వారి ప్రాంతాలను ఆక్రమించి ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేయాలన్న బ్రిటీష్ పాలకుల చర్యలను 1938లోనే గాంధీ మహాత్ముడు హరిజన్ పత్రికలో రాసిన ఒక వ్యాసంలో వ్యతిరేకించారు. యూదులు ఏదేశంలో ఉంటే అదే వారి మాతృదేశం అవుతుందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాదుల కుట్రలో భాగంగా 1948లో పాలస్తీనాలో కొన్ని ప్రాంతాలను గుర్తించి ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేశారు. తరువాతే అసలు కుట్ర బయటపడింది. పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించి తన రక్షణకు అవి అవసరమంటూ నాటి నుంచి నేటి వరకు అసలు పాలస్తీనా ఉనికినే లేకుండా చేసింది ఇజ్రాయెల్. అంతకు ముందు ఎక్కడెక్కడో ఉన్న యూదులందరినీ సమీకరించి బ్రిటీష్ పాలకులు అక్రమంగా పాలస్తీనాలో ప్రవేశపెట్టారు. వారికి ఆయుధా లతో శిక్షణ, నిధులు అందచేశారు. ఐరాస చేసిన విభ జన తీర్మానాన్ని పాలస్తీనా అంగీకరించలేదు. ఇతర దేశాల్లోని యూదులను చేర్చటంతో అప్పటి వరకు పాలస్తీనాలో 90 శాతంగా ఉన్న అరబ్బులు 67శాతానికి తగ్గారు. సారవంతమైన ప్రాంతాలతో సహా పాలస్తీనాలో 55 శాతాన్ని యూదులకు కేటాయిస్తూ విభజన పథకంలో చేర్చారు. అరబ్బులకు 42శాతం, మూడు శాతం విస్తీర్ణంలో ఉన్న జెరూసలేం ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉంచేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం పశ్చిమ గట్టు, గాజా పాలస్తీనా పాలిత ప్రాంతాలుగా పేరుకు 23శాతం విస్తీర్ణంలో ఉన్నప్పటికీ వాటిలో కూడా ఇజ్రాయెల్ ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పాలస్తీనాను విభజించినపుడు ఏడున్నర లక్షల మంది అరబ్బులు నిర్వాసితులై విదేశాలకు శరణార్థులుగా వెళ్లారు. గడచిన 75 ఏండ్లలో వారి వారసుల సంఖ్య అరవైలక్షలకు పెరిగింది. వారంతా పాలస్తీనా లోని కొన్ని శిబిరాలు, ఈజిప్టు, లెబనాన్, జోర్డాన్, సిరి యాల్లో తలదాచుకుంటున్నారు.

తాజాగా హమస్ దాడుల గురించి పశ్చిమ దేశాల వార్తా సంస్థలు ఇచ్చిన వార్తల్లో వారి ఆధీనంలో ఉన్న గాజా ప్రాంతంలో వంద మంది ఐరోపావాసులు బంధీలుగా ఉన్నట్లు పెద్దఎత్తున కథనాలు ఇచ్చాయి. ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న వేలాదిమంది తమ వారిని విడిచిపెడితే వారిని తాము కూడా స్వదేశాలకు పంపుతామని హమస్ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. పశ్చిమ దేశాలు, అక్కడి మీడియాను అనుసరించే మన దేశంలోని కొందరు హమస్‌ను ఉగ్రవాదులుగానూ, ఇజ్రాయెల్‌ను ప్రజాస్వామిక శక్తిగా చిత్రిస్తున్నారు. ఇజ్రాయెల్ ఆక్రమించుకున్న తమ దేశాన్ని విముక్తి కావించేందుకు అనేక శక్తులు అనేక పద్ధతుల్లో పోరాడుతున్నాయి. పాలస్తీనా విమోచనా సంస్థ యాసర్ అరాఫత్‌నే ఉగ్రవాదిగా చిత్రించిన వారు హమస్‌ను మరొక విధంగా పేర్కొంటారని అనుకోలేము. హమస్ గాజా ప్రాంతంలో అధికారంలో ఉంది. అది సాయుధపోరాటాన్ని ఒక మార్గంగా ఎంచుకుంది. పశ్చిమ దేశాల మద్దతు, బలమైన మిలిటరీ ఉన్న ఇజ్రాయెల్‌ను ఎదుర్కొనేందుకు కొన్ని సందర్భాల్లో గెరిల్లా పద్ధతిలో దాడులు జరుపుతుంది. మన దేశ చరిత్రలో శివాజీ కూడా ఔరంగజేబు సేనల మీద, అల్లూరి సీతారామ రాజు బ్రిటీష్



వారి పాలకుల మీద గెరిల్లా పద్ధతిలో దాడులు జరిపిన సంగతి తెలిసిందే. వారిని ఉగ్రవాదులందామా? బ్రిటీష్ వారు భగత్ సింగ్‌నే ఉగ్రవాది అని నిందించిన సంగతి తెలిసిందే.

చరిత్రలో హిట్లర్ మూకలు యూదులను నిర్బంధ శిబిరాల్లో చిత్రహింసలు పెట్టి చంపిన దారుణ మారణ కాండను ప్రపంచం చూసింది. గాజా ప్రాంతంలో ఇరవై లక్షల మందికి పైగా అరబ్బులు నివసిస్తున్నారు. ప్రపంచంలో అదొక పెద్ద జైలు అంటే అతిశయోక్తి కాదు. అక్కడి జనం బయటకు రావాలన్నా, పరిసరాల్లో పని పాటలు చేసుకోవాలన్నా ఇజ్రాయెల్ మిలిటరీ అనుమతి తీసుకోవాల్సిందే. తనిఖీలేందే జనాలను కదలనివ్వరు. హమస్ దాడులకు ముందే ఇజ్రాయెల్ పోలీసులు 5,250 మంది పాలస్తీనియన్లను బంధీలుగా ఉంచుకు న్నారు, వారిలో 170 మంది పిల్లలు కూడా ఉన్నారు. వీరి గురించి మీడియా, పశ్చిమ దేశాల మానవతా వాదులు పట్టించుకోరు. ఉగ్రవాదం మీద దాడులు చేయండి తప్ప పాలస్తీనియన్ల మీద కాదంటూ కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఏడున్నర దశాబ్దాలుగా దాడులు చేస్తున్నది సామాన్యజనం మీదనే అన్న వాస్తవాన్ని దాచేందుకే ఈ పదజాలం. పాలస్తీనా వాసులు పోరులోనే పుట్టి, పోరులోనే పెరిగి, పోరులోనే మరణిస్తున్నారు. అంతకంటే వారికి పోయేదేమీ లేదు. వారి మాతృదేశ కాంక్ష మరింతగా పెరుగుతుందే తప్ప నిర్బంధంతో అణిగేది కాదు. జెరూసలెంతో సహా అరబ్బులకు నిర్దేశించిన ప్రాంతాలను పూర్తిగా తిరిగి వారికి అప్పగించకుండా, వారి ప్రాంతాలలో యూదుల నివాసాలను ఖాళీ చేయించకుండా సమస్య పరిష్కారం కాదు. పాలస్తీనియన్ల మాతృదేశ కాంక్ష తీరదు.

ఇప్పటికే మాతృగడ్డమీద దశాబ్దాల తర బడి బంధీలుగా మారిన పాలస్తీయన్ల భవితవ్యం గురించి ఒకవైపు ప్రపంచం ఆలోచిస్తుంటే మరో వైపు వారిని మరింతగా అణచివేసేందుకు అవసరమైన ఆయుధాలను అమ్ముకొనేందుకు అమెరికా పూనుకుంది. ఇజ్రాయెల్ మీద దాడి చేసినందుకు ప్రతీకారంగా పాలస్తీనాకు అందచేస్తున్న సాయాన్ని సమీక్షించే నెపంతో ఐరోపా నిలిపివేసింది. అదే పాలస్తీనా మీద యుద్ధ విమానాలతో దాడులు చేస్తున్న ఇజ్రాయెల్‌కు అమెరికా సాయాన్ని పెంచాలని నిర్ణయించింది. యూదుల అణచివేతను ఆయుధంగా చేసుకొని హిట్లర్ మారణ కాండకు పాల్పడ్డాడు. అదే యూదులకు మాతృ దేశాన్ని ఏర్పాటు చేయాలనే సాకుతో పశ్చిమాసియాలో ఉన్న చమురు, ఇతర సహజ సంపదలను ఆక్రమించాలని చూసిన బ్రిటన్, అమెరికా తదితర పశ్చిమ దేశాలు అందుకోసం తమ తొత్తుగా పనిచేసే ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేయాలన్న ఎత్తుగడలను ప్రపంచం చూసింది. ఉక్రెయిన్ వివాదంలో తటస్థ విధానాన్ని అనుసరించిన మనదేశం పశ్చిమాసియాలోనే కాదు, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే ఇజ్రాయెల్ దుశ్చర్యలను ఖండించాల్సింది పోయి ఇప్పుడు ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించింది. ఇది గడచిన ఏడు దశాబ్దాలుగా అనుసరిస్తున్న మన విదేశాంగ విధానానికే విరుద్ధం. నరేంద్రమోడీ సర్కార్ వైఖరి బీజేపీతో సహా సంఘపరివార్ సంస్థల ముస్లిం వ్యతిరేకతకు ప్రతి బింబం తప్ప మరొకటి కాదు. ఇలాంటి వైఖరితో తలెత్తే పర్యవ సానాల గురించి ఎవరెన్ని హెచ్చరికలు చేసినా, సుద్దులు చెప్పినా పట్టించుకోకపోవటం విచారకరమే కాదు గర్హనీయం. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యం లేకపోవటమే కాదు దానికి వ్యతిరేకంగా పని చేసిన శక్తుల వారసులు పాలస్తీనియన్ల మాతృదేశ విముక్తి వాంఛ, దురాక్రమణ వ్యతిరేక పోరాటాన్ని అర్ధం చేసుకొంటారని భావించటం అత్యాశే అవుతుంది. ఇజ్రాయెల్‌ను సమర్ధిస్తున్న అమెరికా తదితర దేశాల వైఖరిని యావత్ శాంతిశక్తులు ఎలుగెత్తి ఖండించాలి, పాలస్తీనా విముక్తికి పోరాడుతున్న వారికి సంఘీభావం ప్రకటించాలి.

చరిత్రలో హిట్లర్ మూకలు యూదులను నిర్బంధ శిబిరాల్లో చిత్రహింసలు పెట్టి చంపిన దారుణ మారణకాండను ప్రపంచం చూసింది. గాజా ప్రాంతంలో ఇరవైలక్షల మందికి పైగా అరబ్బులు నివసిస్తున్నారు. ప్రపంచంలో అదొక పెద్ద జైలు అంటే అతిశయోక్తి కాదు. అక్కడి జనం బయటకు రావాలన్నా పరిసరాల్లో పనిపాటలు చేసుకోవాలన్నా ఇజ్రాయెల్ మిలిటరీ అనుమతి తీసుకోవాల్సిందే. తనిఖీలేందే జనాలను కదలనివ్వరు. హమస్ దాడులకు ముందే ఇజ్రాయెల్ పోలీసులు 5,250 మంది పాలస్తీనియన్లను బంధీలుగా ఉంచుకున్నారు. వారిలో 170 మంది పిల్లలు కూడా ఉన్నారు. వీరి గురించి మీడియా, పశ్చిమ దేశాల మానవతావాదులు పట్టించుకోరు.

ఉక్రెయిన్ వివాదంలో తటస్థ విధానాన్ని అనుసరించిన మనదేశం పశ్చిమాసియాలోనే కాదు, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే ఇజ్రా యెల్ దుశ్చర్యలను ఖండించాల్సింది పోయి ఇప్పుడు ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించింది. ఇది గడచిన ఏడు దశాబ్దాలుగా అనుసరిస్తున్న మన విదేశాంగ విధానానికే విరుద్ధం. నరేంద్రమోడీ సర్కార్ వైఖరి బీజేపీతో సహా సంఘపరివార్ సంస్థల ముస్లిం వ్యతిరేకతకు ప్రతి బింబం తప్ప మరొకటి కాదు. ఇలాంటి వైఖరితో తలెత్తే పర్యవసానాల గురించి ఎవరెన్ని హెచ్చరికలు చేసినా, సుద్దులు చెప్పినా పట్టించుకోకపోవటం విచారకరమే కాదు గర్హనీయం.

బాలిక భారమేనా?

బాలిక అంటే భారం. ఆడపిల్లంటే అత్తారింటి ఆడదే అనే చిన్న చూపు దేశంలో నేటికీ కొనసాగుతోంది. నిర్భయలు, ఉన్నావ్‌లు, హత్రాస్‌లు, దిశల గత భయానక అనుభవాలతో అనుక్షణం శీలాన్ని అరచేతిలో పెట్టుకొని భయపడుతూ బతుకుతున్నారు సున్నిత అభాగ్య అబలలు. ప్రపంచవ్యాప్తంగా 18 ఏండ్లలోపు వయసున్న బాలికలు 1.1 బిలియన్లు. విశ్వ వ్యాప్తంగా బాలికల పలు సమస్యలు, భద్రత, సాధికారత, లింగ వివక్ష, విద్య వంటి అంశా లను చర్చించడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కెనడా మహిళ 'రోనా ఆంబ్రోస్' చొరవతో ఐక్యరాజ్యసమితి 2012 నుండి ప్రతియేటా 11 అక్టోబర్ న "అంత ర్జాతీయ బాలికల దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ చైల్డ్)" నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

బాలికలను విద్యకు దూరం చేయడం, అమ్మాయిల్ని వంటింటికి పరిమితం చేయడం, బాల్యవివాహాలు, పోషకాహారలోపం, హక్కుల్ని కాలరాయడం, కుటుంబంలో నిర్ణయా ధికారం లేకుండా ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పక్కన బెట్టడం, వివక్ష నుండి రక్షించడం, లైంగిక హింసలు, మానభంగాలు, బాలికల్ని కార్మికులుగా మార్చడం, వైద్య సదుపాయాల లేమి, లింగవివక్ష లాంటి పలు సమస్యలు అనాదిగా వస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా 62 మిలియన్ల బాలికలు నిరక్షరాస్యతతో సతమతమవుతూ వంటింటికి, తమ వృత్తులకే పరిమి తమవుతున్నారు. బాలికల్లో 25 శాతం బలవంతంగా బాల్యవివాహాలు ఉచ్చులో పడుతున్నారు. మన దేశంలో పదేండ్లు దాటిన బాలికలకు నేటికీ బాల్య వివాహాలు, బాలికల్ని పనిలో పెట్టుకోవడం, ఫీమేల్ జనిటల్ మ్యుటిలేషన్ లాంటి దురాచారాలకు గురవుతున్నారు. పేద కుటుంబాలలో 80 శాతం బాలికలు ప్రాథమిక విద్యకు కూడా దూరమవుతున్నారు.



ప్రపంచ బాల్యవివాహాలలో 33 శాతం భారత్‌లోనే జరుగుతు న్నాయని అంచనా. భారత మహిళల్లో 75 శాతం ఏదో ఒక గృహహింసకు గురవుతున్నారు. గ్రామీణ బాలికలు వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, బాల్య వివాహాలు, వంట పనులు, ఇటుక బట్టీలు, అసంఘటిత రంగాల్లో తమ బాల్యాన్ని కోల్పోతున్నారు.

అంతర్జాతీయ బాలికల దినం-2023 సందర్భంగా "అవర్ జనరేషన్, అవర్ జనరేషన్" అనబడే నినాదం తీసుకున్నారు. కౌమారదశలో ఉన్న అమ్మా యిలను లింగవివక్ష లేకుండా సాధారణ జనజీవన స్రవంతిలోకి ఆకర్షించడానికి ప్రభుత్వాలు పలు చట్టాలను చేశాయి. బాలికలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్య సదుపాయాలు, గౌరవప్రద జీవితం, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం, లైంగిక వేధింపుల కట్టడి, అత్యాచారం చేసిన వారికి కఠిన దండన, హక్కుల కల్పన, ఆస్తి హక్కు, నాయకత్వ అవకాశాల కల్పన, గృహహింస లేకుండా చూడడం, నైపుణ్యాభివృద్ధి, మహిళా భద్రత, బాల్యవివాహాల రద్దు, అన్ని రంగాల్లో సమానత్వానికి సాకారాత్మక చర్యలు తీసుకోవడం. అయితే క్షేత్రస్థాయిలో ఇవి నెరవేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భారతదేశంలో 2020 అంచనాల ప్రకారం 108 మంది పురుషులకు 100 మంది మహిళలు ఉన్నారు. ఇండియా జనాభాలో 51.96 శాతం పురుషులు, 48.04 శాతం మహిళలు. ప్రపంచ వ్యాప్తంగా పురుషులు 50.4 శాతం, స్త్రీలు 49.6 శాతం ఉన్నారు. అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలుగా గర్భంలో అమ్మాయి ఉందని తెలిసి భ్రూణ హత్యలకు పాల్పడడం, ఆరోగ్య సదుపాయాల లేమి, బాల్యవివాహాలతో కౌమారదశలోనే గర్భం దాల్చడం, ప్రసూతి ఆసుపత్రులు సమీపంలో లేకపోవడం, అవిద్యతో అవగాహనాలేమి లాంటివి చెప్పవచ్చు. భ్రూణహత్యల్లో 90 శాతం గర్భస్థ శిశువు ఆడపిల్ల కారణమని తేలింది. దీనిని గమనించిన ప్రభుత్వాలు లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించినా అక్కడక్కడా భ్రూణహత్యల పరంపర కొనసాగుతూనే వుంది. అయితే భ్రూణహత్యల నిరోధానికి 'కిషోరి శక్తి యోజన', ప్రసూతి వైద్య సదుపాయాల కల్పనకు 'సమృద్ధి యోజన', వైద్య సదు పాయాల కల్పనకు 'అయుష్మతి యోజన' పథకాలను తీసుకొచ్చారు. కేంద్రం 2015లో తెచ్చిన "బేటీ బచావో, బేటీ పడావో" పథకం నిరూపయోగంగానే కనిపిస్తున్నది. ఆడపిల్లల్ని రక్షించుకోవడం, ఉన్నత విద్య అందించడం, భ్రూణహత్యలను నిరోధించడం, మహిళలపై అత్యాచారాలను కట్టడి చేయడం లాంటి చర్యలతో లింగ వివక్ష సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అమ్మాయిల మానసిక, సాంఘీక, భౌతిక, ఆర్థిక సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకోవాలి. యువతులపై ఆసిడ్ దాడులు, భ్రూణహత్యలు, అత్యాచారాలు, మానభంగాలు, భౌతిక గృహహింస, కిడ్నాపులు లాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల కనీస బాధ్యత.

(11 అక్టోబర్ 'అంతర్జాతీయ బాలికల దినం')

- బిఎంఎస్ రెడ్డి, 9949700037

అదుపు తప్పుతున్న పొదుపు - ఆర్థిక వ్యవస్థ కుదుపు

దేశ స్థూలజాతీయ ఆదాయంలో 2022-23 ఆర్థిక సంవత్సరాంతానికి నికర కుటుంబ పొదుపు 5.1శాతంగా నమోదై ఐదు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఆందోళన కర పరిణామం. మరొకపక్క కుటుంబాల వార్షిక ఆర్థిక అప్పు గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న 3.8 శాతం కంటే మించి 2022 -23 నాటికి 5.8శాతానికి చేరడం కుటుంబాలలో పెరుగుతున్న రుణ భారానికి నిదర్శనం. ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక వృద్ధిరేటును లేదా పురోగతిని కుటుంబ ఆదాయరంగం, ప్రభుత్వరంగం, కార్పొరేట్ రంగం అనే ప్రమాణాల ప్రాతిపదికగా నిర్ధారించవచ్చు.

కుటుంబాలలో వినియోగిత ఆదాయ ప్రాతిపదికగా పొదుపు సమీకరించబడుతుంది. నగదు, బ్యాంకు డిపాజిట్లు, డెట్ సెక్యూరిటీలు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు వంటి వాటన్నింటిని కలిపి మొత్తంగా చేసే పొదుపును స్థూల కుటుంబ పొదుపుగా పరిగణిస్తారు. దీని నుంచి వివిధ బ్యాంకులు, నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు ఇచ్చిన రుణాలను తీసివేయగా వచ్చేది నికర హౌస్‌హోల్డ్ సేవింగ్స్‌గా పరిగణిస్తారు. 2012 నుంచి 2017కు ఆర్థిక వ్యవస్థలో పొదుపుతీరును విశ్లేషిస్తే మొత్తం ఆర్థిక వ్యవస్థ పొదుపులో హౌస్ హోల్డ్ సెక్టార్ నుంచి 60.93శాతం, ప్రయివేటు కార్పొరేషన్ల నుండి 35శాతం, పబ్లిక్ సెక్టార్ నుంచి 4.07శాతంగా ఉంది.

నికర ఆర్థిక పొదుపురేటు 2023 మార్చి నాటికి దాదాపు 55శాతం క్షీణించి దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపి)లో 5.15 శాతానికి పడిపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. గడిచిన యాభై ఏండ్లలో ఇంత తక్కువ స్థాయిలో పొదుపురేటు నమోదు కావడం ఇదే ప్రథమం. ఆదాయ స్థాయిలో స్తబ్దత ఏర్పడి ద్రవ్యోల్బణం పెరగటం వలన కూడా ఇటువంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆదాయస్థాయి, పంపిణీ, వినియోగదారుని అంచనాలు, వడ్డీరేటు వంటి అంశాలు వినియోగదారునిపై ప్రభావం చూపుతున్నాయి. అభిరుచులు, ప్రాధాన్యతలు, సంపద నిలువ ఉన్న పరిమాణం, వినియోగితా వస్తువుల పరిమాణం, పన్నుల విధానం, వివిధ వ్యాపార సంస్థలు అమ్మకాలు పెంచుకునేందుకు చేసే ప్రయత్నాలు, వినియోగదారునికి రుణం లభించే విధివిధానాలు వంటి వివిధ అంశాలు కుటుంబ ఆదాయ వినియోగాన్ని, పొదుపును ప్రభావితం చేస్తాయి.

కుటుంబాల వినియోగిత అనేది సమకూరే ఆదాయం మీద ఆధారపడే అంశం. వ్యక్తి ఆదాయ స్థాయి ఎక్కువగా ఉంటే వినియోగిత పరిమాణం కూడా ఎక్కువగానే ఉంటుంది. వినియోగదారుని ఖర్చులను రూపాయి విలువ, అధిక ధరలు, నిరుద్యోగిత, అందుబాటులో ఉండే ఆదాయం వంటి వివిధ భవిష్యత్ అంచనాలు కూడా ప్రభావితం చేస్తాయి. పొదుపుకు ప్రతిఫలంగా ఇచ్చే వడ్డీరేట్ల ప్రభావం పొదుపుపై ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ వడ్డీరేట్లు కొనసాగుతున్న సమయంలో పొదుపు వృద్ధిరేటు కూడా పెరుగుతుంది. ప్రజల అభిరుచులు, వారి సంకల్పం, ప్రాధాన్యతల తీరుతెన్నులు పొదుపురేటును నిర్ధారిస్తాయి. సంపదను పొదుపు చేసి భవిష్యత్ తరానికి అందించాలనే దృక్పథం ఉన్న పాతతరానికి, అందుబాటులో ఉన్న సౌకర్యాలకు, విలాసాలకు ఖర్చుచేయాలన్న కొత్తతరానికి మధ్య పొదుపు గుణంలో చోటుచేసుకున్న వైరుధ్యాల ప్రభావం కుటుంబాల పొదుపు వృద్ధిరేటుపై పడుతోంది.

రుణ లభ్యతను అందుబాటులోనికి తెచ్చే తీరు తెన్నులు పొదుపును బలహీన పరుస్తున్నాయి. వాయిదాల పద్ధతిలో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్‌ఫోన్స్ వంటివి అందించే వివిధ రుణ సంస్థల వలన కూడా పొదుపు తగ్గి వినియోగిత పెరుగుతోంది. ఒక్క ఆర్థిక సంవత్సరం లోనే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల ద్వారా దేశంలో దేశీయ కుటుంబాలు రూ.2100 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి. మొత్తం కుటుంబ రుణాలు 15.6 లక్షల కోట్ల మేరకు చేరాయి.

ఆర్థిక వృద్ధి లక్ష్యానికి పొదుపుసూత్రం అనివార్యమని భావించినపుడు, వృద్ధిరేటు పెరుగుదలలో కుటుంబ పొదుపు ముఖ్య భూమిక పోషిస్తుందనేది వాస్తవం. ప్రభుత్వం ద్రవ్యలోటును పూడ్చుకోవడానికి, ఇతర రంగాల అభివృద్ధికి దేశీయ పొదుపు కీలకం. నోట్ల రద్దు, చిన్న మొత్తాల పొదుపు పథకాలమీద ఉద్దేశపూర్వకంగా వడ్డీరేట్లను తగ్గించడం, కరోనా విపత్తు కాలంలో ప్రజలు నిజ ఆదాయాన్ని కోల్పో వటం, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రతా పొదుపు పథకాలపై కూడా జీఎస్‌టి భారాన్ని మోపడం, బ్యాంకు డిపాజిట్ల మెచ్యూరిటీ మొత్తాల మీద ఇన్‌కమ్‌ట్యాక్స్ విధించడం వంటి అనేక కారణాల వలన కుటుంబాల పొదుపు రేటు తగ్గుదలకు ఆస్కారం ఏర్పడింది.



కుటుంబ ఆదాయం అంటే ఒక కుటుంబంలోని అందరి వ్యక్తుల ఆదాయంగా పరిగణించాలి. రిజర్వ్ బ్యాంకు గణాంకాల ప్రకారం, జీడీపిలో అప్పును శాతంగా చూసినట్లయితే 2023 - 5.8శాతం, 2022 - 3.8శాతం, 2021 - 3.9శాతం, 2020 - 3.9 శాతం, 2019 - 4.1శాతంగా ఉన్నది. గత మూడేండ్లలో కుటుంబాలు బ్యాంకులలో తీసుకున్న రుణాలను జీడీపిలో శాతంగా చూసినపుడు 2023లో 4.4శాతం, 2022లో 3.3 శాతం. 2021లో 3.2శాతంగా ఉంది. కుటుంబాలు తమ వినియోగితా అవసరాలకు అప్పుపై ఆధారపడే పరిస్థితిని ఇది ప్రతిబింబిస్తోంది. కానీ ఒక దేశంలో ఎక్కువ పొదుపు మొత్తాలు ఉంటే ఆ దేశ అభివృద్ధి ఎక్కువగా ఉంటుందనేది ప్రాథమిక నిర్ధారణ. తూర్పు ఆసియా దేశాలు అభివృద్ధి చెందటానికి ఆయా దేశాలలో పొదుపురేటు ఎక్కువగా ఉండడమే కారణం. చైనాలో ఒకదశలో పొదుపు 50శాతానికి కూడా చేరింది.

గడిచిన మూడేండ్లలో వివిధ హౌసింగ్ ఫైనాన్స్ కంపనీల దగ్గర కుటుంబాలు పొందిన రుణాల మొత్తాన్ని దేశ స్థూల జాతీయోత్పత్తిలో శాతంగా విశ్లేషించినపుడు 2023-0.40 శాతం, 2022-0.40శాతం, 2021- 0.30 శాతంగా ఉంది. కుటుంబాల రుణభారం పెరుగుతోందని వివిధ బ్యాంకులు, రిసెర్చ్ సంస్థలు నివేదికలిస్తున్నప్పటికీ ఆర్థిక మంత్రిత్వ శాఖ మాత్రం కుటుంబాల పొదుపుస్థాయి తగ్గిందన్న వాస్తవాన్ని, రుణభారం పెరిగిందన్న అంశాన్ని అంగీకరించకపోవడం ఆక్షేపణీయం.

కుటుంబ ఆదాయంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ఆర్థిక వ్యవస్థ స్వల్పకాలిక వృద్ధి అంచనాలపై ప్రభావాన్ని చూపే పరిస్థితి నెలకొని ఉంది. అయినప్పటికీ ప్రభుత్వం వినియోగదారులు ఆర్థిక వ్యవస్థమీద పెరిగిన విశ్వాసంతో గృహ, వాహన రుణాలను తీసుకోవడం ప్రారంభించారని, మొత్తం బ్యాంకులు ఇచ్చిన వ్యక్తిగత రుణాలలో రియల్ ఎస్టేట్, వాహన రుణాలు 62శాతంగా ఉన్నాయని, ఇది కేవలం వినియోగదారుని ప్రాధాన్యతలలో వచ్చిన మార్పు తప్ప రుణభారం పెరుగుదల కాదని వాదన చేయడం హాస్యాస్పదం.

2014 సంవత్సరం నుండి 2022 మధ్యకాలంలో హౌస్‌హోల్డ్ సేవింగ్స్ 9.2శాతం కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేటును సాధించాయని, ఇదే సమయంలో జీడీపి 9.65శాతంగా ఉందని కాబట్టి దేశ స్థూల జాతీయోత్పత్తిలో భాగంగా హౌస్‌హోల్డ్ సేవింగ్స్‌ను పోలిస్తే దాదాపు స్థిరంగా ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంటోంది. కానీ కుటుంబ పొదుపు వృద్ధిరేటు కుంగుబాటుకు గురైతే, వివిధ రకాల ప్రభుత్వ పెట్టుబడులకు, పథకాల అమలుకు విదేశీ పెట్టుబడులపై ఆధారపడే పరిస్థితులు ఏర్పడుతాయన్న వాస్తవాన్ని విస్మరిస్తోంది.

కుటుంబాల అప్పులు పెరిగి పొదుపురేటు క్షీణించడం సమాజంలో పెరుగుతున్న అసమానతలకు సంకేతం. ఈ పరిణామాలను అధిగమించడానికి ప్రభుత్వపరంగా స్థూల జాతీయ పొదుపురేటు పెరిగేలా చర్యలు తీసుకోవటం అనివార్యం. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఉపాధి అవ కాశాలను పెంచడం, వడ్డీరేట్ల భారాన్ని సామాన్యులపై పడకుండా చూడడం అవసరం. ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అమలుపర్చడం, ద్రవ్యలోటును కట్టడి చేయడం వంటి చర్యలు చేపట్టడం ఆవశ్యకం.

- జి. కిషోర్ కుమార్, 9440905501

రుణ లభ్యతను అందుబాటులోనికి తెచ్చే తీరుతెన్నులు పొదుపును బలహీన పరుస్తున్నాయి. వాయిదాల పద్ధతిలో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్‌ఫోన్స్ వంటివి అందించే వివిధ రుణ సంస్థల వలన కూడా పొదుపు తగ్గి వినియోగిత పెరుగుతోంది. ఒక్క ఆర్థిక సంవత్సరం లోనే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల ద్వారా దేశంలో దేశీయ కుటుంబాలు రూ.2100 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి. మొత్తం కుటుంబ రుణాలు 15.6 లక్షల కోట్ల మేరకు చేరాయి.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత వదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఇజ్రాయిల్ దాడులతో విధ్వంసం



గాజా: ఇజ్రాయెల్ వైమానిక దాడికి గురైన భవనాల శిథిల విధ్వంస దృశ్యం. గాజాపై తీవ్ర వైమానిక దాడుల్లో వందలాది మంది నియన్న మృతి.

దాడులు ఆపండి



వాంకోవర్: ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా ప్లకార్డుతో నిరసన ప్రదర్శన

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి



జమ్మూ: ప్రజాస్వామ్య పునరుద్ధరించాలని కోరుతూ మహారాజా హరి సింగ్ పార్క్ వద్ద ప్రతిపక్ష పార్టీల సభ్యుల ధర్నా

హక్కుల కోసం పోరాటం



కోల్‌కతా: మోటార్ వ్యాన్ , ఆటో డ్రైవర్ల భారీ ర్యాలీ



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 58,530	▲	330
22 క్యారెట్లు	- 53,650	▲	300
కిలో వెండి	- 75,500	---	---



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 104
రిటైల్ (లైవ్)	రూ. 126
స్కిన్‌తో	రూ. 183
స్కిన్‌లెస్	రూ. 208

కృష్ణా నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తిపై వారంలో కౌంటర్ దాఖలు చేయాలి

- కేంద్ర ప్రభుత్వం, కేఆర్‌ఎంబీలకు సుప్రీం ఆదేశం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కృష్ణా నదీ నీటి వినియోగం, పవర్ జనరేషన్(విద్యుదుత్పత్తి) విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే రిజాయిండర్ దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి మరో రెండు వారాల సమయం ఇచ్చింది. విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నీటి విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ... 2021లో ఏపీ ప్రభుత్వం సర్వోన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. కృష్ణా నదీ నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి కోసం నీటి విడుదల ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ లో పేర్కొంది. ఈ పిటిషన్ మంగళవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ లతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే ఈ పిటిషన్ కు సంబంధించి ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసినట్టు తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ కోర్టుకు నివేదించారు. ఇదే అంశంపై కేంద్రం తరపు న్యాయవాది స్పందిస్తూ... వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేస్తామని, ఇందుకు అనుమతివ్వాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొన్న ద్విసభ్య ధర్మాసనం... ఏడు రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి, కేఆర్ఎంబీకి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబరు 21కి వాయిదా వేసింది.

ప్రశ్నిస్తే... పగబడతారా!

(మొదటిపేజీ తరువాయి)

తరలివచ్చారు. 'ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోడీ సర్కార్ నశించాలి.. మీడియా స్వేచ్ఛ వర్ధిల్లాలి' అంటూ నినదించారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ.. కార్మికులు, అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారు చేస్తున్న ఉద్యమాలను కవర్ చేస్తున్నందునే 'న్యూస్ క్లిక్'పై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శిం చారు. సమాజంపై విద్వేష విషం చిమ్మే సంఘ్ పరివార్ (ఆర్ ఎస్ఎస్) వారపత్రిక 'అర్గనైజర్'కు మాత్రం ఎనలేని స్వేచ్ఛను కల్పించారని తప్పుబట్టారు. చైనాతో ముడిపెట్టి నకిలీ జాతీయ వాదంతో పత్రికా స్వేచ్ఛపై మోడీ సర్కార్ దాడి చేస్తోందన్నారు. కేంద్ర ఏజెన్సీలు 2020 నుంచి న్యూస్ క్లిక్‌పై విచారణ జరుపుతు న్నాయనీ, మూడేండ్లు శ్రమించినా ఈడీ, సీబీఐ, ఐబీలు న్యూస్ క్లిక్‌కు వ్యతిరేకంగా ఏమీ కనుగొనలేకపోయాయని పేర్కొన్నారు.

ప్రబీర్ పుర్కాయస్థతో సహా ఎవరినీ అరెస్టు చేయొద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు గతంలోనే ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసును హైకోర్టు మళ్లీ విచారిస్తున్న సమయంలో ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిని యూఏపీఏ కింద అరెస్టు చేశారని అన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో జైలుశిక్ష అనుభవించిన వ్యక్తి ప్రబీర్ పుర్కాయస్థ అని, పోలియో కారణంగా శారీరక సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తి అమిత్ చక్రవర్తి అని బృందాకరత్ తెలిపారు. అలాంటి నిస్వార్థ పాత్రికేయులపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేసినందుకు మోడీ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు.


ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ, అమర్‌జీత్ కౌర్ (సీపీఐ), జి దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), రవిరాయ్ (సీపీఐ-ఎంఎల్), ఆర్ఎస్ దాగర్ (ఆర్ఎస్‌పీ), ప్రకాశరావు (సీజీపీఐ) తదితరులు మాట్లాడారు.

మధ్యప్రాచ్య శాంతి చర్చల పునరుద్ధరణకు

రష్యా, చైనాల పిలుపు

గాజా : ఇజ్రాయిల్ పైన పాలస్తీనా మిలిటెంట్ గ్రూపు హమాస్ చేసిన ఆకస్మిక దాడులపైన అత్యవసరంగా చర్చించటానికి సమావేశమైన ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో రష్యా, చైనాలు మధ్యప్రాచ్య శాంతి చర్చల పునరుద్ధరణ జరగాలని వాదించాయి. యుద్ధ విరమణ తక్షణమే జరగటం ముఖ్యం. ఎప్పటినుంచో ఆగిపోయిన అర్థవంతమైన చర్చలు జరగాలంటే కాల్పుల విరమణ అవసరమని రష్యా శాశ్వత ప్రతినిధి వాస్సిలీ నెబెన్జియా భద్రతామండలిలో చేసిన ఉపన్యాసంలో పేర్కొంది. పౌరులపైన జరిగిన దాడులన్నింటినీ రష్యా ఖండించిందని నెబెన్జియా ప్రకటించింది. ప్రపంచం రెండు రాజ్యాల పరిష్కారానికి చొరవ చూపాలని చైనా రాయబారి జాంగ్ జున్ భద్రతామండలి సమావేశానికి ముందే చెప్పాడు. సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం లేనందున భద్రతామండలి ఎలాంటి సంయుక్త ప్రకటననూ విడుదల చేయలేదు.

పాలస్తీనా సమస్యను పరిష్కరించటంలో అమెరికా పాలస్తీనా ప్రజల ప్రయోజనాలను



పరిగణనలోకి తీసుకోలేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ఐక్యరాజ్య సమితికి చెందిన భద్రతామండలి చేసిన తీర్మానాలకనుగుణంగా పాలస్తీనా ప్రజలకు ప్రత్యేక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేయటం మినహా మరో మార్గంలేదని ఆయన ప్రకటించాడు. మాస్కోలో ఇరాకీ ప్రధాని మహమ్మద్ అల్ సుడన్ తో సమావేశమైనప్పుడు పుతిన్ ఈ విషయాలను ప్రస్తావించారు. పాలస్తీనాలో ఇటువంటి పరిస్థితి ఏర్పడటానికి అమెరికానే ప్రధాన కారణమని అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్ రోవ్ ఆరోపించారు. హమాస్ దాడిని ఖండించమని 15దేశాల సభ్యత్వమున్న భద్రతామండలిని అమెరికా కోరింది. అనేక దేశాలు అందుకు సమ్మతించాయని, అయితే ఏకాభిప్రాయం లేనందున సంయుక్త ప్రకటనను విడుదల చేయటం సాధ్యపడలేదని అమెరికా ఉప రాయబారి రాబర్ట్ ఉడ్ అన్నాడు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అమలు చేయనందున పాలస్తీనాలో ఒక హింసాత్మక విషవలయం ఏర్పడిందని అంతకుముందు రష్యా అభివర్ణించింది. మధ్య ప్రాచ్యంలోను, పాలస్తీనా-ఇజ్రాయిల్ సమస్యను పరిష్కరించేందుకు నియమించబడిన రష్యా, అమెరికా, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితితో కూడిన గ్రూపును పనిచేయకుండా చేసింది పశ్చిమ దేశాలేనని రష్యా పేర్కొంది. ప్రస్తుత పరిస్థితికి ఇజ్రాయిల్ కూడా కొంతవరకు కారణమని, శాంతి ప్రక్రియను పునరుద్ధరించాలని అరబ్ దేశాలు కోరుతున్నాయి.

అడుగు పడని అచ్చంపేట

(మొదటిపేజీ తరువాయి)

సాగునీరు అందించాలి. ఉప్పునుంతల మండల పరిధిలో నాలుగు గ్రామాలకు 1551 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. బల్మూరు మండల పరిధిలో 20 గ్రామాలకు 23073 ఎకరాలకు నీరు అందించాలి. లింగాల మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో 4,566ఎకరాలు, తెలకపల్లి మండల పరిధిలో ఆరు గ్రామాలు 4790 ఎకరాలకు సాగునీరు అందించటం లక్ష్యంగా ఉన్నది. ఏజెన్సీ ప్రాంతమైన అమ్రాబాద్ మండల పరిధిలో ఐదు గ్రామాల్లో 9,560 ఎకరాలు, పదర మండల పరిధిలో రెండు గ్రామాల్లో 4,840 ఎకరాలకు సాగునీరు అందించాల్సివుంది.

సమస్యలు పరిష్కారం చేయకుండా..

ఈ ఎత్తిపోతల పథకం మొదలెట్టడానికి ఇప్పటికీ సాంకేతిక సమస్యలే పరిష్కారం కాలేదు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే 4000 ఎకరాల సాగు భూమిని రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. గతంలో సేకరించిన భూముల విషయంలో రైతులు ఇప్పటికీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. సరైన పరిహారం ఇవ్వకుంటే రైతులు భూములు ఇవ్వడం కష్టం. రెండో పేజ్‌లో నిర్మించ తలపెట్టిన ఉమామహేశ్వర లిఫ్ట్‌కు పర్యావరణ అనుమతులు తప్పనిసరి. హడావిడిగా ఎన్నికల సమయంలో ఈ ప్రాంత ఓటర్లను ప్రభావితం చేయడానికి భూమి పూజ చేసేందుకు యత్నిస్తున్నారన్న విమర్శలు వచ్చాయి.

ఎన్నికల ముందు శంకుస్థాపన..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చేతుల మీదగా శంకుస్థాపన చేయించాలని బీఆర్ఎస్ నేతలు పైలాన్ సిద్ధం చేశారు. మంగళవారం కార్యక్రమం జరగాల్సి ఉండగా సోమవారమే ఎన్నికల కోడ్ వచ్చింది. దాంతో అధికారిక కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి. ఐదు సంవత్సరాలు పట్టించుకోని పాలకులు.. తీరా ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఓట్లతో లబ్ది పొందడం తప్ప హామీల అమలు పట్ల చిత్తశుద్ధి లేదని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

సీజన్ అదిరింది గురూ...

(మొదటిపేజీ తరువాయి)

మలచుకోనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మను అధికారిక పండుగగా గుర్తించింది. ఆ మేరకు ప్రతీయేటా నిధులను విడుదల చేసి సంబురాలను ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు ఆడపడుచులకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేయటం ఆనవాయితీగా వస్తోంది. అయితే బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ తదితర ప్రధాన పార్టీలు ఇలాంటి అధికారిక కార్యక్రమాలతోపాటు అనధికారికంగా అనేక 'కార్యక్రమాలకు' శ్రీకారం చుట్టనున్నాయి. ముఖ్యంగా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఊరూరా అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేయటం, పూజా సామాగ్రిని ఏర్పాటు చేయటం, తొమ్మిది రోజులపాటు దగ్గరుండి పూజలు చేయించటం ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీలు ప్లానులు మీద ప్లానులు వేస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా వీటిని పూర్తి చేయాలంటూ ఇప్పటికే పార్టీల అధిష్టానాల నుంచి కిందిస్థాయికి ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. దీపావళికి ఇంటింటికీ టపాసులు పంచే కార్యక్రమానికీ నేతలు రూపకల్పన చేస్తు న్నట్టు వినికిడి. ఇప్పటికే వివిధ కుల సంఘాలను ఒక చోట చేర్చి.. ఆత్మీయ సమావేశాల పేరిట హడావుడి చేస్తోన్న పార్టీలు, ఆ సందర్భంగా పండగలకు ఏమేం కావాలో మొహమాట పడకుండా అడగండంటూ కుల పెద్దలకు సూచిస్తున్నారు.

మద్యం, మటన్, చికెన్‌తోపాటు ఇతరత్రా ఏమేం కావాలన్నా 'మేం చూసు కుంటాం...' అంటూ వారు హామీలిస్తున్నట్టు సమాచారం. మరోవైపు వివిధ జాతీయ, రాష్ట్ర పార్టీల నేతల బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనలతో తెలం గాణ మార్మోగనుంది. వాటి మైకుల గోలతోపాటు దీపావళి టపాసుల మోత మోగనుంది. పండగలకు ఊళ్లకు వెళ్లి వచ్చే జనాలు, వారి కోసం కేటాయించిన బస్సులు, రైళ్లు, సొంత వాహనాలకు తోడు, అదే సమయంలో వందల కొద్దీ కార్లు, వాహనాలతో రోడ్లపై బారులు తీరే రాజకీయుల కాన్వాయ్‌లు... వెరసి రద్దీతో రోడ్లన్నీ తడిసి ముద్దవనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల నిబంధనలు, నియమా వళి పక్కాగా అమలవుతుందా..? లేదా..? అనేది చూడాలి. పెద్ద ప్రశ్న. ఈ పరిణా మాలన్నింటి రీత్యా ఈ శీతాకాలం యమ రంజుగా ఉండబోతోంది. చలితో జనా లు వణికిపోయే అక్టోబరు, నవంబరు నెలల్లో తెలంగాణ 'పొలిటికల్'గా హీటెక్కనుంది.

సారు షెడ్యూల్ ఖరారు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 15 నుంచి ఆయన వివిధ జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఆ రోజు ఆయన హుస్నాబాద్‌లో పర్యటిస్తారు. అప్పటి నుంచి ఈనెల 18 వరకు, ఆ తర్వాత 26 నుంచి వచ్చే నెల మూడు వరకు (మధ్యలో ఈనెల 28 మినహా) ఆయన పర్యటనలు కొనసాగనున్నాయి.

పర్యటన వివరాలు...

15.10.23	హుస్నాబాద్
16.10.23	జనగామ, భువనగిరి
17.10.23	సిరిసిల్ల, సిద్ధిపేట
18.10.23	జడ్చర్ల, మేడ్చల్
26.10.23	అచ్చంపేట, నాగర్ కర్నూల్, మునుగోడు
27.10.23	పాలేరు, స్టేషన్ ఘన్‌పూర్
29.10.23	కోదాడ, తుంగతుర్తి, ఆలేరు
30.10.23	జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్
31.10.23	హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ
01.11.23	సత్తుపల్లి, ఇల్లందు
02.11.23	నిర్మల్, బాల్కొండ, ధర్మపురి
03.11.23	బైంసా (ముథోల్)

లోక్‌సభ హక్కుల కమిటీ ముందు బీజేపీ ఎంపీ బిధూడీ గైర్హాజరు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



బీఎస్పీ ఎంపీ దానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యల వివాదంలో చిక్కుకున్న బీజేపీ ఎంపీ రమేష్ బిధూడీ లోక్‌సభ హక్కుల కమిటీ ముందు గైర్హాజరయ్యారు. మంగళ వారం లోక్‌సభ హక్కుల కమిటీ ముందు హాజరు కావాల్సి ఉండగా ఆయన డుమ్మా కొట్టారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్నానని, "మంగళవారం తాను అందుబాటులో ఉండటం లేదంటూ బీజేపీ నేత బిధూడీ పార్లమెంటరీ కమిటీకి లేఖ రాశారు. దానిష్ అలీపై వ్యాఖ్యలకు సంబంధించి తమ ముందు హాజరుకావాలంటూ హక్కుల కమిటీ ఆదేశాలిచ్చింది. ఈ కేసులో విచారణకు తదుపరి తేదీని పార్లమెంటు కమిటీ నిర్ణయిస్తుంది" అని ఆయన సన్నిహితులు తెలిపారు. ఇటీవల పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సౌత్ ఢిల్లీ ఎంపీగా ఉన్న బిధూడీ చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడంపై మాట్లాడారు. ఆ సమయంలోనే ఆయన దానిష్ అలీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాది ఉంటూ మండిపడ్డారు. ఎంపీ అలీపై అలాంటి వ్యాఖ్యలు చేయడంతో సభలో అలజడి చెలరేగింది. కొత్త పార్లమెంటు సాక్షిగా తనను అవమానించారని దానిష్ అలీ ఆవేదన వ్యక్తం చేయగా, బిధూడీని స్పీకర్ ఓం బిర్లా మందలించారు. ఆయన చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. బిధూడీపై చర్యలు తీసుకోవాలని దానిష్ అలీ లేఖ రాయడం, పార్లమెంటరీ కమిటీ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరడంతో లోక్‌సభ హక్కుల కమిటీ ముందుకు ఈ వ్యవహారం చేరింది. బిధూడీ వ్యాఖ్యలను బీజేపీ ఖండిస్తూ ఆయనకు షోకాజ్ నోటీసులిచ్చింది.

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభ కోణం కేసులో టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తదుపరి విచారణ జరుగుతుందని ధర్మాసనం వెల్లడించింది. మంగళవారం కూడా ఈ పిటిషన్ పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతృత్వంలో ద్విసభ్య ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఇరుపక్షాల న్యాయవాదులు హెూరాహెూరీగా వాదనలు వినిపించారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదించగా, సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ప్రధానంగా 17 ఏ చుట్టూనే వాదనలు జరిగాయి. తొలుత గంట పాటు న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. అనంతరం న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

ప్రజా ధనం దుర్వినియోగం అయిందని, చంద్రబాబు చర్యలతో ఏపీకి నష్టం జరిగిందని వాదించారు. సుదీర్ఘంగా వాదనలు జరగడంతో జోక్యం చేసుకున్న ధర్మాసనం వాదనలు వినిపించేందుకు ఇంకా ఎంత సమయం పడుతుందని అడగ్గా, మరో గంట పడుతుందని ముకుల్ రోహత్గీ అన్నారు. అయితే మిగతా వాదనలు శుక్రవారం వింటామని ధర్మాసనం అనగా, అందుకు చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకుని, ఈ రోజే వాదనలు పూర్తి చేయాలని అన్నారు. చాలా కేసులు ఉన్నాయని, ఈ రోజే వినేందుకు సమయం లేదని ధర్మాసనం పేర్కొంది. అయితే శుక్రవారం వాదనలు వినిపిస్తామని ముకుల్ రోహత్గీ అనగా, చంద్రబాబు తరపు న్యాయ వాది సిద్ధార్థ లూథ్రా గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుని శుక్రవారం లేదా సోమవారమని పేర్కొన్నారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

రాజ్యసభ సస్పెన్షన్‌పై సుప్రీంకోర్టుకు ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



రాజ్యసభ నుంచి తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ రాఘవ్ చద్దా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు మంగళ వారం సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సభా హక్కుల ఉల్లంఘన కింద రాఘవ్ చద్దాపై నలుగురు ఎంపీలు ఫిర్యాదు చేయడంతో ఆగస్టు 11న ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. సభా హక్కుల కమిటీ దర్యాప్తు చేసి, నివేదిక ఇచ్చేంత వరకూ ఆయనపై సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని రాజ్యసభ స్పష్టం చేసింది. దీనిని రాఘవ్ చద్దా సుప్రీంకోర్టులో తాజాగా సవాలు చేశారు. ఢిల్లీ బిల్లు ప్రతిపాదిత కమిటీలో తమను చేర్చారంటూ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్‌కు నలుగురు ఎంపీలు గత పార్లమెంటు సమావేశాల్లో ఫిర్యాదు చేశారు. తమ సంతకాలను ఫోర్జరీ చేశారని ఎంపీలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చద్దాపై సస్పెన్షన్ వేటు వేయాలంటూ రాజ్యసభ పక్షనేత పీయూష్ గోయల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఇందుకు అధికార పక్షం సభ్యులు మద్దతు పలకడంతో రాఘవ్ చద్దాను సస్పెండ్ చేశారు. అయితే, దీనికి ముందు తనపై వచ్చిన ఫోర్జరీ ఆరోపణలను చద్దా ఖండించారు. కమిటీలో భాగం కావాలని తాను వారిని ఆహ్వానించానని, సంతకం ఫోర్జరీ జరగలేదని, అందువల్లే పార్లమెంటరీ బులిటెన్‌లో దీని గురించి ప్రస్తావించలేదని ఆయన చెప్పారు. కేవలం ప్రతిపక్షాల నోరు మూయించేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కాగా, రాజ్యసభలో హక్కుల కమిటీ నివేదిక ఇచ్చేంత వరకూ ఆప్ మరో ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్‌ను కూడా పొడిగించారు.

కేరళలోని హెచ్ఐఎల్ మూసివేసిన కేంద్రం

కొచ్చి: కేరళలోని హిందూస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ (హెచ్ఐఎల్) పునరుద్ధరణ ఆశలకు కేంద్ర ప్రభుత్వం ముగింపు పలికింది. ఈ సంస్థపై తన పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్రం దృఢంగా ఉంది. హెచ్ఐఎల్‌ను మూసివేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని కంపెనీ ప్రధాన కార్యాలయం మంగళవారం ఒక ఉత్తర్వు జారీ చేసింది. హెచ్ఐఎల్ అన్ని ప్లాంట్ల కార్యకలాపాలను మూసివేయడానికి బోర్డు (డైరెక్టర్లు) ఆమోదం తెలిపిందని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో కేరళలోని ఉద్యోగమండల్, పంజాబ్‌లోని బటిండా వద్ద న్న హెచ్ఐఎల్ యూనిట్లు మూతపడ్డాయి. హెచ్ఐఎల్ అనేది కేరళలోని మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ రంగ యూనిట్. 1958 ఏప్రిల్ 24న స్థాపించారు. అప్పటి నుంచి 2015 వరకూ లాభాల్లో నడిచింది. రెండేళ్ల క్రితమే ఇక్కడ ఉత్పత్తిని నిలిపివేశారు. ఉపసంహరణలో భాగంగా 25 మంది ఉద్యోగులను మహారాష్ట్రలోని రసాయని యూనిట్‌కు బదలీ చేశారు. ఈ సంస్థను కేరళ ప్రభుత్వం టేకోవర్ చేసుకోవడానికి లేదా దీనిలో ఉద్యోగులను ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ ట్రావెన్‌కోర్(ఎఫ్ఏసిటి)లోకి పంపించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. హెచ్ఐఎల్‌ను మూసివేయడంతో 45 మంది ఉద్యోగుల భవిష్యత్ అంధకారంలో పడింది. ఉద్యోగులకు ఇప్పటికే ఒక ఏడాది నుంచి జీతాలు చెల్లించడం లేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇతర ప్రయోజనాలు లభించలేదు.

ఎన్నికల బాండ్లపై 31న సుప్రీం తుది విచారణ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 31న తుది విచారణ జరుపుతుంది. పిటిషన్లపై 31న విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం మంగళవారం తెలిపింది. ద్రవ్య బిల్లుగా ఆమోదం పొందిన 2017వ సంవత్సరపు ఫైనాన్స్ చట్టాన్ని సవాలు చేస్తూ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ ప్రధాన పిటిషన్ దాఖలు చేసింది. రాజకీయ పార్టీలకు వ్యక్తులు లేదా కంపెనీలు ఎన్నికల నిధులు అందించేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం ఎలక్టొరల్ బాండ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఏదైనా కంపెనీ తన మూడు సంవత్సరాల సగటు నికర లాభంలో 7.5% వరకూ రాజకీయ పార్టీలకు విరాళంగా ఇవ్వవచ్చునంటూ గతంలో విధించిన పరిమితిని కూడా ఈ చట్టం తొలగించింది.

పిటిషనర్ల అభ్యంతరాలు

ఎన్నికల బాండ్ల పథకం ప్రకారం ఏదైనా కంపెనీ తాను విరాళాన్ని అందించే రాజకీయ పార్టీ పేరును బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు. విరాళాలు అందించే వ్యక్తుల పేర్లు కూడా బయటపెట్టరు. దీనిపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట సవరణల్లో పారదర్శకత లోపించిందని, పరస్పర విరుద్ధ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని, నల్లధనం, అవినీతి పెరుగుతాయని వారు వాదించారు. షెల్ కంపెనీలు పుట్టుకొస్తాయని, లెక్కాపత్రం లేని సొమ్ము బినామీ లావాదేవీల ద్వారా దేశ రాజకీయ, ఎన్నికల ప్రక్రియలోకి చేరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రశాంత్ భూషణ్ ఏమన్నారు?

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం వాదనలు వినిపిస్తూ ఈ వ్యవహారంపై న్యాయస్థానం 2017 నుండి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనివల్ల అధికార పార్టీ లోక్‌సభ ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ లబ్ది పొందుతోందని ఆరోపించారు. ఆ పథకాన్ని మోసపూరితంగా ద్రవ్య బిల్లు రూపంలో చట్టసభలో ప్రవేశపెట్టారని, ఇది గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థలు పార్టీలకు విరాళాలు అందించడాన్ని చట్టబద్ధం చేస్తోందని ఆయన వాదించారు. రాజకీయ పార్టీలకు అందే నిధులకు సంబంధించిన వివరాలు సమాచార హక్కు చట్టం ద్వారా పొందే అవకాశం లేకుండా పోతోందని, ఇది కచ్చితంగా ప్రజల హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని, పైగా అవినీతి పెచ్చుమీరే ప్రమాదం ఉన్నదని తెలిపారు. 'రాజకీయ పార్టీల నుండి ఏవో ప్రయోజనాలను పొందే కంపెనీలు అందుకు ప్రతిఫలంగా వాటికి విరాళాలు అందిస్తుంటాయి. అవినీతి రహిత సమాజం గురించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 చెబుతోంది. కాబట్టి నిధులు ఎవరు అందజేశారనే విషయాన్ని గోప్యంగా ఉంచకూడదు' అని ఆయన అన్నారు. నవంబరులో ఐదు రాష్ట్రాలకు జరిగే శాసనసభ ఎన్నికలకు ముందు ఈ పథకాన్ని నిలిపివేయాల్సిన అవసరం లేదని, అయితే వచ్చే సంవత్సరం జరిగే లోక్‌సభ ఎన్నికలకు ముందే దీనిపై విచారించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ద్రవ్య బిల్లుతో ముడి పెట్టకుండా...

ఎలక్టొరల్ బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించడానికి ముందు ద్రవ్య బిల్లు అంశాన్ని తేల్చాలని పిటిషనర్లు కోరుతున్నారా అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రశ్నించగా ద్రవ్య బిల్లు అంశంపై విచారణ జరుపుతూనే బాండ్లపై దాఖలైన పిటిషన్లను విచారించవచ్చునని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. మరో న్యాయవాది షాదాన్ ఫరాసత్ తన వాదనలు వినిపిస్తూ విరాళం అందించే వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచినప్పటికీ విరాళం ఎంత ఇచ్చిందీ వెల్లడించేందుకు ఆంక్షలేవీ లేవని చెప్పారు. కంపెనీలు తాము అందించే విరాళాలను వాటాదారులకు తెలియజేస్తాయని, అయితే అవి ఏ పార్టీకి అందాయో వారికి తెలియదని అన్నారు. చట్ట ప్రకారం ఎన్నికల బాండ్ల పథకాన్ని ద్రవ్య బిల్లుగా సభలో ప్రవేశపెట్టకూడదని చెప్పారు. బాండ్ల పథకాన్ని ద్రవ్య బిల్లుగా ప్రవేశపెట్టడం సబబేనని న్యాయస్థానం అభిప్రాయపడితే ఈ కేసును ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించాల్సిన అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. కాబట్టి ఇది ద్రవ్య బిల్లు కాదన్న కారణం చూపి బాండ్ల పథకాన్ని పిటిషనర్లు సవాలు చేయకుండా ఉంటేనే విచారణ ముందుకు సాగుతుందని చెప్పారు. ద్రవ్య బిల్లు వ్యవహారంపై ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ సంవత్సరంలోనే తీర్పు ఇస్తుందా లేదా అనే విషయాన్ని తాను చెప్పలేనని తెలిపారు. దీనిపై ప్రశాంత్ భూషణ్, ఇతర న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ ద్రవ్య బిల్లు వ్యవహారంలోకి పోకుండా బాండ్ల పథకం పైనే వాదనలు వినిపించేందుకు అంగీకారం తెలిపారు. ప్రభుత్వ అభిప్రాయాన్ని ఈ నెల 28 నాటికి లిఖితపూర్వకంగా అందజేయాలని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణికి న్యాయస్థానం సూచించింది.

ఏమిటీ పథకం ?

ఎన్నికల బాండ్ల పథకాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2018 జనవరిలో ప్రవేశపెట్టింది. పౌరులు కానీ, కంపెనీలు కానీ వీటిని బ్యాంకు నుండి కొనుగోలు చేసి రాజకీయ పార్టీకి ఇవ్వవచ్చు. ఆ పార్టీ సదరు మొత్తాన్ని నగదు రూపంలో విత్‌డ్రా చేసుకోవచ్చు. ఈ బాండ్ల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ద్రవ్య బిల్లు రూపంలో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ద్రవ్య బిల్లులకు రాజ్యసభ ఆమోదం అవసరం లేదు. ఈ పథకంపై ఎన్నికల కమిషన్, రిజర్వ్‌బ్యాంక్ సందేహాలు వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఎన్నికల బాండ్లు విక్రయించే బాధ్యతను ఎస్‌బీఐకి అప్పగించింది. బ్యాంకు వద్ద పది వేల రూపాయల నుండి కోటి రూపాయల విలువ కలిగిన బాండ్లు లభిస్తాయి. వీటిని నగదు చెల్లించడం ద్వారా లేదా నగదును బదిలీ చేయడం ద్వారా కొనుగోలు చేయవచ్చు. నగదు రూపంలో డిపాజిట్ చేయాలంటే ఖాతా తెరవాల్సి ఉంటుంది. బాండ్లను ఎవరు కొనుగోలు చేసిందీ ఒక్క ఎస్‌బీఐకి మాత్రమే తెలుస్తుంది. అయితే బ్యాంకు ఆ వివరాలు బయటపెట్టకూడదు. ఎవరు ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చిందీ పబ్లిక్ డొమైన్‌లో ఉంచరు. 2017లో చేసిన బడ్జెట్ ప్రసంగంలో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ పథకాన్ని ప్రకటించారు. రాజకీయ విరాళాల ప్రక్రియను ప్రక్షాళన చేసి, పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిం దని ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యవహారం మొత్తం గోప్యంగా ఉండడంతో అనుమానాలకు తావిస్తోంది. వడ్డీ లేని బాండ్లను కొనుగోలు చేశామని ఎవరూ ప్రకటించాల్సిన అవసరం లేదు. సొమ్ము ఎక్కడి నుండి వచ్చిందో చెప్పాల్సిన అవసరం రాజకీయ పార్టీలకూ లేదు.

అరుంధతీరాయ్‌పై కేసు!



న్యూఢిల్లీ : 2010లో జమ్ముకాశ్మీర్‌పై వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ షేక్ షోకత్ హుస్సేన్‌లపై విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సెక్సెనా అనుమతించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలకు గాను న్యూఢిల్లీలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదయింది. చట్టవ్యతిరేక కార్యక్రమాలు (నివారణ)చట్టం (ఉపా) 1967 సెక్షన్13 కింద ఈ కేసు నమోదైనట్టు సమాచారం. ఈ కేసులో ఇతర నిందితులుగా ఉన్న కాశ్మీరీ వేర్పాటువాద నాయకులు సయ్యద్ అలీ సాహ్ గిలానీ, ఢిల్లీ యూనివర్సిటీ అధ్యాపకులు సయ్యద్ అబ్దుల్ రహ్మాన్ గిలానీ విచారణ సమయంలోనే మరణించారు. దేశద్రోహం ఆరోపణల కింద ఈ కేసును విచారణ చేస్తామని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించినా, సుప్రీంకోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని ఈ అభ్యర్థనను తిరస్కరించామని లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం తెలిపింది. జమ్మూకాశ్మీర్‌కు చెందిన సామాజిక కార్యకర్త సుశీల్ పండిట్ చేసిన ఫిర్యాదు మేరకు 2010 అక్టోబర్ 28న ఈ కేసు నమోదయింది.

బిజినెస్

మనీలాండరింగ్ కేసులో లావా ఎండీ అరెస్టు

- వివోకు చెందిన మరో ముగ్గురు..

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ అంశంలో లావా ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు హరి ఓం రాయ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. రాయ్‌తో పాటు వివో మొబైల్స్ ఇండియాకు చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లను అదుపులోకి తీసుకుంది. వివో మొబైల్స్ ఇండియా, గ్రాండ్ ప్రాస్పెక్ట్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్ (జీపీఐసీపీఎల్)తో సహా 23 అనుబంధ కంపెనీలకు చెందిన 48 ప్రాంతాల్లో ఇడి సోదాలు నిర్వహిం చింది. జీపీఐసీపీఎల్ నేరపూరిత చర్యలకు పాల్పడిందని ఆరోపిస్తూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. అయితే ఈ కేసులో లావా ఎండీ అరెస్టునకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

భారత వృద్ధి 6.3 శాతమే..

- ఐఎంఎఫ్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు పడిపోనుందని ప్రపంచ బ్యాంక్ బాటలోనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.3 శాతానికి పరిమితం కావొచ్చని ఐఎంఎఫ్ తాజా రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. 2023లో ప్రపంచ వృద్ధి రేటు 3 శాతం పెరుగొచ్చని పేర్కొంది. 2024లో 10 బేసిస్ పాయింట్లు తగ్గి 2.90 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ వైపు దూసుకుపోతోన్నామని ప్రధాని మోడీ పదేపదే చెబుతున్న మాటలకు భిన్నంగా ఈ అంచనాలు వెలుపడటం గమనార్హం. ఇంతక్రితం 2022-23లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 7.2 శాతంగా నమోదయ్యింది. 2021-22లో 9.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది.

150 స్టోర్లకు విస్తరించిన కోస్టా కాఫీ

న్యూఢిల్లీ : కాఫీ బ్రాండ్ భారత్‌లో 150 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. నూతన స్టోర్‌ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేయడం ద్వారా ఈ మైలురాయిని చేరినట్లు పేర్కొంది. కోకా కోలాకు చెందిన ఈ బ్రాండ్ 2005లో భారత మార్కెట్‌లోకి ప్రవేశించింది. దేవయాని ఇంటర్నేషనల్ సహకారంతో విస్తరించింది. దేశంలోని టాప్ 8-10 నగరాల్లో కొత్త స్టోర్‌లను ప్రారంభించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కోస్టా కాఫీ ఇండియా జీఎం వినయ్ నాయర్ పేర్కొన్నారు.

మరిన్ని డెలివరీ సంస్థలతో అమెజాన్ జట్టు

హైదరాబాద్ : ప్రస్తుత పండుగ సీజన్‌లో వినియోగదారులకు మరింత వేగంగా సేవలను అందించడానికి అమెజాన్ ఇండియా కొత్తగా 12 మంది డెలివరీ సర్వీస్ పార్టనర్ (డీఎస్‌పీ)లతో జట్టు కట్టినట్టు పేర్కొంది. తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ ఎన్‌సిఆర్, మహారాష్ట్ర వ్యాప్తంగా తన డీఎస్‌పీ కార్యక్రమంలో భాగంగా డెలివరీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆన్‌బోర్డ్ చేసుకున్నామని ఆ సంస్థ ప్రకటించింది. పండుగ సీజన్ సమయంలో అమెజాన్ ఇండియా లాస్ట్ మైల్ నెట్‌వర్క్‌ను ఈ కార్యక్రమం బలోపేతం చేస్తుందని పేర్కొంది. ఇప్పటికే 300 మంది చిన్న, మధ్య తరహా ఔత్సాహికవేత్తలతో భాగస్వామ్యం కలిగి ఉన్నట్టు తెలిపింది.

బీఆర్ఎస్‌లోకి చామల ఉదయ్‌చందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందనీ, కేసీఆర్ మూడో సారి సీఎం అవుతున్నారని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. టీపీసీసీ మాజీ సభ్యులు, ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షులు చామల ఉదయ్‌చందర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జ్ కల్వకుంట వంశీధర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చామల ఉదయ్‌చందర్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ గులాబికండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఆలేరులో గులాబి జెండా ఎగురబోతుందన్నారు. మూడోసారి గొంగిడి సునీత గెలుస్తారని తెలిపారు. ఉదయ్ చందర్‌రెడ్డికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ అన్వేష్, చామల భానుచందర్‌రెడ్డి, ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ భానుచందర్, వడ్లకొండ శ్రీకాంత్, కూరెళ్ళ నరేష్‌గౌడ్, గంధమల్ల కరుణాకర్, తిరునగరి ఫణిందర్, కొప్పుల నర్సిరెడ్డి, కొండపురం శ్రీహరి, శ్రీకాంత్, చామల మేఘారెడ్డి, భగవంత్‌రెడ్డిలు ఉన్నారు.

అలయ్ బలయ్‌కు రండి

- గవర్నర్ తమిళిసైకి ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అలయ్ బలయ్-2023లో పాల్గొనాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఆహ్వానం అందింది. మంగళవారం రాజ్‌భవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, సభ్యులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

సీడబ్ల్యూసీ తీర్మానం బీసీలను మోసం చేసేందుకే : గెల్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడుతామని సీడబ్ల్యూసీ తీర్మానం చేయడం కేవలం బీసీలను మోసం చేసేందుకేనని తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1953 జనవరి 29న కాకా కాలేల్కర్ కమిషన్ అధ్యక్షతన రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మొదటి వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటయిందని గుర్తుచేశారు. ఆ కమిషన్ 1955 మార్చి 30న నివేదిక సమర్పించిందనీ, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటు తనానికి కులాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని కమిషన్ చేసిన సూచనను నాటి నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ తిరస్కరించిందని తెలిపారు. అనంతరం వచ్చిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కమిషన్ సిఫారసులను అమలు చేయలేదని విమర్శించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని నాడు కేసీఆర్ కోరినా పట్టించుకోలేదని తెలిపారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏనాడు బీసీలకు న్యాయం చేయలేదనీ, ఆ పార్టీ ఉచ్చులో పడొద్దని బీసీలకు ఆయన సూచించారు.

కాంగ్రెస్‌తో కుదిరిన రాజకీయ అవగాహన

- ఇంకా ఖరారు కాని సీట్లు
- ఎన్నికలకు ఆర్నెల్ల ముందే కొత్త పథకాలు అమలు చేయాలి
- అధికారుల బదిలీల పేరుతో తాబేదార్ల నియామకం
- ఎన్నికల కమిషన్‌కు లేఖ : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరిందని, ఇంకా సీట్లు ఖరారు కాలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. మీడియాలో వస్తున్న ఊహాగానాలు నమ్మొద్దని చెప్పారు. కాంగ్రెస్ నాయకులతో చర్చలు ఆశాజనకంగా ఉన్నాయనీ, అవి పరిష్కారమవుతాయని ఆశిస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ, సీపీఐ(ఎం) చెరో ఐదు సీట్లు కావాలంటూ కాంగ్రెస్‌కు జాబితా అందజేశామని అన్నారు. దీనిపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో చర్చించామని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ సీపీఐ, సీపీఐ(ఎం)లతో కాంగ్రెస్ విడివిడిగా చర్చలు జరిపిందన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రతిపాదించిన స్థానాల్లో ఎలాంటి వివాదం లేదనీ, రెండు పార్టీలనూ కలిపి చర్చలు జరిపితే బాగుండేదని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలోనే కాంగ్రెస్, వామపక్షాలు కలిసే ఉన్నాయని గుర్తు చేశారు. వివిధ రాష్ట్రాల్లో కలిసి, సర్దుబాటు కుదరకపోతే విభేదించుకుని పోటీ చేస్తున్నామని చెప్పారు. కేరళ, పశ్చిమబెంగాల్‌లో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఆయా రాష్ట్రాలలో జరిగే ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసినా, జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలలో భాగంగా ఛత్తీస్‌ఘడ్ బస్తర్ ప్రాంతంలో సీపీఐ ఏడు, ఇతర ప్రాంతాల్లో ఏడు కలిపి 14 చోట్ల పోటీ చేస్తున్నదని వివరించారు. సీపీఐ(ఎం), సీపీఐ కలిసి 40 నుంచి 45 స్థానాలలో పోటీ చేస్తున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లో సీపీఐ 15, సీపీఐ(ఎం) 14 స్థానాలలో ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయని చెప్పారు. రాజస్థాన్‌లో సీపీఐ 14, సీపీఐ(ఎం) 15 స్థానాలలో పోటీ చేస్తున్నాయని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో రాజకీయ అవగాహన ఉందని నారాయణ స్పష్టం చేశారు.

ఉద్దేశపూర్వకంగా అధికారుల బదిలీలు చేయొద్దు

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి రెండునెలల ముందు అధికారులను బదిలీ చేస్తున్నారని నారాయణ చెప్పారు. అయితే అధికార పార్టీకి తాబేదార్లుగా ఉండే వారిని నియమించుకుంటున్నారని విమర్శించారు. పోలీసు, రెవెన్యూ అధికారులంతా పాలకులు చెప్తే వినేవారిని పెట్టుకుంటున్నారనీ, తద్వారా రాజకీయ ప్రయోజనం నెరవేర్చుకుంటున్నారని అన్నారు.

దాని బదులు ప్రయివేటు గ్యాంగ్‌ను పెట్టుకోవచ్చుకదా?అని విమర్శించారు. బౌన్సర్లను నియమించుకుంటే బాగుంటుంది కదా?అని అన్నారు. అధికార పార్టీకి ఉపయోగపడేలా బదిలీలు చేయడం అధికారులకే అవమానకరమని చెప్పారు. ఎన్నికల హామీలు, కొత్త పథకాలను ఆర్నెల్ల ముందే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దళితబంధు, రైతుబంధు వంటివి ఎన్నికల ముందు ప్రారంభించడం, పోలింగ్ సమయంలో ఓటర్ల ఖాతాల్లో నిధులు జమ కావడం అధికార దుర్వినియోగం కాదా?అని ప్రశ్నించారు. ఇది అవినీతి కిందకు రాదా?అని అడిగారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగం పాల్పడేందుకు అవకాశం లేకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికార పార్టీతో ఈసీ కుమ్మక్కు అయినట్టు భావించాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు నారాయణ మంగళవారం లేఖ రాశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో నగదు పట్టివేత

- సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం



నవతెలంగాణ- విలేకరులు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సరైన పత్రాలు చూపని వారి నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు.

హైదరాబాద్‌లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు దొరికింది. కియా వాహనంలో రూ.3 కోట్ల 35 లక్షలను స్వాధీనం చేసుకున్నట్టు వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలంలో మేడిపల్లి పోలీసులు, ఎస్‌ఓటి మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఓ వాహనంలో 6,01,940 నగదును స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట లింగాపూర్ తండాలోని అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో కారులో రూ.89,500 పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి జంక్షన్‌లో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న మూడు వాహనాల్లో రూ.3.75 లక్షలను స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పజెప్పారు. ఆత్మకూరు ఎస్ మండలం నెమ్మికల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు హుజూర్‌నగర్‌కు చెందిన కొప్పుల సైదులు కారులో 1.85లక్షలను స్వాధీనం చేసుకుని కలెక్టర్‌కు అప్పజెప్పారు.నల్లగొండ జిల్లా అనుముల మండల కేంద్రంలోని హాలియా పాత ఐటీ సమీపంలో ఆర్టీసీ బస్సులో రూ.30 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో 30 లక్షల రూపాయలను సీజ్ చేసినట్టు హాలియా సబ్ ఇన్‌స్పెక్టర్ శోభన్ బాబు తెలిపారు. మిర్యా లగూడ పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద సరైన శ్రీనివాస రంగారావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై రూ.3.50 లక్షలతో వెళుతుండగా వన్ టౌన్ సీఐ రాఘవేంద్ర స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల అధికారి బి.చెన్నయ్య తెలిపారు. వాడపల్లి ఎస్ఐ వాహన తనిఖీలు చేస్తుండగా కోటేశ్వరరావు వద్ద రూ.2లక్షలు పట్టుబడింది. నగదును ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి చెన్నయ్యకు అప్పగించారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ ఉన్నట్టు వచ్చిన విశ్వాసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 193లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. దీని విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేయగా, ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు లక్షల నగదు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా లక్ష రూపాయలు పట్టుబడ్డాయి. ముదిగొండలో రూ.1.57 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 1.20 లక్షల నగదు పట్టుబడింది. కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ముగ్దుంపూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ దగ్గర వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీని పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు పరిశీలించారు. రూ.3 లక్షలు సీజ్ చేశారు.

కేసీఆర్‌ను పక్కలో కూర్చోబెట్టుకోం

- ఆయన కుటుంబ, అవినీతి పార్టీ అధ్యక్షులు :మేధావుల సదస్సులో కేంద్ర మంత్రి అమిత్‌షా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుటుంబ, అవినీతి పార్టీ అధ్యక్షుడు, మజ్లిస్ పార్టీలో ప్రభుత్వాన్ని నడుపుతున్న కేసీఆర్‌ను తమ పక్కలో ఎట్టి పరిస్థితుల్లోనూ కూర్చోబెట్టుకోబోమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. కేటీఆర్‌ను సీఎం చేయడం, కవితను జైలుకెళ్లకుండా కాపాడుకోవడం పనిలో కేసీఆర్ ఉన్నారని చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో మేధావులతో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు. బీఆర్ఎస్‌కు సిద్ధాంతాల్లేవనీ, తమది సిద్ధాంతానికి అనుగుణంగా నడిచే పార్టీని అని చెప్పారు. కేసీఆర్ కారు స్టీరింగ్ మజ్లిస్ చేతిలో ఉందని ఆరోపించారు. రానున్న ఐదేండ్లు మంచి పాలన ఎవరు ఇవ్వగలరో తెలంగాణ సమాజం ఆలోచించాలని కోరారు. కేసీఆర్ చెప్పిన నీళ్ళు, నిధులు, నియామకాల ఆకాంక్షలు నెరవేరలేదనీ, అందుకే బీజేపీకి ఓటేయాలని కోరుతున్నామన్నారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులను అవినీతి మయంగా మార్చారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో అభివృద్ధి నిరోధక సర్కార్ ఉందనీ, ఫాంహౌస్, కుటుంబ రాజకీయాలతో తెలంగాణను ఏలుతున్నదని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితిలో రాష్ట్ర సర్కారు ఉందన్నారు. ఆదాయం పేరిట ఔటర్‌రింగ్‌రోడ్డును 30 ఏండ్లకు రూ.7,380 కోట్లకే ప్రయివేటు సంస్థకు ఇవ్వడం దారుణమన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదాయం కోసం మూడు నెలల ముందుగానే మద్యం టెండర్లు వేసిందని విమర్శించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో మేధావులు కీలక పాత్రపోషించారన్నారు. కళాకారులు తమ ఆటపాటల ప్రజల్ని చైతన్యపరిచారని గుర్తుచేశారు. మేధావులు, కళాకారులు మౌనం వీడి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేండ్ల పాలనలో మోడీ ప్రభుత్వం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించిందనీ, ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దిందని చెప్పారు. సదస్సులో బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాష్ జవదేకర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవు

- వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల అధికారుల సమావేశంలో.. వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్



నవతెలంగాణ-సుబేదారి

ప్రశాంత వాతావరణంలో, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా మంగళవారం హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, జనగామ కలెక్టర్ శివలింగయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సోమవారం నుండే అమలులోకి వచ్చిందని, డిసెంబర్ 5వ తేదీ వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించొద్దని, ఒకవేళ నిర్వహించాల్సి వస్తే తప్పనిసరిగా ముందస్తుగా లిఖిత పూర్వకంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలని సూచించారు. ఇప్పటి నుంచి ఎంసీఎంసీ, సోషల్ మీడియా బృందాలు పనిచేస్తాయని వివరించారు. నవంబర్ 3వ తేదీ నుంచి ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందాలు ఏర్పాటవుతాయని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈసారి కొత్తగా సీ-విజిల్ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులో తెచ్చిందని, దీని ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫొటోలు, వీడియోలు తీసి ఈసీ దృష్టికి తేవొచ్చని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలీస్ బందోబస్తుతోపాటు మైక్రో అబ్జర్వర్స్ పరిశీలిస్తారని తెలిపారు. జిల్లా పరిహద్దుల్లో చెక్‌పోస్టులు, ఫ్లైయింగ్ స్కాడ్ బృందాలు పనిచేస్తాయని తెలిపారు. అధికారులకు కేటాయించిన విధులపై ఇప్పటికే పలు దఫాలు శిక్షణ, సమావేశాలు నిర్వహించామన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సమయంలో సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, ఇతర ప్రాంతాల్లో జరిగిన వీడియోలు ఇక్కడ జరిగినట్టు ప్రచారం చేయడం, పాత వీడియోలను ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



- సాంఘిక భద్రత లేని కొత్త పెన్షన్ విధానం వద్దు : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ మిశ్రా

నవతెలంగాణ - ముషీరాబాద్

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ మిశ్రా అన్నారు. అన్ని రంగాల రిటైర్డ్ ఉద్యోగులు, సర్వీస్‌లో కొనసాగుతున్న సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనివర్సల్ పెన్షనర్స్ రాష్ట్రస్థాయి కన్వెన్షన్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోని 44 దేశాల్లో యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ కల్పిం చడంలో 42వ స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో పని చేస్తున్న మొత్తం సంఘటిత రంగంలోని కార్మికుల్లో 75 లక్షల మంది నూతన పెన్షన్ విధానంలో ఉన్నారని తెలిపారు. 15 ఏండ్ల తర్వాత పాత పెన్షన్ విధానంలో ఉండే ఉద్యోగుల సంఖ్య పూర్తి స్థాయిలో తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కూడా నూతన పెన్షన్ విధానంలోని ఉద్యోగులకు అందుబాటులో లేదని చెప్పారు. ఇప్పుడున్న రాజకీయ సమూహాల నేపథ్యంలో ఒక గ్రాట్యుటీ కూడా భవిష్యత్‌లో కొనసాగే అవకాశం కష్టతరమే అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ రాజకీయ విధానం ప్రకారం ఉద్యోగులెవరికీ సాంఘిక భద్రత కల్పించడానికి సిద్ధంగా లేరన్నారు. స్థిరమైన ఉపాధి పూర్తిగా వశించిపోతున్న సందర్భంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ మొదలగు విధానాలు అంతటా అమలవుతున్న కారణంగా ఉద్యోగ భద్రత సైతం కోల్పోతున్న ఉద్యోగులు సంఘటితమై తమ సాంఘిక భద్రత కోసం పోరాడే అవకాశాలు సన్నగిల్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వివిధ రంగాల ఉద్యోగులతో పాటు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, పింఛనుదారులు, పింఛను పొందలేని వారు కలిసి ఒక కార్యాచరణగా ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఐక్యత ద్వారా యూనివర్సల్ పెన్షన్ విధానం కోసం ప్రయత్నం చేయాలని చెప్పారు.

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సర్కిల్ సెక్రెటరీ రామచంద్రుడు మాట్లాడుతూ.. అత్యంత తక్కువ శాతం మందికి మాత్రమే అందుబాటులో ఉన్న డిఫైన్డ్ పెన్షన్ విధానంలో కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు. 2004 నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో, 2010 నుంచి బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాల్లో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధాన ప్రతిఫలాలు అరకొరగా, భవిష్యత్‌కు భరోసా లేని విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో అయోమయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ శాఖలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు అరెస్ట్ కావడంతో పెద్దదిక్కును కోల్పోయినట్ట యింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరుణంలో సంబంధిత నిర్ణయాలు అన్ని పెండింగ్‌లో పడ్డాయి. పార్టీ తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్రంలో పార్టీని కదిలించే ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బస్సుయాత్ర చేపట్టాలనుకున్నా, బాబు అరెస్ట్ నేపథ్యంలో అది వాయిదా పడింది. ప్రస్తుతం చంద్రబాబు గత నెల రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న సంగతి తెలిసిందే. తెలంగాణలో పోటీ చేస్తారా ? లేదా ? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకమే. బాబు అందుబాటులో లేకపోవడంతో ఎన్నికల వ్యవహారం సందిగ్ధంలో పడింది. ఆ పార్టీ, ప్రజాసంఘాల కార్యక్రమాలు పుంజుకుంటున్న నేపథ్యంలో చంద్రబాబు అరెస్ట్ ఆశనిపాతంగా మారింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ అంశాలపై సమీక్షలు పూర్తయ్యాయి. పార్లమెంటు స్థానాల వారీగా పార్టీ కార్యకలాపాలను పెంచేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇటీవల ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌ను సందర్శించారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర నేతలను కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను వివరించారు. పార్టీ ఇటు తెలంగాణ, అటు ఏపీలోనూ పోటీ చేస్తుందంటూ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు విడుదల కోసం టీడీపీ, ఇతర సంఘాలు కలిసి పలు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాయి. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సైతం చంద్రబాబుకు మద్దతిస్తూ ఎన్టీఆర్‌గార్డెన్స్‌లో సంఘీభావ దీక్ష చేపట్టారు. ఏపీ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలే చేశారు.

అధినేత లేక అనిశ్చితి పెండింగ్‌లో ఎన్నికల నిర్ణయాలు

రాష్ట్రంలో ఎన్నికలు సమీస్తున్న తరుణంలో పార్టీలో అయోమయం కనిపిస్తున్నది. అభ్యర్థుల ఎంపిక కోసం చంద్రబాబు నియమించిన స్కీనింగ్ కమిటీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం గమనార్హం. బాబు లేకపోవడంతో అది కూడా పెండింగ్‌లో పడింది. దీంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఒకింత నిరుత్సాహం కనిపిస్తున్నది. తెలంగాణలో ఒంటరిగానే పోటీచేస్తామని ఇంతకు ముందే చంద్రబాబు ప్రకటించిన విషయం విదితమే. ఈతరుణంలో చంద్రబాబు బెయిల్‌పై బయటకు రాగానే తెలంగాణలో పోటీచేసే స్థానాలకు సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం లేపోలేదు. . ఇదిలావుండగా రాష్ట్రంలో 119 స్థానాల్లో పోటీ చేస్తామనీ, బీసీలకు ప్రాధాన్యత ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. రాజకీయ నిర్ణయాలు చేసేందుకు చంద్రబాబు తనయుడు లోకేశ్, బాలకృష్ణతో సంప్రదింపులు చేసే అవకాశాలు కనిపిస్తున్నట్టు పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి.

కాలనీని శుభ్రంగా ఉంచుకోవాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

మన ఇంటితో పాటు కాలనీ పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ కాలనీ రోడ్లపై చెత్త కుప్పలు ఎక్కడికక్కడే పేరుకు పోయాయని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత సిబ్బందితో ఆ రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. తర్వాత బతుకమ్మ పండుగ పురస్కరించుకొని కాలనీలో పెరిగిన చెట్ల కొమ్మలను కూడా తొలగించి, శుభ్రం చేయించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యాలు బాగుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేంకటేశ్వర్లు, ట్రెజరర్ శివరామ్ ప్రసాద్ లు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా : సైబర్ క్రైమ్ డీసీపీ



నవతెలంగాణ - హయత్ నగర్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాపై రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ అన్నారు. ఈ మేరకు మంగళవారం డీసీపీ మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనలో ఉన్నందున వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు గ్రూపులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. కాబట్టి సోషల్ మీడియాలో అడ్మిన్లు సభ్యులను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ పెట్రోలింగ్ సైతం ఏర్పాటు చేశామని, సోషల్ మీడియాలో వ్యక్తి గతంగా అనుచిత వ్యాఖ్యలు, అసభ్యంగా దూషించిన కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండె జబ్బుల
ముందస్తు గుర్తింపుతో ప్రాణాలను కాపాడుకోవచ్చు

- కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి

నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో గుండె జబ్బుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. ఇప్పుడు యువతలో కూడా గుండెపోటు కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గుండె జబ్బులను తగ్గించడానికి, మిమ్మల్ని, ఫ్యామిలీ వారిని రక్షించుకోవడానికి, దాని లక్షణాలను సకాలంలో గుర్తించడం చాలా ముఖ్యం. ఏదైనా పెద్ద ప్రాణాంతక ప్రమాదానికి ముందు శరీరానికి హెచ్చరికలు రావడం ముందుగా దాన్ని మనం గుర్తించడం ద్వారా, ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. చాలా గుండెపోట్లు ఛాతీ మధ్యలో నొప్పి ఉంటుందని, అది కొన్ని నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు ఉండవచ్చని, నొప్పి వచ్చి వెళ్లవచ్చని చెప్పారు. ఇది అసౌకర్య ఒత్తిడి, లేదా నొప్పి అనిపించవచ్చు అని తెలిపారు. ఛాతీ నొప్పి ఉంటే తేలికగా తీసుకోవద్దని, ఈసీజీ చేయించుకోవాలని, తద్వారా నొప్పికి ఖచ్చితమైన కారణం తెలుస్తుందని తెలిపారు. ప్రజలు దీన్ని సాధారణ నొప్పిగా భావించి, ఇంటి నివారణల ద్వారా వదిలించుకోవడానికి ప్రయత్నించడం వల్ల చాలా కేసులు తీవ్రంగా మారుతాయని వైద్యులు అంటున్నట్టు తెలిపారు. అలాంటి పరిస్థితిలో ప్రతి ఒక్కరూ ఈ హెచ్చరిక గురించి తెలుసుకోవాలని, గుండెపోటు లక్షణాలను గుర్తించడం చాలా ముఖ్యం అన్నారు.

గుండెపోటు లక్షణాలు

చేతులు, వీపు, మెడ, దవడ లేదా పొట్టలో నొప్పి, చల్లని చెమట, వికారం లేదా మైకము, తక్కువ ఊపిరి మొదలైనవి ఉంటాయి. గుండెపోటు, చాలా అలసటగా అనిపించడం కూడా ప్రమాద లక్షణాల్లో చేర్చబడ్డాయి. అదనంగా, పాదాల్లో మంటలు, ఉదరం వాపు, గుండె వైఫల్యాన్ని సూచిస్తాయి. ఈ లక్షణాలను గుర్తించి, త్వరగా వైద్యునితో పరీక్షించుకోవడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చు. శరీరంలో మారుతున్న లక్షణాలను సమయానుకూలంగా గుర్తించాలని, జీవితాన్ని ఆరోగ్యకరంగా ఉంచుకోవాలని సూచించారు.

వెన్నెముక రుగ్మతలకు దారి తీస్తున్న ఆర్థరైటిస్

- యువకుల్లో వైకల్యానికి ప్రధాన కారణాల్లో వెన్ను నొప్పి ఒకటి
- సీనియర్ ఆర్థోస్కోపీ అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ పి.ఎస్.జయ ప్రసాద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అక్టోబర్ 12వ తేదీన ప్రపంచ ఆర్థరైటిస్ రోజు. ప్రతి ఏడాదీ నిర్వహిస్తారు. ఆస్టియో ఆర్థరైటిస్ పెద్ద సంఖ్యలో అంగవైకల్యానికి కారణం అవుతున్న వ్యాధి. దాదాపు వంద రకాల ఆర్థరైటిస్‌లను గుర్తించారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్ వీటిలో ప్రధానమైనవి. ఆర్థరైటిస్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించటం, వ్యాధి సోకిన పక్షంలో చికిత్స ప్రారంభించి వ్యాధి ముదిరి వ్యక్తి కదలికను పూర్తిగా నిరోధించి రోజు వారీ జీవితాన్ని అతలాకుతలం చేయకుండా చూడటం లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తూ వచ్చారు. 'ఆర్థరైటిస్ వ్యాధి లక్షణాలను చాలా మంది వద్ధాప్యపు సమస్యలని తప్పుగా అర్థం చేసుకుంటన్నట్టు నిపుణులు గుర్తించారు. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్తులలో 65 ఏండ్లకుపై బడిన వారు ఎక్కువ సంఖ్యలో ఉండటం కూడా ఈ అపోహ విస్తత ప్రచారంలో ఉండటానికి కారణం అవుతున్నది. దాదాపు 30శాతం మంది 65 ఏండ్ల కంటే చిన్న వయస్సులోనే ఈ వ్యాధికి గురైనా ఆర్థరైటిస్ అని గుర్తించక తీవ్రంగా నష్టపోతున్నారు. వీరిలో కొందరు 20 ఏండ్ల కంటే తక్కువ వయస్సున్న యువతీ యువకులు కూడా ఉన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్‌ల నివారించే చికిత్సలేదు. చేయగలిగిందల్లా శరీరం బరువు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం వ్యాయామం, తగ్గించటం, వంటి చర్యలు తీసుకోవటమే. వీటికి తోడుకీళ్ల నొప్పులను అదుపుచేసేందుకు తోడ్పడగల కొన్ని మందులను సిపార్సుచేస్తాం." అని ఎల్బీ నగర్‌లోని కామినేని హాస్పిటల్స్ డాక్టర్ పి.ఎస్.జయ ప్రసాద్ చెప్పారు. "పలు సందర్భాలలో ఫిజియోథెరపీ కూడా మంచి ఫలితాలను ఇస్తున్నది. కీళ్ల కదలిక కష్టంగా ఉంటుంది. కానీ ఫిజియోథెరపీ నిపుణుల పర్యవేక్షణలో ప్రారంభించి కొనసాగించే కదలిక ఆర్థరైటిస్ నొప్పిని అదుపుచేయటానికి సాయపడుతుంది. ఆర్థరైటిస్ వెన్నెముక రుగ్మతలకు దారి తీస్తుంది. 80-85 శాతం వెన్నునొప్పి కేసులకు నిర్దిష్ట కారణం ఉండదు. యువకుల్లో వైకల్యానికి ప్రధాన కారణాల్లో వెన్ను నొప్పి ఒకటిగా నిలుస్తుంది" అని డాక్టర్ జయ ప్రసాద్ హెచ్చరిస్తున్నారు.

ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లు..రెసిడెన్షియల్ జోన్‌గా మార్పు



- 80 ఎకరాలు, 11కాలనీల ప్రజలకు విముక్తి,
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతోనే సమస్యకు పరిష్కారం : కార్పొరేటర్లు

నవతెలంగాణ- బడంగ్ పేట్

15 ఏండ్ల కాలంగా పలు కాలనీల ప్రజలు ఎదురు చూస్తున్న ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్ల సమస్యను పరిష్కరించి.. రెసిడెన్షియల్ జోన్‌గా మార్పు చేశారని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 24, 26వ డివిజన్ల కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, అర్జున్, పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రెసిడెన్షియల్ జోన్‌గా మార్పు చేసి 80 ఎకరాలలో నివాసం ఉన్న 11కాలనీల ప్రజల సమస్యను పరిష్కారం చేసిన ఘనత రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. హెచ్ఎండిఏ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించే సమయంలో 24వ డివిజన్ పరిధిలో సర్వే నెంబర్ 122, 123, 124, 129లో ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లుగా వదలి వేయటంతో అల్మాస్ గూడలోని న్యూ మారుతి నగర్ కాలనీ, ఎంఆంఆర్ కాలనీ, శ్రీ సాయి హెూమ్స్ కాలనీ, శ్రీ వేంకటేశ్వర కాలనీ, ఏ ఆర్ సీ ఆర్ కాలనీ, ఎస్ ఆర్ హిల్స్ కాలనీ, విశాఖ నగర్ కాలనీ, బడంగ్‌పేట్ లోని 30వ డివిజన్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 148,149లోని ఏ జీ ఆర్ కాలనీ, శ్రీ లక్ష్మి హిల్స్, రోమా ఫేస్ 2, సీతా మెడోస్ కాలనీలను వదలి వేశారన్నారు. ఆ కాలనీలలో ఇండ్లు, ప్లాట్లు కొనుగోలు చేసిన ఇండ్ల యజమానులకు పాత గ్రామ పంచాయతీ అనుమతితో ఇండ్ల నిర్మాణ పనులను చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఇండ్లకు బ్యాంకు రుణాలు ఇవ్వక పోవటమే కాకుండా మున్సిపల్ అధికారుల నుండి తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ స్పేస్, గ్రీన్ జోన్లను రెసిడెన్షియల్‌గా మార్పు చేయాలని కోరుతూ 2007 నుండి నేటి వరకు దాదాపు 15 ఏండ్లు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం పలు కాలనీల ప్రజలు గ్రీన్ జోన్ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి..అనేక సార్లు హెచ్ఎండిఏ అధికారులకు, కలెక్టర్, ఆర్‌డిఓ, తహసీల్దార్ కార్యాలయంలో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించినట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 5న ప్రభుత్వం నుండి జీఓ విడుదల చేయించి.. కాలనీవాసులకు విముక్తి కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ జోన్ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ ఏ.మోహన్, ఏజీఆర్ కాలనీ అధ్యక్షులు ప్రమోద్ కుమార్, వివిధ కాలనీల ప్రజలు రామ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణ సేవా సంఘం'
హైదరాబాద్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



నవతెలంగాణ- చైతన్యపురి

తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ ఆధ్వర్యంలో హైదరాబాదులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా మునిపల్లె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర మూర్తి, కోశాధికారిగా రఘునందన్‌లను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ జంట నగరాలలోని అన్ని అనుబంధ సంఘాలను కలుపుకొని త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమాఖ్య ద్వారా భవిష్యత్‌లో బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగు రాఘవరావు, శ్రీనివాస్, కరణం సుబ్బారావు, నందిరాజు లక్ష్మీనారాయణ, వెంకట్రాప్రగడ సుబ్బారావు, వైష్ణవి క్యాటరర్స్ ప్రసాద్, పంద్రంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు తాత్కాలిక వసతి కల్పిస్తాం

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

గుడిసె వాసులకు తాత్కాలిక వసతి కల్పిస్తాం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్ నగర్ నందు రేడియో స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన తడకలతో షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్న కొన్ని షెడ్లను ఆర్ అండ్ బి అధికారులు మంగళవారం తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తర్వాత ఆర్ అండ్ బి అధికారి ధర్మారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, ఇప్పటికే ప్రభుత్వంతో మాట్లాడినట్లు తెలిపారు. కొన్ని రోజులు గుడిసె వాసులకు అవకాశం ఇవ్వాలని, తర్వాత మరొక చోటికి తరలిస్తామని వివరించారు. దానికి అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఎమ్మెల్యే వెంట మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, గుడిసెవాసులు సమ్మయ్య తదితరులు ఉన్నారు.

బడంగ్‌పేట్
19వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా విజేందర్

నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా మిర్జాముల విజేందర్ కుమార్ (బిట్టు) నియమితులయ్యారు. మంగళవారం బీడీఎల్ కాలనీలో వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి నియామక పత్రం అందజేశారు. అనంతరం విజేందర్ మాట్లాడుతూ నూతన కమిటీ ప్రధాన కార్యదర్శి ఇరువెంటి శ్రీని



వాసచారి, ఉపాధ్యక్షులు యశ్వంత్, శక్తికేంద్రం ఇంచార్జి రామోజీ నాగ్ దీప్ చారి, కో ఇంచార్జి నరేందర్, బూత్ కమిటీ సభ్యులు కొండ శ్రవణ్, రుద్ర ఆనంద్, గట్టు నవీన్, తాళ్ల పవన్ కుమార్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా పల్సం శ్రీకాంత్ గౌడ్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ 'ఉద్యోగ, ఉపాధి' పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో మంగళవారం కళాశాల కెరీర్ గైడెన్స్ కాంపిటీటివ్ సెల్ ఆధ్వర్యంలో 'ఆన్‌లైన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ నేషనల్ కెరీర్ స్కీమ్ యంగ్ ప్రొఫెషనల్ కే.విజయ్ కుమార్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో ఇంటర్నెట్ ద్వారా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో, జాబ్ పోర్టల్‌లో ఏ విధంగా పేరు నమోదు చేసుకోవాలో, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఏ విధంగా వెతికి అప్లై చేసుకోవాలో, ఏ జాబ్స్ ఎక్కడ ఎన్ని ఉన్నాయో తెలుసుకోవాల్సిన సమగ్ర సమాచారం మొత్తం విద్యార్థులకు ప్రాక్టికల్ గా చూపించినట్లు తెలిపారు. ఆధునిక కాలంలో ఏ విధంగా సమాచారం వెతకాలో, ఉద్యోగ అన్వేషణ ఎలా చేయాలో కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె జోత్స్నప్రభ, కెరీర్ గైడెన్స్ కాంపిటీటివ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి శ్రీనివాసులు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సమావేశంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖి, డాక్టర్ జాహెదా బేగం, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ డివి రావు, అమరేందర్ రెడ్డి, ఆవేస్ మొయిద్దీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు'



నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30వ డివిజన్‌లోని ఏజీఆర్, రోమా 2, శ్రీలక్ష్మి కాలనీ ఓపెన్ స్పేస్ సమస్యను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పరిష్కరించారు. ఈ మేరకు మంగళవారం మంత్రి నివాసంలో కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. తర్వాత కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, కాలనీ సభ్యులు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌లో ఓపెన్ స్పేస్ ఉండడం వలన కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన్నట్లు తెలిపారు. కాలనీ ఓపెన్ స్పేస్ సమస్య దాదాపు 2008 మాస్టర్ ప్లాన్ తయారు చేసినప్పుడు అధికారులు సరైన సర్వే చేయకుండా మాస్టర్ ప్లాన్ లో ఓపెన్ స్పేస్ పెట్టడం జరిగిందన్నారు. 12 సంవత్సరాల నుండి సమస్య పరిష్కరించాలని అనేక సార్లు హెచ్ఎండీఏ అధికారులకు వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయిందని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన్నట్లు తెలిపారు. ఓపెన్ స్పేస్ తొలగించి రెసిడెన్షియల్ జోనుగా మార్చడానికి మంత్రి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నాయకులు సామ సుదర్శన్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు కే ప్రమోద్ కుమార్, నాయకులు రామ్మూర్తి, ఐలయ్య, పిసి రాములు, ప్రవీణ్, దిలీప్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్, తిరుమల రావు, యాదయ్య, రామకృష్ణ, రాజేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'రహదారి విస్తరణలో
నష్టపరిహారం చెల్లించాలి'



నవతెలంగాణ - హయత్‌నగర్

హయత్ నగర్ డివిజన్, మన్సూరాబాద్‌ల పరిధిలోని విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా రహదారి విస్తరణ పనుల్లో ఖాళీ స్థలాలు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న వారికి తగిన నష్ట పరిహారం అందించాలని కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు హయత్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్రాహీం ఆర్‌డీఓ అనంత రెడ్డికి మంగళవారం కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డిలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా పేదలకు అండా : మల్ రెడ్డి రంగారెడ్డి

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించిన దాదాపు 319 బూతులకు టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద అంబర్ పేటలోని ఓ కన్వెన్షన్ హాల్లో మంగళవారం బూత్ సాయి శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ బూత్ ఎన్ రోల్ ట్రెనింగ్ కమిటీ కన్వీనర్ పవన్ మల్లాదిలు హాజరై బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడానికి బూత్ కమిటీలే కీలక భూమిక పోషించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బూత్ స్థాయిలో పోల్ మేనేజ్ మెంట్, ప్రచార వ్యూహం, ఓటర్లతో కలయిక, పార్టీ పటిష్టత, సోషల్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తున్న ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటానన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్ఎస్ నాయకులు దొడ్డిదారిన గెలవాలని ప్రయత్నం చేస్తున్నారని..దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాల మేనిఫెస్టోను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత మన అందరీపై ఉందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. అందుకు కార్యకర్తలు సమయ స్ఫూర్తితో పార్టీ గెలుపు కోసం కష్టపడాలని కోరారు. అవినీతి బంధుప్రీతికి, భూ కబ్జాలకు కేరాఫ్‌గా ఉన్న బీఆర్ఎస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. త్వరలో నియోజకవర్గ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి.. అందరితో చర్చించి, ప్రతి కుటుంబాన్ని కలుస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల మున్సిపల్, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల బతుకమ్మ చీరలు పంపిణీ





నవతెలంగాణ - వనస్థలిపురం

బతుకమ్మ పండుగ సందర్భంగా బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బీఎస్‌రెడ్డి నగర్ ఆడిటోరియం, వైదేహి నగర్ సంక్షేమ సంఘం భవనం, విజయపురి కాలనీ ఫేస్ 1 సంక్షేమ సంఘం భవనం, సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాల, ఎన్జీవోస్ కాలనీ లైబ్రరీ గ్రౌండ్‌లో మంగళవారం కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారి శ్రీనివాస్ గౌడ్, బలరాం, ఏఈ రాకేష్, కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, విజయపురి కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు పవన్ రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

మహిళలు బతుకమ్మ పండుగను ఆనందోత్సావాలతో జరుపుకోవాలని కౌన్సిలర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ కోరారు. మంగళవారం ఉమర్ ఖాన్ గూడ, సాంఘి నగర్ గ్రామస్థులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిల్ కలెక్టర్ శీలం నరేష్, ఆశా వర్కర్లు కవాడపు మాధవి మల్లారెడ్డి, ఓనమాల భాగ్యమ్మ లక్ష్మారెడ్డి, మున్సిపల్ సిబ్బంది టోనీ, యాదగిరి, గడ్డం జయమ్మ, సత్తెమ్మ మహిళలు పాల్గొన్నారు.

'బాధితుడికి ఆర్థిక సాయం అందజేయాలి'

నవతెలంగాణ-హయత్ నగర్

షార్ట్ సర్క్యూట్‌తో నష్టపోయిన టైలరింగ్ షాప్ బాధితుడికి నష్టపరిహారం అందించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మన్సూరాబాద్ చౌరస్తాలో హనుమాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న మంగళ సుప్రీం టైలరింగ్ దుకాణంలో మంగళవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టైలరింగ్ సామాగ్రి, ఫర్నిచర్, విని యోగదారుల దుస్తువులు మొత్తం కాలిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడిని ఓదార్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ టైలరింగ్ షాపులో దాదాపుగా రూ.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.



ఇబ్రహీంపట్నం గడ్డపై నీలి జెండా ఎగురేస్తాం : బీఎస్పీ





నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

ఇబ్రహీంపట్నం గడ్డపై నీలి జెండా ఎగురేస్తామని బహుజన సమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జి గ్యార మల్లేష్ అన్నారు. నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ ఈసీ మెంబర్ గ్యార జగన్, జిల్లా ఇంచార్జి పల్నాటి రాములు, అసెంబ్లీ అధ్యక్షులు గ్యార మల్లేష్‌లు హాజరై ప్రసంగించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థిని గెలిపిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జరగబోయే ఎన్నికల్లో గడపగడపకూ బీఎస్పీ పార్టీని బలోపేతం చేసి ఇబ్రహీంపట్నం గడ్డ పై నీలి జెండాను ఎగురవేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీఎస్పీ ని ఆదరిస్తున్నారని అన్నారు. అనంతరం అబ్దుల్లాపూర్ మెట్ మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన కమిటీ అధ్యక్షులుగా చిత్ర కృష్ణ, ఉపాధ్యక్షుడిగా పచ్చల జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా బంగారు మైసయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం బీఎస్పీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ ఇంచార్జి గ్యార మల్లేష్ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు యంజాల ప్రహ్లాదు, నల్ల పరమేశ్, నరసింహ, వద్దిగళ్ల బాబు, మేతరి కుమార్, భూతం రమణ, జంతిక సైదులు, పట్నం రమేష్, పి. మురళి, బంగారి బాలకృష్ణ, కడారి సుధాకర్, యేసు, శ్రీహరి, బంటి, శివ, శివప్రసాద్, శివశంకర్, కందికంటి నవీన్, దొడ్ల ప్రేమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన సలోమి



నవతెలంగాణ-కాప్రా

డ్రాగన్ ఫిస్ట్ షాటోకాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పోటీలకు అండర్ 17 విభాగంలో సెయింట్ థెర్సి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కురునెల్లి సలోమి కరాటే గర్ల్స్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో సలోమికి జేకేఐ ప్రెసిడెంట్ అభినాష్, సెక్రెటరీ గ్రాండ్ మాస్టర్ సత్యశంకర్, సుమన్, మాస్టర్స్ దయాకర్, కన్నన్ గౌడ్, సురేష్, హేమంత్, గోపన్న, సైదులు అభినందనలు తెలిపి గోల్డ్ మెడల్ అందజేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అన్వేష్



నవతెలంగాణ-కాప్రా

ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంశీధర్‌రావు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర డాక్టర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కలుకూరి అన్వేష్ ,డాక్టర్ భానుచందర్, ఉదయ, వంశీరెడ్డిలు బీఆర్ఎస్‌లో చేరారు. వారితోపాటు పదిమంది డాక్టర్స్, 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షలంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కలుకూరి రాములు, మత్స్యశాఖ చైర్మెన్ వెంకటేశం, కుమార్ దుడ్డు భాస్కర్ తదితరు పాల్గొన్నారు

'కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలి'



- 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మకు శ్రీనివాస్

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోడుప్పల్ నగర అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బోడుప్పల్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బోడుప్పల్ కార్పొరేషన్ 19వ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బొమ్మకు శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా పోగుల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. యాభై రోజులు కాంగ్రెస్ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పార్టీ విజయం కోసం కష్టపడాలని కోరారు. బొమ్మకు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బోడుప్పల్ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బోడుప్పల్‌లో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా మార్చేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోటకూర అజయ్ యాదవ్, బొమ్మకు కల్యాణ్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పొన్నం తరుణ్ గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా, మహిళ కాంగ్రెస్ నేత ఆకుతోట గీతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకీర్ హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తోటకూర అశోక్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ గెలుపు ఖాయం : ఇందిరాగౌడ్



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ మహిళ నాయకురాలు ఇందిరాగౌడ్ అన్నారు. మంగళవారం కాప్రాలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నాగలక్ష్మి, ప్రకాష్, శ్రావణ్, స్వప్న, శ్రీమాన్, శేషా చర్యులు, ప్రవీణాచార్యులు, ప్రియదర్శిని, విద్యా తదితరులు పార్టీలో చేరారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా : బండారి



నవతెలంగాణ-కాప్రా

నియోజకవర్గంలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో టూ వీలర్ మెకానికులు, ఆటోమొబైల్ షాప్, డెంటింగ్, పెయింటింగ్ వర్క్స్, 3వేల మంది 8 అసోసియేషన్లను స్థాపించి ఉప్పల్‌లో సేవలు అందిస్తున్నామని, తమకు మీటింగ్ కోసం స్థలాన్ని కేటాయించాలని బండారి లక్ష్మారెడ్డికి విన్నవించారు. వారి సమస్యను విన్న బండారి లక్ష్మారెడ్డి ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అన్నివేళలా అందరికీ అందుబాటులో ఉంటానని ధైర్యం చెప్పారు. టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జనరల్ సెక్రెటరీ నరేందర్ యాదవ్, మహిపాల్ రెడ్డి, ప్రతాప్‌చారి, వైస్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, నరసింహ యాదవ్, జాయింట్ సెక్రెటరీ మహేందర్‌చారి, మహేష్, ప్రతాప్‌రెడ్డి, గణేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నాగరాజు, శివ, సంతోష్, టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుంది



- మంత్రి మల్లారెడ్డిని కించపరిచేలా మాట్లాడటం సరికాదు
- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించి హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి సహకారంతో ప్రభుత్వం నుండి కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశామన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ కౌన్సిలర్ పంబల్ల సరితారమేష్ మంత్రి మల్లారెడ్డిని కించపరిచే విధంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి నాగారం మున్సిపాలిటీకి ఎన్ని నిధులు ఇచ్చారని కౌన్సిలర్‌ను ప్రశ్నించారు. నాగారం నుండి రాంపల్లి , చెర్లపల్లి నుండి కరింగుడా వరకు రూ.209 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. టెండర్ పనులు పూర్తి కాక తాత్కాలికంగా ఆగిపోయిందన్నారు. మున్సిపాలిటీలో స్థానికులకు 10 శాతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ స్థానికులు హైకోర్టును ఆశయించగా స్థానికులకు ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు వచ్చాయని, లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్ కౌన్సిలర్లు ఎలిజాల నాగేష్ గౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, దివ్య దయాకర్, గండి అంజయ్య గౌడ్ , అరిగే రాములు వరకాల పెంటయ్య గౌడ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సాయినాథ్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, వామన్ నరేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించకుండా సహకరించాలి

- మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) ఉల్లంఘించకుండా జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నియమావళి, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు, నియమావళిని స్పష్టంగా వివరించారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఏ పనులూ చేపట్టకూడని, ఎన్నికల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై కలెక్టర్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బందం ఎల్లప్పుడూ పర్యటిస్తుందని, దీన్ని దష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు పలు సందేహాలను సమావేశంలో వ్యక్తం చేయగా వారి సందేహాలను కలెక్టర్ నివత్తి చేశారు. సీ విజిల్ యాప్‌ను వినియగించుకోవాలని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల వారు తమ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి డీఎంఅండ్‌హెచ్‌వోగా డాక్టర్ రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా సివిల్ సర్జన్ డాక్టర్ రఘునాథస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా జిల్లాలోని డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది, రిపోర్టింగ్ సూపర్‌వైజర్స్, ఎన్ఎచ్ఎం, బస్ ఆర్డినేట్ సిబ్బంది రఘునాథస్వామిని సన్మానించి సాదరంగా స్వాగతం పలికారు.

స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-ఉప్పల్

ఈనెల 13న రామంతపూర్‌లోని స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మెన్ ప్రాపర్టీ సురేష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 1270 పోస్టులను భర్తీ చేయనున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజు ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తామని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్ ఫోటోలు, తమ వెంట తీసుకుని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 040-27159979, 8886856465 నంబర్స్‌ను సంప్రదించాలని కోరారు. నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

పేదలకు అండగా నిలవాలి : మెట్టు వెంకన్న



నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదలను ఆదుకుని అండగా నిలవాలని బీఆర్ఎస్ 7వ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్న అన్నారు. కార్పొరేషన్‌లోని 7వ డివిజన్‌కు చెందిన ఎండీ కాబాభి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మెట్టు వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి మంగళవారం రూ. 5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబాజీ, భిక్షపతి, దామోదర్‌రెడ్డి, మాల కొండయ్య, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఉచిత వైద్య సేవలు



నవతెలంగాణ-మేడ్చల్

గుడ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ ఆస్పత్రి, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లు సంయుక్తంగా లేఖన చారిటబుల్ ట్రస్ట్ వారి ప్రేమ చిల్డ్రన్ హోమ్స్‌లోని అనాథ పిల్లలకు భోజన సౌకర్యంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అలీబెగ్ మాట్లాడుతూ.. పిల్లలకు కంటి, చర్మ, సాధారణ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉచిత వైద్య సేవలకు సహకరించిన ఆస్పత్రి చైర్మెన్ చామకూర గోపాల్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో అభినవ్, ఆస్పత్రి పీఆర్వో దుర్గా ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి మోపిదేవి, డాక్టర్ అనిల్, డాక్టర్ రామ్‌చరణ్, డాక్టర్ సంయుక్త, డాక్టర్ సౌజన్య, మార్కెటింగ్ టీమ్ మధు, రాజ్ నారాయణ, ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న గడ్డం సాయికిరణ్



నవతెలంగాణ-ఉప్పల్

బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులు గడ్డం సాయికిరణ్ మంగళవారం హబ్సిగూడ డివిజన్ వెంకటరెడ్డి నగర్ నుండి మొదలైన గడప గడపకూ ప్రజా దీవెన యాత్రను ప్రారంభించారు ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభు త్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మోదీ రాష్ట్రానికి అందించిన నిధులు, చేసిన పనులను కరపత్రం ద్వారా ప్రతీ ఇంటికి తెలియజేస్తూ రాబోయే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసే పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. కేసీఆర్ చెప్పిన బంగారు తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు అని ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. సామాజిక తెలంగాణ, అభివృద్ధి కేవలం మోదీ పాలనలోనే సాధ్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉప్పల్ నియోజక వర్గంలో కాషాయ జెండా ఎగిరేవరకు సైనికుడిగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాగి వెంకటరెడ్డి, పారుపల్లి హనుమంతరావు, పీసరి శంకర్, ఆవుల సుధాకర్, యండపల్లి సుదర్శన్ రెడ్డి, యాద ఉపేందర్, రఘు రెడ్డి, పి.అనిల్ గౌడ్, గడ్డం వెంకట్ సాయి, శివ గౌడ్, శివా రెడ్డి, రంజిత్ సింగ్, ఇమ్రాన్, చరణ్, నవీన్ రెడ్డి, అన్నం సాయి, పవన్ సంతోష్ పాల్గొన్నారు.

మ్యాక్సివిజన్ హాస్పిటల్‌లో రెండు బ్లాక్‌లు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ నేత్ర సంరక్షణ కేంద్రం మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ తన 40 బ్రాంచ్‌లలో సోమాజిగూడలోని సూపర్ టెరిటీయర్ ఐ కేర్ సెంటర్‌లో కొత్తగా రెండు బ్లాక్‌లను ప్రారంభించింది. ఈహెచ్ఎస్ ఫ్లోర్‌లో మూడు ప్రత్యేక సీహెచ్ఎస్ కన్సల్టెంట్ గదులు, రోగులకు శస్త్ర చికిత్సకు ముందు, శస్త్ర చికిత్స అనంతరం సంరక్షణ అవసరాలను 20 పడకలతో కూడిన ప్రత్యేక ఈహెచ్ఎస్ వార్డు, ఈహెచ్ఎస్ ఓటీ కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ హాజరై మాట్లాడారు. "మాక్సివిజన్ ఈహెచ్ఎస్ ఫ్లోర్ స్థాపన కంటి సంరక్షణలో విన్నూత్నత, శ్రేష్ఠత పట్ల వారి నిబద్ధతకు నిదర్శనం. ఈ కార్యక్రమం ఆరోగ్య సంరక్షణ ప్రమాణాన్ని పెంచడమే కాకుండా, కంటి సంరక్షణ అవసరమైన ఎంతో మందికి ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం దృష్టిని ప్రతిబింబిస్తుంది. దృష్టి దిద్దుబాటు శస్త్రచికిత్సల నాణ్యమైన అవుట్‌పుట్‌ని నిర్ధారించడానికి చాలా శ్రద్ధతో నిర్మించిన ఈ కొత్త కేంద్రంలో నగరంలోని పెద్ద సంఖ్యలో రోగులు ఆపరేషన్ చేయించుకోవాలని విశ్వసిస్తున్నాను" అని తెలిపారు. మాక్సివిజన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మెంటార్, కో-చైర్మెన్ డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ "పేషెంట్ ఫస్ట్" తాత్వికతను మ్యాక్సివిజన్ బలంగా నమ్ముతుంది, ఆచరిస్తుంది. టెక్నాలజీ పెట్టుబడులపై, మాక్సివిజన్ ఎల్లప్పుడూ ప్రపంచస్థాయి కంటి సంరక్షణ సాంకేతికతను తీసుకురావడంలో అగ్రగామిగా ఉంది." అని అన్నారు. మాక్సివిజన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ సీఈఓ సుధీర్ మాట్లాడుతూ "మాక్సివిజన్ సెంటర్‌లలో ఒకే విధమైన సాంకేతికతతో రోగులందరినీ సమానంగా చూడాలని కోరుకుంటోంది. మా నెట్‌వర్క్ మోడల్ హబ్ అండ్ స్పోక్‌గా ఉంటుంది. తెలంగాణలోని మారుమూల ప్రాంతాలకు కూడా అత్యుత్తమ సాంకేతికతతో కంటి సంరక్షణ మొత్తం శ్రేణి అవసరాలను తీర్చడానికి ఈ లక్ష్యంతో విస్తరణ జరుగుతోంది" అని తెలిపారు.

బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రచారం



నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు కోసం మాజీ కార్పొరేటర్ గంథం జోత్స్న నాగేశ్వరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ మార్కెట్ గల్లీ, శారదానగర్ నగర్‌లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంథం జోత్స్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ గౌడ్, ముస్తాక్, పాల్వాయి మధుసూదన్ రెడ్డి, సంపత్‌రావు, రాజు యాదవ్, సురంశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కొప్పు నర్సింగ్ రావు, బుస శంకర్, చాంద్ పాషా, బోసాని పవన్,శ్రీకాంత్ గౌడ్,ప్రశాంత్ గౌడ్,వెంపటి శ్రీను,మద్దురి శ్రీనివాస్, దయాకర్ తదితరులున్నారు.

పోలీసుల తనిఖీలో రూ.6 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-బోడుప్పల్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలంలో మేడిపల్లి పోలీసులు, ఎస్‌వోటి మల్కాజిగిరి పోలీసులు మంగళవారం సంయుక్తంగా వాహనాల తనిఖీ చేశారు. ఐటీసీ బస్టాప్ చెంగిచెర్ల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహీంద్రాహిల్స్ ఈస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్‌కు చెందిన మహమ్మద్ ఉమర్(50) వద్ద ఆధారాలు లేకుండా ఉన్న రూ.6,01,940 లక్షలు, బ్రీజా కారు, సెల్ ఫోన్, కార్ తాళం సీజ్ చేశారు. ఎలక్షన్ కోడ్ నిబంధనల ప్రకారం అధిక మొత్తంలో డబ్బు కలిగి ఉన్న వ్యక్తులు వాటికి సంబంధించిన ఆధారాలు కచ్చితంగా కలిగి ఉండాలని, లేనిపక్షంలో సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని సీఐ సైదులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పని చేయాలి

- కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి



నవతెలంగాణ-కీసర

యూత్ కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పని చేయాలని కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి అన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త శుశాంత్ గౌడ్, మేడ్చల్ యూత్ జనరల్ సెక్రెటరీ పొన్నం తరుణ్, తటాకం అభిలాష్, కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి ఆధ్వర్యంలో గోధుమ కుంట గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పుట్ట హరీష్‌గౌడ్, తిమ్మాయిపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రవికాంత్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోలా కృష్ణయాదవ్, గోధుమకుంట ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి, ప్రవీణ్‌కుమార్, గ్రామాధ్యక్షుడు చీర కుమార్, తిమ్మాయిపల్లి గ్రామాధ్య క్షుడు సురేష్, ఐల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరిపల్లి అధ్యక్షుడు హరిబాబు, వార్డ్ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం మేము సైతం..కొవ్వొత్తుల ప్రదర్శన



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజక వర్గం డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలో జమ్మిగడ్డ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాబు కోసం నేను సైతం కార్యక్రమంలో భాగంగా డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటికి రావాలని కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీరుకొండ సతీష్‌బాబు, రాములు యాదవ్, సాంభశివరావు, శివానంద, జనార్ధన్, ఆనంద్, బాలరాజు, వెంకటేశ్వరరావు, టింకు జగన్, మోహన్, రమణ, డీవీ రావు, సత్యనారాయణ, పోట్ల సతీష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 వరకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని మానసిక ఆరోగ్యం పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఆలిండియా ఫర్ విన్ జనరల్ సెక్రెటరీ రాజ్ ఆచార్య తెలిపారు. రెండు రోజులుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని , ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు.ఆసక్తి గలవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9059958271 ఫోన్ నెంబర్ కిగాని , వాట్సాప్ కానీ, ఎస్ఎంఎస్ కానీ, చేసినచో వారికి ఉచిత ప్రవేశం ఉంటుందని తెలిపారు. మానసిక సమస్య కారణాలైన ఒత్తిడి, చింత, భయం, కోపం నిద్రలేమి మొదలగు సమస్యలపై ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తామన్నారు.



జోనల్ కమిషనర్ వి.మమత ఎలక్ట్రికల్ వింగ్, ఇఇఎస్ఎల్ కాంట్రాక్టర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ముఖ్యమైన పనులను వెంటనే ప్రారంభించి, ఫిర్యాదులన్నింటినీ సరిచేయాలని సిబ్బందిని , కాంట్రాక్టర్లను ఆదేశించారు. నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 26,91,167 మంది ఓటర్లు, 2,397 పోలింగ్ కేంద్రాలు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



ఫైల్‌ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా అమలు చేయ డానికి జిల్లా యంత్రాంతం సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ అధికార యంత్రాంగాన్ని ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. ఓటర్ డ్రైవ్, ఓటు వినియోగం, నోడల్ అధికారులు, క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గాల్లో హెూర్డింగ్‌లు, కటౌట్లు తొలగించాలని ఆదేశాలు సైతం జారీ అయ్యాయి.

జిల్లాలో మొత్తం 5 నియోజకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లా అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలకు నోడల్ అధికారుల నియామకం పూర్తయింది. ఈవీఎంల మేనేజ్‌మెంట్, శాంతి భద్రతలు, బ్యాలెట్ సిబ్బంది, కమ్యూనికేషన్ ప్రణాళిక, శిక్షణ, సామాగ్రి, నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, రవాణా, పోస్టల్ బ్యాలెట్, ఓటరు అవగాహన వంటి పనులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియామాళిని తూచ తప్పకుండా అమలు చేసేం దుకు కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రస్తుతం మోడల్ కండక్ట్ ఆఫ్ కోడ్ అమలులో ఉన్నందున షెడ్యూల్ విడుదల అనంతరం మొదటి 72 గంటలను అతి ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.

వాల్ రైటింగ్, పోస్టర్ల తొలగింపు..

ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు, హెూర్డింగులు, బ్యానర్లు తదితరాలన్నీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల లోపు, అన్ని పబ్లిక్ స్థలాల్లో ఉన్న వాటిని 48 గంటల్లో, ప్రయివేటు స్థలాల్లో ఉన్న వాటిని 72 గంటల్లో తొలగించాల్సి ఉంటుంది. వెబ్‌సైట్‌లలో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగిస్తారు. ప్రభుత్వ వాహనాలను రాజకీయ అవసరాలకు వాడకూడదు. ప్రభుత్వ అతిథి గహాలు, హెలీప్యాడ్, ప్రభుత్వ మైదానాలు ఫస్ట్ కమ్ ఫస్ట్‌కి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి కొత్త శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి వీలుండదు. ప్రగతిలో ఉన్న పనులను మాత్రమే కొనసాగించాల్సి ఉంటుంది. ప్రగతిలో ఉన్న, ఇంకా ప్రారంభం కాని కొత్త పనుల జాబితాను సమర్పించాలని ఇప్పటికే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే అధికార యంత్రాంగం మోడల్ కోడ్ ఆఫ్ కండక్టుకు సంబంధించిన ప్రభుత్వ స్థలాల్లో వాల్‌రైటింగ్ 146, పోస్టర్స్ 1,658, బ్యానర్స్ 1,659, ఇతర చోట్లలో 97తో కలిసి మొత్తం 3,560 తొలగించినట్టు కలెక్టర్ ప్రకటించారు.

ఓటర్లు.. పోలింగ్ కేంద్రాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 2,397 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మేడ్చల్ 580, మల్కాజిగిరిలో 411, కుత్బుల్లాపూర్‌లో 582, కూకట్‌పల్లిలో 417, ఉప్పల్‌లో 402 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 3,06,854, మహిళలు 2,88,486, ట్రాన్స్ జెండర్స్ 42 ఉండగా, మొత్తంగా నియోజకవర్గంలో 5,95,382 మంది ఓటర్లు ఉన్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పురుషులు 2,36,804, మహిళా ఓటర్లు 2,32,009, ట్రాన్స్‌జెండర్లు 9 మందితో కలిపి మొత్తం 4,68,822 మంది ఓటర్లు ఉన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో పురుషులు 3,51,307, మహిళా ఓటర్లు 3,17,793 మంది, ట్రాన్స్‌జెండర్లు 153తో కలిపి మంది 6,69,253 మంది ఓటర్లు ఉన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పురుషులు 2,34,575, మహిళా ఓటర్లు 2,12,828, ట్రాన్స్‌జెండర్లు 120 మందితో కలిపి మొత్తం 4,47,527 మంది ఓటర్లు ఉన్నారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పురుషులు 2,65,493, మహిళా ఓటర్లు 2,44,657, ట్రాన్స్‌జెండర్లు 37తో కలిపి మొత్తం 5,10,187 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కలిపి పురుషులు 13,95,033, మహిళా ఓటర్లు 12,95,773, ట్రాన్స్ జెండర్లు 361 మంది ఉన్నారు. ఐదు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 26,91,167 మంది ఓటర్లు ఉన్నారు.

సీ-విజిల్ యాప్‌పై అవగాహన

జిల్లాలో కొత్త పనులు చేపట్టడం, ప్రకటించటం వంటివి చేయొద్దు. సీ- విజిల్ యాప్‌పై పర్యవేక్షణ చేస్తారు. టోల్ ఫ్రీ నెంబర్‌తో ఇప్పటికే కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యా సంస్థలు, విద్యార్థులు, యువతకు సీ-విజిల్ యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమయంలో ఎన్నికల విధులు అత్యంత కీలకంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఏ దశలోనూ అలసత్వం వహించినా మొత్తం ఎన్నికలపై ఎఫెక్ట్ అవకాశం ఉంటుంది. ఈ విషయంలో ఇప్పటికే జాగ్రత్తగా ఉండాలని కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయి. ఎన్నికల నిబంధనలను ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించేలా ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన రెండు సార్లు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాలని ప్రజలను కోరడంతోపాటు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

పలు సెక్షన్ల ప్రకారం చర్యలు..

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి పలు సెక్షన్లు అమల్లోకి రానున్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 171 (బి) ప్రకారం డబ్బులు ఇవ్వడం, తీసుకోవడం నేరంగా పరిగణిస్తారు. 171 (సి) ప్రకారం ఓటర్లను బెదిరించడం నేరగా భావిస్తారు. సెక్షన్ 171 (ఏ) ప్రకారం ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ముద్రించే ప్రింటింగ్ సంస్థలు తప్పకుండా వాటిపై ప్రింటర్ పేరు, పబ్లిషర్ పేరు, మొబైల్ నెంబర్లను విధిగా ప్రచురించాల్సి ఉంటుంది. లేకపోతే బాధ్యులపై ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు.

ఎన్నికల ప్రవర్తనా నియమాళిని అమలు చేయాలి



జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిన తప్పకుం డా అమలు చేయాలి. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో కోడ్ అమలులో ఉంటుంది. సీ-విజిల్ యాప్‌పై యువతకు మరింత అవగాహన కల్పించాలి. జిల్లా వ్యాప్తంగా నోడ్ అఫీసర్లతోపాటు ఇతర అధికారులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– అమోయ్ కుమార్,
కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదు



- మంత్రి మల్లారెడ్డి నోటిని అదుపులో పెట్టుకోవాలి
- కేసీఆర్ కుటుంబ పాలనకు చరమ గీతం పడాలి
- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-మల్కాజిగిరి

గడిచిన తొమ్మిది సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేరలేదని, మంత్రి మల్లారెడ్డి నోటీని అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 నియోజకవర్గాల్లో 4.50 లక్షల మంది పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే కేవలం 20 వేల మందికి మాత్రమే ఇండ్లు మంజూరు చేశారని అన్నారు. దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు వంటి పథకాలు గాలికి వదిలేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, అందుకు ప్రతీ కార్యకర్త సైనికునివలే పనిచేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీని, రాష్ట్రంలోని బీఆర్ఎస్‌ను ఓడించేందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. మల్కాజిగిరి పరిధిలోని కాంగ్రెస్ పార్టీ 6 డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని, చేతి గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో జీఎస్‌వీ సతీష్ కుమార్,పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జీవన్ రెడ్డి, బీకే శ్రీనివాస్, ఉమేష్ సింగ్, జీడీ సంపత్ గౌడ్,వంజా శ్రీనివాస్ యాదవ్,సంతోష్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

పదో రోజుకు చేరుకున్న కాంట్రాక్టర్ల నిరసనలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పెండింగ్‌లో ఉన్న బకాయిలు మొత్తం చెల్లించాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలు సోమవారం పదో రోజుకు చేరుకున్నాయి. తొమ్మిది నెలలుగా పెండింగ్ లో ఉన్న బకాయిలు చెల్లించడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని, జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ముందు జీహెచ్ఎంసీ సివిల్ కాంట్రాక్టర్లు ధర్నాకు దిగారు. నో పేమెంట్, నో వర్క్స్ అని రాసి ఉన్న ప్ల కార్డులను పట్టుకొని ధర్నా నిర్వహించారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కాంట్రా క్టర్స్ అంతా ఎలాంటి పనులు చేయకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి మూసాపేట్ సర్కిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ చెల్లించ కుండా సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు కాంట్రాక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తద్వారా వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది కాంట్రాక్టర్స్ అంతా దిగువ మధ్యతరగతికి చెందిన వారు కావడంతో, వారు పూర్తి చేసిన పనులకు సకాలంలో అధికారులు బిల్లులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా మానసికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో జనవరి 2023 నుండి నేటి వరకు సుమారుగా రూ. 1000 కోట్ల బకాయిలు పెండింగులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బకాయిలన్నీ చెల్లిస్తేనే పనులన్నీ తిరిగి కొనసాగిస్తామని, లేనిపక్షంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న యూనియన్లు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాకు కూకట్ పల్లి కాంట్రాక్టర్లు అంతా అధిక సంఖ్యలో తరలివెళ్లి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత కు పలుమార్లు వినతి పత్రం అందజేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మురారి, జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ సింగ్, కార్యవర్గ సభ్యులు, శంకర్, గిరిబాబు, ఐలయ్య, మల్లేశం, లక్ష్మీకాంత్ గణేష్ శివ ,సాయి బాబా, కుమార్ నాయక్, ప్రసాద్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ అడ్డా కూలీల ఆత్మగౌరాన్ని నిలిపిన ఎమ్మెల్యే



- హమాలీ అడ్డా కూలీలు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో హమాలీ అడ్డా కూలీల "హమాలీ భవన" నిర్మాణానికి జీడిమెట్ల పారిశ్రామిక వాడలో స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతగా హమాలీ సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను వారి నివాసం వద్ద కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ నాయకుడు ఏ ప్రభుత్వం పట్టించుకోని తమ హమాలీ అడ్డా కూలీల సమస్యలను ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. దాంతో వారు వెంటనే అసెంబ్లీ సమావేశాలలో పలుమార్లు సమస్యలను ప్రస్తావించి ముఖ్య మంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారని, వారు చేసిన కృషి వల్లే ఈ రోజు సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. అడ్డా కూలీల ఆత్మగౌరవాన్ని నిలిపే విధంగా భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషిచేసి, అలాగే వారు తమకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వారి వెంటే నడుస్తూ వివేకానంద్‌ను భారీ మెజారిటీతో నియోజకవర్గ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద పారిశ్రామిక వాడైనా జీడిమెట్ల పారిశ్రామిక వాడలో దశాబ్దాలుగా వందల మంది హమాలీ అడ్డా కూలీలు జీవనోపాధి కొనసాగిస్తున్నారని, కానీ వారికి సరైన భవనం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి తీసుకురాగా, వారి సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సహకారంతో పారిశ్రామిక వాడాలో హమాలీ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించామని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలనే ఆశయంతో వారికీ సంక్షేమ సంఘాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనిస్తోందని చెప్పారు. తొమ్మిదన్నర ఏండ్ల పాలనలో ఎన్నడూ జరగని సంక్షేమాభివద్ధిని ఇప్పుడు మనం కండ్లారా చూసున్నామని తెలిపారు. అలాగే రానున్న రోజులలో ఈ భవనంలో వంట శాల, భోజన శాల, విశ్రాంతి గదులు, సమావేశ హాలు మొదలైన సకల సదుపాయాలతో విశాలమైన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ యూసూఫ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు కీలుకాని లక్ష్మణ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ నాయకులు అంజయ్య, ఏఐటీయూసీ నాయకులు స్వామి, శ్రీనివాస్, శేఖర్, అశోక్ రెడ్డి, సీఐటీయూ హమాలీ సంఘం నాయకులు దేవదానం, బీరప్ప, తిమ్మప్ప, సునీల్, ఆంజనేయులు మరియు సభ్యులు పాల్గొన్నారు..



కె.పి.వివేకానంద్‌కు కాలనీల సంక్షేమ సభ్యుల మద్దతు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ కాలనీ, బస్తీలకు చెందిన సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే కె .పి.వివేకానంద్‌ను వారి నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించడానికి తాము తోడుగా ఉంటామని, తమ కాలనీ వాసుల మద్దతు ఉంటుందని తెలియజేశారు. అనంతరం వివిధ శుభకార్యాలకు రావలసిందిగా నాయకులు, వివిధ సంక్షేమసంఘ నాయకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-నేరేడ్ మెట్

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలో వచ్చిన వెంటనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామనిఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని పంజాబీ కమ్యూనిటీ హాల్లో కాంగ్రెస్ వాదుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నిమ్మ అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజమైన కాంగ్రెస్ వాదులు సమైక్యమై వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీని అధిక మెజారిటీ తో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకు లు రాజ్ జితేంద్రనాథ్, కష్ణ గౌడ్, బాల పీర్ సంతోష్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, ఉదయ్, రాజ సింహా రెడ్డి, నాగేశ్వరరావు, శివ కుమార్, వీనస్ మేరీ, పద్మ, జ్యోతి, శకుంతల నాయుడు, కామాక్షి తదితరులు పాల్గొన్నారు



భూగర్భ డ్రయినేజీ పనులను పరిశీలించిన భరత సింహారెడ్డి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రయినేజీ పనులను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి గ్రామ వాసులతో కలిసి పరిశీలించారు. యూజీడీ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతీ గల్లీలో భూగర్భ డ్రయినేజీ వ్యవస్థను, సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. జీడిమెట్ల డివిజన్ ను అందరి సహకారంతో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో నార్లకంటి నర్సింహా, నార్లకంటి ప్రతాప్, శేఖర్, నందు గౌడ్,సందీప్ గౌడ్, మహేష్ గౌడ్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద యాత్రకు అనూహ్య స్పందన

నవతెలంగాణ-కూకట్‌పల్లి



శేరిలింగంపల్లి నియోజకవర్గం 109వ డివిజన్ పరిధిలోని, హఫీజ్‌పేట్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, మొవ్వ సత్యనారాయణలు ప్రజా సమస్యలపై నిర్వహించే ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమం, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ, గంగారం హుడా కేఫ్ వద్ద నుంచి శాంతి నగర్,పీజేఆర్ స్టేడియం, సుభాష్ నగర్ హుడా కాలనీ వరకు నిర్వహించారు. సమస్యలు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు.మహేష్ యాదవ్ ,రవి గౌడ్,కోటేశ్వర రావు, పథ్వి కాంత్ గౌడ్,వరప్రసాద్,బాబు రెడ్డి,జితేందర్, శోభా దుబే, పార్వతి, రమ ఐయ్య, మెదక్ మహేష్ బాబు, రామచంద్రుడు, నరసింహ అరుణకుమారి, జగన్,జగదీశ్వర్ గౌడ్, రామా రావు ,జానీ బాబు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధికి చెందిన సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, 128 చింతల్ డివిజన్ పరిధికి చెందిన సీనియర్ నాయకులు బసవరాజ్, 125 గాజులరామారం డివిజన్ పరిధికి చెందిన సీనియర్ నాయకులు సాయిబాబాల జన్మదినం సందర్భంగా వారు మంగళవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను వారి నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులూ తదితరులు పాల్గొన్నారు.

బాబు గౌడ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధికి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, అంజయ్య నగర్ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మెన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాబు గౌడ్ జన్మదిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ను వారి నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబు గౌడ్‌కు ఎమ్మెల్యే బొకే అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట : జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీ మల్లికార్జున దేవాలయం (అంజయ్య నగర్) చైర్మెన్ ,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బాబుగౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ లోని ఆయన నివాసం వద్ద ఘనంగా జరుపుకున్నారు .కుటుంబ సభ్యు లు, బీఆర్ఎస్ శ్రేణులు, పలు రాజకీయ పార్టీల నాయ కులు హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



అధికారిణిపై చర్యలు తీసుకోవాలి

- కార్పొరేటర్ కొలుకుల జగన్
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లేఖ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కంచె చేను వేసిన చందంగా ప్రభుత్వ అధికారుల తీరుందని, ఇండ్లనిర్మాణదారుల నుంచి ప్రభుత్వ అధికారులు పర్మిషన్‌ల పేరుతో లక్షల రూపాయలు అక్రమంగా వసూళ్లు చేయడంతో పాటు సోషల్ మీడియా విలేకరులతో కుమ్మక్కై ఆడిందే ఆటగా పాడిందే పాటగా పైసా పైసా కూడబెట్టుకుంటున్నారని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ వార్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారిణి ఐదుగురు సోషల్ మీడియా విలేకరులతో కలిసి జగద్గిరిగుట్ట ప్రాంతంలోని చర్చి లైన్ లో ఓ నిర్మాణదారుడి వద్ద ఏకంగా రూ. 1,80,000 పైగా డిమాండ్ చేశారని బాధితులు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో ఫోన్‌లో బోరున విలపిస్తూ తెలిపారు. దీంతో స్పందించిన ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పేషీ కార్యాలయానికి లేఖ పంపారు. అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న అధికారిణిపై శాఖపరమైన చర్యలతో పాటు సదరు సోషల్ మీడియా విలేకరులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫోటోగ్రఫీ వర్క్ షాప్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మ గూడ లోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ వర్క్ షాప్ 3.0ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీరేంద్ర అధికారి సింగ్ పాల్గొని ఫోటోగ్రఫీలో శిక్షణకు సంబంధించిన విషయాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల సెక్రటరీ టి వి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోనే అంతర్గత నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి వర్క్ షాప్‌లు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డా కె శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులలోని నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇలాంటి వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా కాలేజీలో ప్రకతికి సంబంధించిన, అందమైన ఫోటోలను తీసి వాటిని ప్రదర్శించిన వారికి బహుమతులు ఇస్తామని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని ఫోటోగ్రఫీ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ వర్క్ షాప్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి , పీఆర్‌ఓ రవి సుధాకర్, ఏట డా.హరిప్రసాద్ రెడ్డి,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈగల తిరుపతిరావు జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలి

- అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వతనగర్‌కు చెందిన కార్యకర్త ఈగల ప్రసాద్ రావు కుమారుడు ఈగల తిరుపతిరావు పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్ డిస్ట్రిక్ లెవెల్ లో గోల్డ్ మెడల్స్ సాధించిన సందర్భంగా మంగళవారం పర్వత్ నగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్ పాల్గొని ఈగల తిరుపతి రావును, తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంటూరి రేఖ లను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈగల తిరుపతిరావు జాతీయ స్థాయిలో వెళ్తున్న సందర్భంగా మరెన్నో పతాకాలు, గోల్డ్ మెడల్స్ సాధించి రావాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, పర్వత్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహేద్ షరీఫ్ బాబా, రాజారావు, వంశీ ప్రసాద్, సంజీవరెడ్డి, సుంకన్న, శ్రీనివాస్ యాదవ్, యోగి రాజు, వెంకటమ్మ, రేవతి, చిట్టెమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి యువత గొప్ప సంపద : గవర్నర్



నవతెలంగాణ-ఓయూ

దేశంలో అధిక సంఖ్యలో యూత్ ఉన్నారని వారే దేశానికి సంపద అని రాష్ట్ర గవర్నర్ డా.తమిలిసై సౌందరరాజన్ అన్నారు. మంగళవారం రాత్రి ఓయూ దూరవిద్య కేంద్రంలో ఓయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సిటిజన్ యూత్ పార్లమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు మనకు అంటూ స్వయంసంవృద్ధితో ఎదగాలని సూచించారు. అనంతరం యూత్ పార్లమెంట్ లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ,డైరెక్టర్ ప్రొ.జీబి రెడ్డి, రఘుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ జాస్తి రవికుమార్‌కు సన్మానం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజ్ సికింద్రాబాద్ ప్రిన్సిపాల్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జాస్తి రవికుమార్‌ను పలువురు విద్యార్థులు, అధ్యాపకులు సత్కరించారు. గతంలో అడిషనల్ కంట్రోలర్ ఎగ్జాం బ్రాంచ్, జాయింట్ డైరెక్టర్, యూఎఫ్ఆర్ఓ డైరెక్టర్ గా దూరవిద్య కేంద్రం జాయింట్ డైరెక్టర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు కో ఆర్డినేటర్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్శిటీ డిస్ట్రిక్ట్ పీజీ కళాశాలల డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.మృదులా లక్కరాజు,డా. పూర్ణచందర్, శ్రీనివాస్, డా. రామేశ్వర్, డా. దుర్గాప్రసాద్, సతీష్, రాజు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ
సాధనకు విద్యార్థి సంఘం ఏర్పాటు



నవతెలంగాణ-ఓయూ

మాన్యశ్రీ కాన్షీరామ్ 17వ వర్ధంతి సందర్భంగా సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి నాయకుడు తాళ్ల అజయ్ ఆధ్వర్యంలో సామాజిక తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొ. ముత్తయ్య, ప్రొ. చంద్రునాయక్, ప్రొ. ప్రభంజన్ యాదవ్ పాల్గొని కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొ. ముత్తయ్య మాట్లాడుతూ.. సమాజం బుద్ధుని మహా సమతా సూత్రం ఆధారంగా ఆలోచించాలన్నారు. రాజ్యాంగ విలువలు పాటిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రాజ్యాధికారం కోసం అందరూ కలిసి ఐక్యత చాటాలన్నారు. హెడ్ ప్రొ. చంద్రునాయక్ మాట్లాడుతూ.. జీవితంలో కాన్షీరామ్‌తో ఉద్యమ పరంగా కలవడం మంచి అనుభూతి అన్నారు. ఆయన ఆలోచన కొనసాగింపుగా రాజ్యాధికారం కోసం కృషి చేయాలన్నారు. ప్రొ. ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ. భారతదేశ సమస్య బీసీల సమస్యలు అని కాన్షిరామ్ చెప్పిన విధంగా నేటికీ కూడా బీసీలు తమ సమస్యగా అనుకోవడంలేదని చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధనకై ఎస్సీలు కూడా ముందుకు రావాలన్నారు. సభాధ్యక్షుడు తాళ్ల అజయ్ మాట్లాడుతూ.. వ్యక్తుల కోసం వ్యవస్థను విడగొట్టి లబ్ది పొందాలనుకుంటే వ్యక్తుల రాజ్యమే వస్తుందని తెలియజేస్తూ ఎస్సి, ఎస్టీ, బీసీల రాజ్యం రాదని, సామా జిక తెలంగాణ కోసం సబ్బండ జాతులు కదలాలి. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమ వీరులు అందరూ సామాజిక తెలంగాణ కోసం తమ వాదన వినిపించాలని కోరారు. అందులో భాగంగానే సామాజిక తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఏర్పాటును ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కంచర్ల బద్రి, పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్, సుమంత్, రవి నాయక్, సత్యనెల్లి ,మేడ శ్రీనివాస్, ఉదయ్, కొత్తపల్లి బాలు, యుగంధర్, రుక్మత్ పాషా, సమావేశ నిర్వాహకులు మోరే ప్రభాకర్, ముదిగొండ రాజు, అంజి, కోటి పాల్గొన్నారు.

అభ్యర్థులను ఖరారు చేయని పార్టీలో
ఆశావహుల ఆందోళనలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎన్నికల షెడ్యూల్ ఖరారు అయినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ పార్టీల అధిష్టాన వర్గం ఇప్పటికీ అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో కంటోన్మెంట్ ప్రాంతంలో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఇరు పార్టీలలో ఎన్నికల్లో పోటీ చేయాలని ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లు కొందరైతే మరికొందరు ఇతర పార్టీల నుంచి వలస వచ్చి కూడా ఈసారి టికెట్ ఆశిస్తున్నారు. దీంతో పార్టీలలో టికెట్ ఆశించిన వారి సంఖ్య భారీగానే ఉంది. కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ చైర్మెన్ జీవకన్ మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన పిడమర్తి రవి ఇంకా ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న సీనియర్ నాయకుడు దేవేందర్, మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, బొల్లు కిషన్ కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రజా గాయకుడు గద్దర్ ఫ్యామిలీలో ఒకరికి టికెట్ ఇవ్వాలని చూస్తున్నట్టు చాలా కాలంగా గద్దర్ ఫ్యామిలీతో టచ్‌లో ఉన్న ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గద్దర్ కుమార్తె వెన్నెలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్, రిజర్వుడు స్థానం నుంచి బరిలో నిలబెట్టాలనుకుంటున్నది. అయితే ఏఐసీసీ వెలువరించనున్న తొలి జాబితాలోనే ఆమె పేరును పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మధుయాష్కీ స్వయంగా ఇటీవల గద్దర్ నివాసానికి వెళ్లి వెన్నెలకు తెలియజేసినట్లు తెలిసింది. అంతేకాకుండా గద్దర్ భార్య విమల, కుమారుడు సూర్యంతోనూ ఈ విషయాన్ని చెప్పినట్లు సమాచారం. గద్దర్ ఫ్యామిలీలో టికెట్ ఎవరికి ఇవ్వాలనేదానిపై రాష్ట్రస్థాయి నేతలు ఇటీవల రహస్యంగా చర్చించుకున్నారు. కుమారుడు సూర్యానికి టికెట్ ఇవ్వడంకంటే కుమార్తె వెన్నెలకు ఇవ్వడమే బెటర్ అనే అభిప్రాయంతో ఉన్నారు. ఇదిలా ఉంటే బీజేపీ నుండి కూడా పలువురు ఆశావహులు ఉన్నారు. సీనియర్ నాయకురాలు రజిని రెడ్డి కంటోన్మెంట్ బోర్డు లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఎప్పటి నుంచో బీజేపీ నుండి టికెట్ ఆశిస్తున్నారు. అలాగే మాజీ మంత్రి శంకర్రావు కుమార్తె సుష్మితతో పాటు ఇంకా పలువురు కంటోన్మెంట్ బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ అధిష్టానం ఇప్పటివరకు ఎవరి పేరు ప్రస్తావించటం లేదు. ఇదిలా ఉంటే అందరికంటే ముందు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సాయి అన్న కుమార్తె అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆ పార్టీలో నాయకులు ఇంకా ఆమెకు పూర్తిగా సహకరించటమేనని తెలుస్తోంది. అంతేకాకుండా మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి ఇవ్వడంతో దాదాపు కంటోన్మెంట్ మాజీ సభ్యులు నాయకులు అంతా మల్కాజిగిరిలో మల్లారెడ్డి కి పని చేసే దిశలో ఉన్నారు. సీనియర్ నాయకులు చాలా తక్కువ ఉండటం అయినప్పటికీ ఉన్న కార్యకర్తలతో ఆమె రోజుకో ప్రాంతంలో పాదయాత్రలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ప్రస్తుతానికి బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత ముందంజలో ఉన్నారు. కాగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలో దింపితే లాస్య నందితకు చుక్కలుదురే అవకాశాలు లేకపోలేదు. బీఆర్ఎస్‌లో ఇంకా సీనియర్ నాయకులు గజ్జల నాగేష్, క్రిశాంక్, శ్రీ గణేష్ లాంటి నాయకులు కూడా టికెట్ ఆశించి నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం సాయన్న కుమార్తెల లాస్య నందితనే ఏకగ్రీవంగా అభ్యర్థి గా ప్రకటించారు. అప్పటి నుండి సీనియర్ నాయకులు మాత్రం కనుమరుగయ్యారు లాషా నందిత తన తండ్రి చేసిన అభివృద్ధి పనులను ప్రజలను చెబుతూ ప్రచారం చేస్తున్నారు.

మద్యం సేవించి పోలీసులకు
చుక్కలు చూపించిన యువతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయినపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో సోమవారం ఓ యువతి మద్యం సేవించి కారునడపడమే కాకుండా అతివేగంగా కారు నడిపి ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపించింది. జేబీఎస్ మార్గంలో ఇన్నోవా కారు అతివేగంతో రావడం అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది గమనించారు. కారు ఆపాలని సూచించినప్పటికి డ్రైవింగ్ సీటులో ఉన్న యువతి కారు ఆపకుండా ఇతర వాహనాలను ఢీ కొడుతూ అలాగే దూసుకుపోయింది. దీంతో ట్రాఫిక్ సిబ్బంది ఆమె కారును వెంబడించగా చివరికి బోయినపల్లి సెంటర్ పాయింట్ చౌరస్తాలో పట్టుకున్నారు. అక్కడ ఆమెతో పాటు కారులో ఉన్న ఇద్దరు యువకులు అక్కడి నుంచి పారిపోగా ఆమె మద్యం మత్తులో ఊగుతుండడం చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఆమెకు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయడానికి ప్రయత్నించగా ఆమె అందుకు సహకరించకపోగా, పోలీసులను నానా దుర్భాషలాడింది. చివరికి విషయం తెలుసుకున్న ఆమె స్నేహితుడైన ఓ వ్యక్తి వచ్చి ఆమెను సముదాయించే ప్రయత్నం చేశాడు. యువతి అల్వాల్‌కు చెందిన శెహనాజ్ అనే యువతి అని ఈవెంట్ ఆర్గనైజర్ వ్యాపారిగా తెలిపాడు. చివరికి బ్రీత్ ఎనలైజర్‌కు ఒప్పుకుంటే వదిలేస్తామని చెప్పడంతో చివరికి ఒప్పుకున్న యువతి ఊదగా దాదాపు 427 పాయింట్లు రావడంతో పోలీసులు ఒక్కసారిగా ఆశ్చర్యంలో మునిగి ఆమెపై డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.



బంజారాహిల్స్‌లో భారీగా నగదు పట్టివేత



నవతెలంగాణ-బంజారాహిల్స్

కియా వాహనంలో తరలిస్తున్న రూ.3 కోట్ల 35 లక్షల నగదును నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. చింపిరెడ్డి హనుమంతారెడ్డి, బచ్చల ప్రభాకర్, మండల శ్రీరాములురెడ్డి, మండల ఉదయ్ కుమార్‌రెడ్డిలు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 మీదుగా తమ కియా (టీఎస్ 09జీబీ4488)నెంబర్ గల వాహనంలో (3కోట్ల 35 లక్షల) నగదును తీసుకువెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్ ఐపీఎస్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును న్యాయస్థానానికి అప్పగిస్తామని తెలిపారు. నగదు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ అధికారులు బంజారా హిల్స్ ఏసిపి సుబ్బయ్య,ఇన్స్పెక్టర్ సతీశ్, సైదులు,తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో రూ. 89,500 నగదు సీజ్

శామీర్‌పేట :

ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో సైబరాబాద్ పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నారు. కాగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి మూడు చింతలపల్లి మండల కేంద్రం నుండి యాదాద్రి భువనగిరి జిల్లా వైపు వెళ్లే ప్యారారం చౌరస్తాలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. మంగళవారం పోలీస్ స్టేషన్ సిబ్బంది లింగాపూర్ తండాలోని అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహీంద్రా ఎక్స్‌యూవీ 700 కారు (టీ ఎస్ 08 జెఎల్ 2233) ఆపి పరిశీలించగా అందులో రూ.89,500 డబ్బుఉంది. ఆ డబ్బు ఆధారాలు డ్రైవరు వద్ద లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా



- ఎమ్మెల్యే గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పర్యటించి అపార్ట్మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిష్కరి స్తానని అపార్ట్మెంట్ వాసులకు హామీ ఇచ్చారు. మంగళవారం సీఆర్ కాలనీ నవోదయ కాలనీలో పర్యటించారు. జాయింట్ యాక్షన్ టీం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. వీధి దీపాలు, సీసీటీవీ కెమెరాలు ,ఫుట్పాత్ వ్యాపారాలు, రోడ్డు ఆక్రమణలపై జాయింట్ ఆక్షన్ టీం ఎమ్మెల్యేకి వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. శాంతి భద్రతలకు విగాథం కలిగించే వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు తెలిపారు. ఈ కార్యక్రమం లో గణపతి కాంప్లెక్స్ సంక్షేమ సమితి నిర్వాహకులు సంపత్ కుమార్, వేణు, అప్సర పాల్గొన్నారు.

119 నియోజకవర్గాలలో
ఆలిండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీ పోటీ



- పార్టీ కోర్ కమిటీ హెడ్ వరప్రసాద్

నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళా సాధికారతే లక్ష్యంగా హీరా గ్రూప్ అధినేత నౌహీరా షేక్ స్థాపించిన పార్టీ ఆలిండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీ అని ఆ పార్టీ కోర్ కమిటీ హెడ్ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ.... 2017లో నౌహీరా షేక్ స్థాపించిన పార్టీ కర్ణాటకలో గత ఎన్నికలలో 224 నియోజకవర్గాల లో పోటీ చేసి అత్యధిక ఓట్ల శాతాన్ని సాధించిందని, మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లను గెలుచుకుందని, అదే స్ఫూర్తితో రానున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో 119 నియోజకవర్గాల లో మహిళా ఎంపవర్మెంట్ పార్టీ పోటీ చేస్తుందని, తమ అధినేత్రిని ఎన్నో అవమానాలకు గురిచేసినా ఆకలినైనా భరిస్తాం అవమానాన్ని సహించం అన్న నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. రానున్న తెలంగాణ ఎన్నికలలో మహిళలకు, యువతకు, రైతులకు,నిరుద్యోగులకు పెద్ద పీఠ వేసి పార్టీ అభ్యర్థులుగా నిలబెడతామన్నారు.మహిళలకు 50 శాతం, తెలంగాణ ఉద్యమ కారులకు 20 శాతం, ఎస్ సి, ఎస్టి, మైనార్టీ మేధావులకు 20 శాతం, నిరుద్యోగులకు 20 శాతం సీట్లు కేటాయిస్తా మన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతు భీమాను అరవై సంవత్సరాలకు పరిమితం చేయకుం డా రైతు జీవిత కాలం వరకు వర్తింపజేస్తామ న్నారు.ఉచిత విద్యుత్ ను రాష్ట్ర వ్యాప్తంగా అందరికి ఇస్తామన్నారు.తదుపరి సమావేశంలో తమ పూర్తి మేనిఫెస్టో ను ప్రకటిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ మాస్క్, పార్టీ న్యాయ సలహాదారుడు ఆర్ మాధవ రావు,డాక్టర్ మీనాక్షి పద్మనాభం, తార, న్యాయవాదులు దీపా నాగ మంజరి, పూజ శారద తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యవంతులైన వైద్యులను తీర్చిదిద్దడమే లక్ష్యం



- గోమెల్ స్టేట్ యూనివర్సిటీ వైస్ డీన్ గ్రిగోరి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నైపుణ్యం కలిగిన వైద్యులను ప్రపంచానికి అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు బెలారస్‌కు చెందిన గోమెల్ స్టేట్ మెడికల్ యూని వర్సిటీ వైస్ డీన్ డాక్టర్ గ్రిగోరీ తెలిపారు. మంగళ వారం సోమాజిగూడలోని కత్రియా హెూటల్ లో మెడికో అబ్రాడ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి హాజరై సంస్థ బ్రోచర్ ను మెడికో అబ్రాడ్ మేనేజింగ్ పార్ట్నర్ రాజారాం, డైరెక్టర్ సంగీతాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓవైపు వ్యాధుల ముప్పు పెరుగుతుం డగా తగినంత మంది వైద్యులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ నేప థ్యంలో తక్కువ ఖర్చులో పూర్తి ప్రభుత్వ నిర్వాహం లో ఉన్న మెడికల్ యూనివర్సిటీలో ఇక్కడి విద్యార్థు లకు అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. మనదేశంలో నిర్వహిస్తున్న నీట్ అర్హత తో ఇక్కడ విద్యార్థులు మెడికల్ కోర్సుల్లో చేరవచ్చునని చెప్పారు. బెలారస్ యూనివర్సిటీస్ 20 సంవత్సరాల అనుభవంతో ఎంబిబిఎస్ కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. తమ వెబ్సైట్లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

గోషామహల్ కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి సీకే మూర్తికి మార్గం సుగమం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఎన్నికల నగారా మోగడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారును వేగవంతం చేసింది. గోషామహల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తూ 15 మంది గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ముగ్గురు పేర్లను పార్టీ అధిష్టానానికి పంపించింది. ఈ నేపథ్యంలో టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతారావుకు టికెట్ కేటాయింపునకు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుసుకున్న ఆశావ హులు గాంధీభవన్ ఎదుట స్థానికులకే టికెట్ ఇవ్వాలని ప్ల కార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అయితే సునీతారావు సైతం గోషామహల్ నుండి పోటీకి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తన సామాజిక వర్గం అధికంగా గల అంబర్పేట్ లేదా సికింద్రాబాద్ టికెట్ కేటాయించాలని ఆమె అధిష్టానాన్ని కోరినట్లు తెలిసింది. దీంతో ప్రేమ్ లాల్, మెట్టు సాయికుమార్, సికె మూర్తిల పేర్లను పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే సీనియారిటీ లేదని అధిష్టానం మెట్టు సాయికుమార్ ను తప్పించగా, మరో సీనియర్ కాంగ్రెస్ నేత ప్రేమాల్ పోటీ నుండి తప్పుకోనున్నట్లు తెలిసింది. దీంతో సీనియర్ కాంగ్రెస్ నేత సికె మూర్తికి గోషామహల్ టికెట్ ఖాయం అయ్యేలా కనిపిస్తుంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సికె మూర్తికి ని యోజకవర్గం పై గట్టి పట్టు ఉండటంతో పాటు నియోజకవర్గంలో 35 వేలకు పైగా ఎస్సీ సామాజిక వర్గ ఓటర్లు ఉండటం కూడా మూర్తికి కల కలిసి వస్తుందని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది.

గౌరవం లేని చోట ఉండాలా..వద్దా..



- మద్దతు దారులతో కార్పొరేటర్ వెంకటేష్ సంప్రదింపులు
- కార్పొరేటర్ నివాసానికి ఎమ్మెల్యే

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆది నుండి అన్ని అవమానాలే అభివృద్ధిని నమ్మి పార్టీలో చేరిన తనకు కేటీఆర్ ఇచ్చిన భరోసా మేరకు ఎన్ని అవమానాలు జరిగినా భరిస్తున్నానని కార్పొరేటర్ వెంకటేష్ తెలిపారు. అయితే ఇదంతా ఎమ్మెల్యే దానం సమక్షంలోనే జరుగుతుందని ఆయనకు తెలిసి కూడా మౌనం వహించడం ఎందుకు అర్థం కావడం లేదని వాపోయారు. మంగళవారం జూబ్లీ హిల్స్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కార్పొరేటర్ కనీస ప్రోటోకాల్ లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కార్పొరేటర్ ఫోటో లేకపోవడంతో వివాదం నెలకొంది. కార్పొరేటర్ మద్దతుదారులు ఎమ్మెల్యే మద్దతుదార్లు బాహాబాయి చేసుకోవడంతో అలిగిన కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో సమావేశమై కార్యచరణ ప్రకటిస్తానన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ను కలిసినట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. గత కొంతకాలంగా అసహనంగా ఉన్న కార్పొరేట్ ఇంటికి మంగళవారం స్థానిక డివిజన్ నాయకులు ప్రజలు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ బుజ్జగింపుల కోసం బీఆర్ఎస్ నాయకులను వెల్దండ ఇంటికి పంపారు. సంప్రదింపుల కోసం వచ్చిన వారి వద్ద తనను తీవ్రంగా అవమానిస్తున్నారని, తనకిచ్చిన హామీలు నెరవేర్చకపోగా డివిజన్ ప్రజలకు సైతం ప్రభుత్వ పథకాలు అందనివ్వడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇక మధ్యవర్తుల సంప్రదింపులతో పని కాదన్న భావనకు వచ్చిన ఎమ్మెల్యే నేరుగా రంగంలోకి దిగారు.వెల్దండ ఇంటికి చేరుకొని చర్చలు కొనసాగించారు.ఈ సమయంలో పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని విభేదాలు మరిచి కలిసి పని చేద్దామని బుజ్జగించడంతో వెల్దండ శాంతించినట్లు తెలిసింది. అనంతరం వెల్దండ వెంకటేష్ తో కలిసి బయటికి వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికల్లో ఏవిధంగా పనిచేయాలన్న అంశాలపై చర్చించేందుకే వెల్దండ ఇంటికి వచ్చినట్లు చెప్పారు.తెలంగాణలో మరో మారు టిఆర్ఎస్ ప్రభంజనం ఉంటుందని తెలిపారు.గతంలో కంటే భారీ మెజార్టీ సాధించాలంటే ప్రతి నాయకుడు కార్యకర్త సమిష్టిగా పని చేయాలన్న కోణంలోనే అందరిని కలుస్తున్నట్లు చెప్పారు.చిన్నపాటి విభేదాలు ఉన్నా పార్టీ అగ్రనాయకత్వం కోసం కలిసి పని చేస్తామని కార్పొరేటర్ వెల్దండ తెలిపారు.

మూడోసారి కేసీఆరే సీఎం



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా ఎదురైన సవాళ్లను సమస్యలను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్లేలా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. మహిళా శిశు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాలను పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడం, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు అందేలా పథకాల రూపకల్పన చేయడంతోపాటు వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిం చేందుకు రైతుబంధు రైతు బీమా రుణమాఫీకి నిధులు కేటాయించడంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు అన్నారు. ఇతర రాష్ట్రాలు ఈర్షపడేలా తెలంగాణ ప్రగతి సీఎం కేసీఆర్ పరిపాలనకు నిదర్శనం అన్నారు.

ఆధిపత్యంపై పోరాడిన ముచ్చర్ల సత్యనారాయణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ ఆధిపత్యపోరుపై పోరాటం సాగించిన గొప్ప వ్యక్తి అని పలువురు వక్తలు ఆయనను కొనియాడారు.తెలంగాణ కోసం పెద్ద ఎత్తున తిరుగుబాటు చేశారని చెప్పారు. ముచ్చర్ల సత్యనారాయణ స్మారకోపన్యాస కమిటీ నిర్వహణలో ముచ్చర్ల 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'తెలంగాణ గతం, వర్తమానం-ముచ్చర్ల పాత్ర' అనే అంశంపై సభను నిర్వహించారు.ఈ సందర్భంగా కేయూ పూర్వ ఆచార్యులు, ప్రొఫెసర్ ఎ.వినాయక్ రెడ్డి మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రం సాకారం కావాలంటే గత ఉద్యమాల్లో ఎందుకు విఫలమయ్యామో తెలుసు కోవాలన్నారు.ముచ్చర్ల తన మాటలు, పాటలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ఉద్యమంపై ప్రజలను చైతన్యవంతం చేశారని ఆయన కొనియాడారు. అనంతరం రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ ముచ్చర్ల స్కూల్ స్థాయిలో పాటలు రచించి పాడారని, తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న ఆంధ్రవారిపై తిరుగుబాటు చేశారని, సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగారన్నారు.పేదల పట్ల స్పందించిన ఆయన ఎన్టీఆర్ ఆదిపత్యాన్ని సైతం ఎదిరించారని, విద్య, భూమి, నిరుద్యోగం తదితర అంశాలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి మాట్లాడుత ూ ముచ్చర్ల సత్యనారాయణ రోజు పోరాటాలను చేసేవారని తెలంగాణ ఉద్యమ చరిత్రలో అసలైన పోరాట యోధుల పేర్లు గల్లంతు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ఇచ్చిన ఎఐసిసి నాయకురాలు సోనియాగాంధీ పేరును కెసిఆర్ ఉచ్చరించడం లేదని, తెలంగాణ కోసం ఉద్యమించిన సుష్మస్వరాజ్ పేరును బిజెపి వారే ఎత్తడం లేదని, ఇలా ఎంతో మంది ఉన్నారన్నారు.తెలంగాణను ఎదిరించిన వారు మంత్రులైనారని, నాడు, నేడు పాలన ఒక్కటేనని, ఏజెంట్ల పాలనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ సభకు డా.పృథ్వీరాజ్ అధ్యక్షత వహించగా ప్రముఖ జర్నలిస్టు మాడభూషి శ్రీధర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, దురువు అంజన్న హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖైరతాబాద్ జోన్ (జీహెచ్ఎంసీ) జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో చేపట్టిన పనులకు ప్రతిరోజూ దిశానిర్దేశం చేసి ఆరోగ్యశాఖ ప్రతి కార్యక్రమాన్నీ విజయవం తగా అమలు చేయడానికి ప్రోత్సహించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం 109వ డివిజన్ పరిధిలోని, హఫీజ్‌పేట్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, మొవ్వ సత్యనారాయణలు ప్రజా సమస్యలపై నిర్వహించే ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమం, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ, గంగారం హుడా కేఫ్ వద్ద నుంచి శాంతి నగర్,పీజేఆర్ స్టేడియం, సుభాష్ నగర్ హుడా కాలనీ వరకు నిర్వహించారు. సమస్యలు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్ ,రవి గౌడ్,కోటేశ్వర రావు,పథ్వి కాంత్ గౌడ్,వరప్రసాద్,బాబు రెడ్డి,జితేందర్, శోభా దుబే, పార్వతి, రమణయ్య మెదక్ మహేష్ బాబు, రామచంద్రుడు, నరసింహ అరుణకుమారి,జగన్,జగదీశ్వర్ గౌడ్, రామా రావు ,జానీ బాబు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

- దరఖాస్తులకు ఆహ్వానం
- హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇలియాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మైనార్టీ విద్యార్థులకు రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ), లాంగ్వేజ్ పండిట్‌లు(ఎల్‌పీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టుల కోసం ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు.

ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 13 వరకు వారి దరఖాస్తులను నాంపల్లి హజ్ హౌస్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం 6వ అంతస్తులో సమర్పించాలని వివరించారు. మరిన్ని వివరాలకు 040-23236112 నంబర్‌పై సంప్రదించాలని ఆయన సూచించారు.

తనిఖీలో ఆరు లక్షల రూపాయలు సీజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో హైదరాబాద్ సహా జిల్లాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తు న్నారు. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేయగా ఎటువంటి సంబంధిత పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. ఆరు లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ పోలీసు స్టేషన్ డీఐ వరప్రసాద్, ఎస్సైలు సాయికృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి నారాయణగూడ వై జంక్షన్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా మామిడి నర్సింహ అనే వ్యక్తి తన యాక్టివా (టీఎస్ 08 జేఎస్ 0816) వాహనం పై ఎటువంటి సంబంధిత పత్రాలు లేకుండా తన సంచిలో రూ. 6,00,000 తీసుకెళు తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు
రాజకీయ పార్టీలు సహకరించాలి

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష


ఫైల్‌ఫోటో

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఒకటి ఎస్సీ రిజర్వ్ ఉన్నదని, మిగతా 14 నియోజకవర్గాలు జనరల్ కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో అక్టోబర్ 4వ తేదీన ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం మొత్తం 44,42,458 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 22,79,617 ఉండగా మహిళలు 21,62,541, ఇతరులు 300 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 404, ఎన్నారై ఓటర్లు 847, దివ్యాంగులు 24,163, వృద్ధులు 80 సం. పైబడిన ఓటర్లు 83,588 ఉన్నారని తెలిపారు.

ఓటరు జాబితాలో క్లైమ్స్, లపై ఎలక్షన్ నామినేషన్ చివరి రోజుకు పది రోజుల ముందు అనగా అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిహెచ్ఎంసి వ్యాప్తంగా 1,688 లొకేషన్లలో 3,986 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3,931 ఉండగా సైబరాబాద్ కమిషనరేట్ లో 51, రాచకొండ కమిషనరేట్ లో 4 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 34,452 పోలింగ్ స్టాఫ్, పోలీస్ పర్సనల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్లకు సందేహాలు నివృత్తి చేయడానికి జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భారత ఎన్నికల సంఘం 1950 టోల్ ఫ్రీ నెంబర్, 1800-599-2999 నెంబర్లు 24 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా మోడల్ కోడ్ లో ఉల్లంఘన జరిగిన ఫిర్యాదులను 100 నిమిషాలలోపు క్లియర్ చేసి యాప్ లో ఉంచుతామని తెలిపారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అనుసరించి కంట్రోల్ రూం ను డి.ఇ.ఓ కార్యాలయం, ప్రతి ఆర్.ఓ ఆఫీస్ లలో ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 6 టీమ్ లతో ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేశామన్నారు. పొలిటికల్ పార్టీలు చేసే ర్యాలీలు, మీటింగ్ లను వీడియో గ్రఫీ చేయడానికి 15 నియోజకవర్గాలలో 15 వీడియో సర్వీలెన్స్ టీమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎం.సి.సి ద్వారా పొలిటికల్ పార్టీలు వాహన వినియోగానికి పర్మిషన్ తీసుకోవాలి. ప్రభుత్వ స్థలాల్లో పోస్టర్లు, పెయింటింగ్స్ వేయరాదు. అనధికార అడ్వటైజ్మెంట్ లపై ఎం.సి.సి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పొలిటికల్ సమావేశాలలో మతపరమైన ఉపన్యాసాలు చేయకూడదని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో నియోజకవర్గానికి ఆరు టీమ్ ల చొప్పున 90 టీమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లను వీడియో తీయడానికి ఒకొక్క నియోజకవర్గానికి ఒకొక్క వీడియో సర్వేలెన్స్ టీం లను ఏర్పాటు చేశామని తెలిపారు.

జనరల్ కండక్ట్ లో భాగంగా రాజకీయ పార్టీలు భాష, మత, కమ్యునిటీలను దూషించే విధంగా ప్రవర్తించిన వారిపై ఆర్.పి యాక్ట్ 1951 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ఇతరులను విమర్శించేవిధంగా సంభాషించకూడదన్నారు. మజీద్ లు, చర్చీలు, దేవాలయాల ప్రాంగణంలో ఎటువంటి ప్రచారం నిర్వహించకూడదని తెలిపారు. కులం, మతం ఆధారంగా ఓట్లు అడగకూడదని చెప్పారు. రాజకీయ పార్టీలు ఓటర్లను మభ్యపెట్టేందుకు విలువైన వస్తువులు ఇవ్వడం, ఓటర్లను బెదిరించడం, పోలింగ్ స్టేషన్లకు వంద మీటర్ల లోపు ప్రచారం నిర్వహించకూడదని తెలిపారు. పోలింగ్ తేదీ కి 48 గంటల ముందు వరకు ఎటువంటి పబ్లిక్ మీటింగ్స్ నిర్వహించకూడదన్నారు. ఓటర్లకు ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కల్పించకూడదన్నారు. ఎవరి ఇంటి వద్ద కూడా ధర్నాలు, నిరసనలు నిర్వహించకూడదని తెలిపారు. ఏ పార్టీ కానీ బరిలో ఉన్న అభ్యర్థులు కానీ తమ అనుచరులు కానీ ఎవరి ల్యాండ్, బిల్డింగ్, కాంపౌండ్ వాల్ వారి అనుమతి లేకుండా జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వాల్ రైటింగ్ చేయకూడదని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులు, అనుచరుల ద్వారా వివిధ ప్రదేశాలలో నిర్వహిస్తున్న ఇతర పార్టీల సమావేశాలకు ఆటంకం కలిగించకూడదు తెలిపారు. ఒకే ప్రదేశంలో ఇరు పార్టీలు ర్యాలీలు, పబ్లిక్ సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. సమావేశాలు, లౌడ్ స్పీకర్లకులౌడ్ స్పీకర్లు, ర్యాలీలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లోకల్ పోలీస్ అథారిటీ ద్వారా అనుమతి పొందాలని తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ 12డి అందించడానికి ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న చో పోలింగ్ సిబ్బంది నేరుగా వారి ఇంటికి వెళ్లి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు.

పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ... ఎన్నికల కోసం ఎన్ఫోర్స్మెంట్ పై విస్తృత చర్యలు చేపట్టినట్లు తెలిపారు అందులో బాగంగా. నిన్న పెద్ద మొత్తంలో నగదు ను పట్టుకున్నట్లు తెలిపారు . రాజకీయ పార్టీలు ఓటర్లకు ఉచితంగా అందించే వస్తువులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాన్ బెయిలబుల్ వారంట్ టీమ్ లు ఉన్నాయని తెలిపారు. 652 బైండోవర్ లను నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన పై పి.డి యాక్ట్, ఆర్.పి యాక్ట్ 1951 ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 1587 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గా గుర్తించడం జరిగిందని, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ద్వారా నార్కోటిక్స్ పై మద్యం. గంజాయి నగదు ప్రవాహం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు లో జి యస్ టి ఐటీ, ఎక్సైజ్ కమిషనర్ టాక్స్ ఆర్టిఏ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కష్టం నార్కోటిక్ ఈడి అధికారులతో 24 గంటల పాటు పని చేసే విధానంగా పని చేస్తున్నాయని జిల్లాలో ,18 ప్రదేశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు సి పి తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా కఠినంగా వ్యవహరించ డం జరుగుతుందన్నారు. అర్ ఓ స్థాయిలో కూడా వివిధ అనుమతులకు.సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు తీసుకొనుటకు ఏ యస్ పి స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని సి పి తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్, డిప్యూటీ డి.ఇ.ఓ అనుదీప్ దురిశెట్టి, ఈ.వి.డి.ఎం ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, నోడల్ అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

- కమిషనర్‌ను కలిసిన జేఏసీ నేతలు
- సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ కమిషనర్ సానుకూలత

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలో పలు కేటగిరిల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 10 నుంచి తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు జేఏసీ నేతలు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల డుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, ఏసురత్నం(ఏఐటీయూసీ), రెబ్బ రామారావు(హెచ్ఎంఎస్), ఎ.శంకర్(బీఎంఎస్), ఎం.కె.బోస్(టీఎన్‌టీయూసీ) బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జేఏసీ నేతలతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల పెంపు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఐఆర్ 5శాతం అమలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం అన్ని విభాగాల్లోని సిబ్బందికి వర్తింపజేయాలన్న డిమాండ్లపై జీహెచ్ఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు, 116 మంది జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని హైకోర్టు(2021) తీర్పు అమలు, సమాన పనికి-సమాన వేతనం, పర్మినెంట్ వంటి విధానపరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పినట్టు వారు తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో ఈనెల 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలన్న తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కమిషనర్‌కు వారు వివరించారు.

మంత్రి గంగుల కమలాకర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి



- బాధిత దంపతులు చెట్టి వెంకటరమణ, హేమలత

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో భూకబ్జాలకు పాల్పడు తున్న మంత్రి గంగుల కమలాకర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్, హెూం శాఖ మంత్రి, రాష్ట్ర డీజీపీకి బాధిత దంపతులు చెట్టి వెంకటరమణ, హేమలతలు డిమాండ్ చేశారు. ఆయన భయంతో హైదరాబాద్ లో తలదాచుకుంటున్నట్టు భార్యాభర్తలిద్దరూ ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం, మల్కాపూర్ గ్రామ పంచాయితీలోని లక్ష్మీపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 30లో గల ఒక ఎకరం 5 గుంటల భూమిని 2007లో ఖరీదు చేసి అధీనంలోకి తీసుకున్నామని తెలిపారు. కాగా ఇందులో పది గుంటల భూమిని కుటుంబ అవసరాల నిమిత్తం విక్రయిం చుకోవడం జరిగిందని, మిగిలిన 35 గుంటల భూమిపై మంత్రి గంగుల కమలాకర్ కన్ను పడిందని ఆరోపించారు. ఈ భూమిలోకి మంత్రి అనుచరులు మహిపాల్, కర్ర రవీందర్ రెడ్డి తదితరులు ప్రవేశించి కబ్జా చేయడానికి ప్రయత్నించారని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎవరూ రాకుండా కట్టడాలను ప్రారంభించారని తెలిపారు. అంతే కాకుండా తమ కుటుంబ సభ్యులను బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, రూ. 4 నుంచి 5 కోట్ల వరకు విలువైన ఈ భూమికి 30 లక్షల రూపాయలు వెలకట్టి తీసుకుని వెళ్ళిపోవాలని బెదిరిం చారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తాము హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నామని తెలిపారు.పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వారు మంత్రికి, మంత్రి అనుచరులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. షుగర్ వ్యాధి వల్ల తన భర్తకు కండ్లు కనిపించడం లేదని, ఈ విషయంలో సీఎం కేసీఆర్, సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని హేమలత విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టు దత్తాత్రేయ కుటుంబాన్ని ఆదుకుంటాం



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- దత్తాత్రేయ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-అంబర్‌పేట

సీనియర్ జర్నలిస్టు దత్తాత్రేయ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన జర్నలిస్టు, దత్తాత్రేయ చిన్న కుమార్తె హరిణి మెడిసిన్ విద్యా పూర్తి చేయడానికి ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. మంగళవారం హైదర్ గూడ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రూ. 50 వేల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాను జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించిన నాటి నుంచి దత్తాత్రేయతో తనకు మంచి పరిచయం ఉందన్నారు. నిరంతరం వార్తల సేకరణలో ముందుంటూ క్రమశిక్షణతో పనిచేసేవారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కుమార్తెను ఆశీర్వదిస్తూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యురాలుగా అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందాలని పేర్కొన్నారు.



తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రన గ్రంథం ఆవిష్కరణ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

డాక్టర్ ఎం. దేవేంద్ర సిద్ధాంత గ్రంథం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం యాన్యువల్‌డే సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. వీరు 2011లో పి హెచ్ డి ప్రారంభించినప్పుడు ఆనాటి కాల పరిస్థితులు ముక్త కంఠంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కోసం నినదిస్తున్నాయి. ఆ సందర్భంలో తెలంగాణ జీవితాన్ని అధ్యయనం చేయదానికి కథానిక ప్రక్రియ నెంచుకొని దేవేంద్ర ఈ పరిశోధన ను ప్రారంభించి జీవితాన్ని చాలా లోతుగా అధ్యయనం చేశారు. ఉద్యమ సమయంలో చేశారు కాబట్టి ఆనాడు ఉద్యమానికి నాయకత్వం వహించి, రాష్ట్ర కలను సాకారం చేసిన అలుపెరుగని పోరాట యోధుడు సీఎం కేసీఆర్, శోభా దంపతులకు ఈ గ్రంథం అంకితం ఇవ్వడం జరిగిందన్నారు. ఓయూ వీసీ ఆచార్య డి రవీందర్ ,తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఆచార్య విజ్జులత, స్పెషల్ ఆఫీసర్ ఆచార్య సరస్వతమ్మ , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్త తదితరులు పాల్గొన్నారు

బాలుడి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

- తీర్పు వెల్లడించిన నాంపల్లి కోర్టు
- 2022లో ఘటన


మృతుడు


నిందితుడు

నవతెలంగాణ - ముషీరాబాద్

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని మూడేండ్ల బాలుడిని అతి పాశవీకంగా చిత్రహింసలకు గురి చేస్తూ హత్య చేసిన నిందితుడికి నాంపల్లి కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. 2022లో జరిగిన ఘటనకు సంబంధించి సెక్షన్ 302, 5(ఎం)(ఎన్) ఐపీసీ 377 ప్రకతి విరుద్ధ లైంగిక చర్య సెక్షన్ల కింద ఫోక్సో స్పెషల్ కోర్ట్ సెషన్ జడ్జ్ టి అనిత మంగళవారం యావజీవ కారాగార శిక్ష విదిస్తూ తీర్పు వెల్లడించింది.

ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పార్శిగుట్టలో నిజామాబాద్ జిల్లాకు చెందిన శివకుమార్, నాగలక్ష్మి దంపతులకు పవన్, భరత్ కుమార్ (3) కుమారులు. నాగలక్ష్మికి అప్పటికే అదే జిల్లా మాధవనగర్ గ్రామానికి చెందిన రవితో వివాహేతర సంబంధం ఉంది. రవి పార్శిగుట్ట మున్సిపల్ కాలనీ ప్రకాశ్ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఇక ఉన్న ఊర్లో ఇల్లు గడవడం భారంగా మారడంతో రవి సహకారంతో భర్తను, ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని నాగలక్ష్మి హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ కుటుంబం, ముషీరాబాద్ మోహన్‌నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో అద్దె ఇల్లు తీసుకొని ఉండే వారు. శివ కుమార్‌ను పెయింటర్‌గా పని చేస్తుంటాడు తన పని నిమిత్తం రోజంతా బయటికి వెళ్ళగా నాగలక్ష్మి తన ప్రియుడు రవితో కలిసి వివాహేతర సంబంధం కొనసాగించింది.పెద్ద కుమారుడు పవన్ స్కూలుకు వెళ్లగా చిన్న కుమారుడు ఇంటి వద్ద అంగన్వాడీ కేంద్రంలో చదువుకునేవాడు.ఉదయం దిగబెట్టి మధ్యాహ్నం ఇంటికి తీసుకొస్తున్నారు. అయితే వివాహేతర సంబంధానికి చిన్న కుమారుడు అడ్డుగా ఉన్నాడని నాగలక్ష్మి ఆమె ప్రియుడితో కలిసి బాబు హత్యకు పథకం వేసింది. 2022 జూలై 8న ఎప్పటి లాగే కుమారుడిని స్థానిక అంగన్‌వాడీ పాఠశాలకు పంపించింది. మధ్యాహ్నం ప్రియుడు రవి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళి చిన్నారిని తీసుకువచ్చి బాలుడిపై అతి పాశవీకంగా లైంగికదాడి చేశాడు. చిత్రహింసలకు గురి చేస్తూ బాలుడి తల, కాలేయం కడుపు భాగాల్లో తీవ్రంగా గాయపరిచి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్యకు కారణం తల్లి నాగలక్ష్మి, ప్రియుడు రవిగా భావించి తమదైన శైలిలో విచారించగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి బాలుడు తల్లి నాగలక్ష్మి, రవిని రిమాండ్ కు తరలించారు. దాదాపు 13 నెలల తర్వాత ఈ కేసులో నిందితుడు రవికి నాంపల్లి స్పెషల్ కోర్ట్ జీవిత ఖైదు విధించింది. బాలుడి తల్లి హత్య సమయంలో అక్కడ లేకపోవడంతో ఆమెను కోర్టు మందలించి వదిలేసింది.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అమ్మమ్మలు , నానమ్మలు , తాతయ్యలు కుటుంబం గొప్ప సంపదని.. ప్రేమగల వారసత్వ స్థాపకులని, మన సాంస్కృతి సంప్రదాయాన్ని కాపాడేవారని కేర్ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఆవుల పద్మ అన్నారు. తాతయ్యలు కుటుంబానికి బలమైన పునాదని.. వారి ప్రత్యేక ప్రేమ, సంరక్షణ ద్వారా, తాతలు ఒక కుటుంబాన్ని హృదయానికి దగ్గరగా ఉంచుతారని పేర్కొన్నారు. అంతర్జాతీయ గ్రాండ్ పేరెంట్స్ డే ని పురస్కరించుకుని హైదరాబాద్ నల్లకుంట కేర్ మోడల్ హై స్కూల్‌లో మంగళవారం సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల అమ్మమ్మలను, నానమ్మలను , తాతయ్యాలను పిలిపించి వారిని ఘనంగా సన్మానించారు. అమ్మమ్మలకు, తాతయ్యాలకు వివిధ రకాల ఆట పాటలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తాతయ్యలు మనకి ఆదర్శంగా ఉంటారన్నారు. వాళ్ళు మనకి మంచి మాటలు చెపుతూ మంచి కథలు చెప్తూ..మనకి లోకజ్ఞానం కలిగిస్తారని తెలిపారు. సరదాగా కబుర్లు చెపుతూ కాలక్షేపం చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ రాధిక, మానసి, ఫాతిమా, కీర్తి వసంత, కళ్యాణ్ గౌడ్‌లు పాల్గొన్నారు.



ప్రగతి భవన్ లో మంత్రి కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి , బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జ్ కల్వకుంట్ల వంశీధర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర డాక్టర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కలుకూరి అన్వేష్ డాక్టర్ భానుచందర్ చామలఉదయ వంశీ రెడ్డిలకు కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు వీరితో పాటు పదిమంది డాక్టర్లు, 300 మందికార్యకర్తలు కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల వెలువర్తిగ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కలుకూరి రాములు, మత్స్యశాఖ చైర్మెన్ చెవ్వ వెంకటేశం, ఉపాధ్యక్షుడు పిట్టల కుమార్ దుడ్డు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు నవతెలంగాణ-సిటీబ్యూరో



దేవాలయాలు పురోభివృద్ధి కి ఎల్లవేళలా తన వంతు సహకారం అందిస్తానని బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ (టీం సాయి) అన్నారు. మంగళవారం ఆయన మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని హనుమాన్ టెక్డీ నాగదేవత ఆలయా నికి ఆర్థిక సహాయం అందజేశారు. నవతెలంగాణ- నేరేడ్‌మెట్

దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్



- బీఆర్ఎస్ నాయకులు బొట్టు శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్

దళిత బంధు పేరుతో సీఎం కేసీఆర్ దళితుల జీవితాల్లో వెలుగులు నింపారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అడిక్ మెట్ డివిజ న్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బొట్టు శీను మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల హడావిడి మొదలైందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టి మరోమారు కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడానికి ముషీరాబాద్ లో ముఠా గోపాల్‌ను గెలిపించ డానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతుబంధు రైతు బీమా తోపాటు వికలాంగ, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళ పింఛన్లు ఇస్తూ పేద ప్రజలను ఆదుకుంటున్న ఏకైక మనసున్న నాయకులు అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద పిల్లల కోసం బ్రేక్‌ఫాస్ట్ పేరిట పథకాన్ని ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ముఠా గోపాల్ కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను తెలుసుకుంటూ అవి పరిష్కార మయ్యే వరకు అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్న ఏకైక ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు.బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు రజనీకాంత్, భాస్కర్, గోపి, నాయకులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కాలేజీలో టై గ్రాడ్ కిక్ అఫ్ ప్రోగ్రాం ప్రారంభం



నవతెలంగాణ-మెహిదీపట్నం


షేక్‌పేటలోని నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో "విజయవంతమైన యువ పారిశ్రామికవేత్తలుగా ఎలా ఎదగడం" అనే అంశంపై టై గ్రాడ్ కంపెనీ ఆధ్వర్యంలో 'టై గ్రాడ్ కిక్ ఆఫ్ 2023-24' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికిపైగా విద్యార్థులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం చైర్మెన్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. తాము ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కళాశాల విద్యార్థులకు కార్పొరేట్ దిగ్గజాలుగా, యువ పారిశ్రామికవేత్తలుగా తయారవడంలో శిక్షణను ఇస్తామని తెలిపారు. ఇందుకుగాను తాము ప్రపంచంలో అత్యంత ప్రతిభావంతమైన, పేరుగాంచిన కళాశాల విద్యార్థులకు స్టార్ట్ అప్ కంపెనీల ఏర్పాటు తదితర అంశాలలో తర్ఫీదును ఇస్తామని అన్నారు. ఇందులో భాగంగా తాము నారాయణమ్మ కాలేజీతో ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్ర మంలో దేశంలో పేరందిన కంపెనీల వ్యవస్థాపకులు హాజరై తమ అనుభవాలను వాటి నుంచి తాము నేర్చుకున్న పాఠాలను విద్యార్థులకు విడమర్చి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణమ్మ కళాశాల వైస్ చైర్మెన్ శ్రీ విద్యా రెడ్డి, టై గ్రాడ్ కంపెనీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణమ్మ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ రెడ్డి, డీన్ డాక్టర్ ఎన్ కళ్యాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పోలే నిరంజన్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ రావు, గోనె ప్రదీప్ రావు, రమేష్ నాయక్ తదితరులు సన్మానించారు.

నవతెలంగాణ-అంబర్‌పేట





అపర్ణా దాస్... వేగమంటే అభిమానం, క్రీడలో విజయం సాధించాలనే సంకల్పంతో గుర్రపు పందెం వైపు ఆకర్షితురాలైంది.జాకీ జీవితమంటే మాటలు కాదని ఆమెకు తెలుసు. చాలా మంది దీన్ని ఆనందించే క్రీడ అనుకుంటారు. కానీ ఇది చాలా సందర్భాల్లో ప్రాణాలు తీసే ప్రమాదకర ఆట. పురుషాధిక్య సమాజంలో ఓ మహిళ అలాంటి క్రీడను ఎంపిక చేసుకుని పోటీ చేయడమంటే అత్యంత సవాలుతో కూడిన విషయం. కానీ ఆమె మాత్రం రేస్ట్రాక్‌లో విజయం సాధించగలిగింది. యుఎస్‌లో జాకీ లైసెన్స్ పొందిన మొదటి భారతీయ మహిళగా కీర్తి ఘడించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

జాకీ లైసెన్స్ పొందిన మొదటి మహిళ

ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో పుట్టి, బెంగుళూరులో పెరిగింది. బెంగుళూరులోని మౌంట్ కార్మెల్ కాలేజీలో బయోటెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీని అభ్యసించింది. అపర్ణకు స్కూల్ నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. ఆమె హాకీ క్రీడాకారిణి, జాతీయ స్థాయి స్కేటింగ్ ఛాంపియన్, రాష్ట్ర క్రీడాకారిణి. గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె తండ్రి ఒక వార్తాపత్రిక ప్రకటనను చూసి బెంగుళూరు టర్ఫ్ క్లబ్ (బీటీసీ)లో శిక్షణ తీసుకోమన్నాడు. అక్కడే ఆమె తన రైడింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకుంది. ప్రతిరోజూ కాలేజీకి వెళ్లే ముందు శిక్షణ తీసుకునేది. ఆ సమయంలోనే గుర్రాల పట్ల ఆమెకున్న ప్రేమ పెరిగింది. రేస్ కోర్స్‌లో భాగంగా మొదటి సారి గుర్రం ఎక్కింది. కానీ రెండు నిమిషాల్లోనే పడిపోయింది. అయితే నేర్చుకోవాలనే ఆమె ఆశను మాత్రం కోల్పోలేదు. తాను జాకీ కావాలని అప్పుడే నిర్ణయించుకుంది.

ధైర్యం, పట్టుదలతోనే...

"అపర్ణ వేగంగా నేర్చుకుంది, కఠినమైన గుర్రాలను కూడా చాలా సులభంగా ఎదుర్కోగలిగింది. తన వయసులో ఉన్న చాలా మంది అబ్బాయిల కంటే వేగంగా ర్యాంక్‌లను సాధించింది. ఆమె వచ్చిన మొదటి రోజు నాకు బాగా గుర్తుంది. గుర్రాలపై ఆమెకున్న ప్రేమను గుర్తించాను. ఎంతో మంది అమ్మాయిలకు శిక్షణ ఇచ్చాను కానీ అపర్ణ స్థాయికి ఎవరూ చేరుకోలేకపోయారు. ధైర్యం, ఏదైనా చేయాలనే పట్టుదల ఆమెను ఈ క్రీడలో విజయం సాధించేలా చేశాయి" అని BTC సభ్యుడు గౌతమ్ సురేందర్ చెప్పారు.

ఎదుగుదల అసాధ్యమనుకున్నా

'నా గుర్రపు స్వారీ గురించి కుటుంబ సభ్యులకు చాలా సందేహాలున్నాయి. కానీ నా నిర్ణయాన్ని వారు హృదయపూర్వకంగా సమర్థించారు. ఈ ప్రయాణంలో నా అక్కచెల్లెళ్లు, స్నేహితులు కూడా కీలక పాత్ర పోషించారు. నాకు క్రీడలో రేసింగ్ నేపథ్యం లేదా గాడ్‌ఫాదర్‌లు ఎవ్వరూ లేరు. అలాగే ఒక మహిళగా అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయి. మొదట్లో నా ఎదుగుదల దాదాపు అసాధ్యం అనిపించింది' అని 28 ఏండ్ల అపర్ణ అంటున్నారు. 'అవకాశం అపారమైనది. ముఖ్యంగా ఆమె మగ జాకీలతో సమానంగా పరిగెడుతుంది. అందుకే నేను అపర్ణను ఇతర దేశాల్లో తన జాకీయింగ్ వృత్తిని కొనసాగించమని సలహా ఇచ్చాను. మన దేశంలో మహిళా జాకీలకు ప్రోత్సాహం లేదు. గుర్రపు పందాల ప్రపంచంలో తనదైనా ముద్ర వేయడానికి సామర్థ్యాలు ఉన్నాయని ఆమె నిరూపించుకోవాలి" అని BTCలో అప్పటి జాకీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సింక్లైర్ మార్షల్ చెప్పారు.

చాలామంది వ్యతిరేకించారు

అపర్ణ ఎంతో ఆలోచించి కెంటకీలోని లెక్సింగ్టన్‌లోని నార్త్ అమెరికన్ రేసింగ్ అకాడమీ (NARA)కి దరఖాస్తు చేసుకుంది. 'అకాడమీలో నాకు అవకాశం దొరకడమంటే చాలా గొప్ప విషయం. NARAలో హాల్ ఆఫ్ ఫేమ్ జాకీ క్రిస్ మెక్‌కరాన్ ద్వారా శిక్షణ పొందాను. గుర్రాలతో నా కెరీర్‌ను రూపొందించుకోగలిగాను. ఆ ఏడాది అంగీకరించిన ఏకైక అంతర్జాతీయ విద్యార్థిని నేనే. అయితే కెంటకీకి రావడం గురించి బాగా ఆలోచించాను. ఎందుకంటే నా నిర్ణయాన్ని నా బంధువులందరూ వ్యతిరేకించారు. నన్ను అక్కడికి పంపవద్దని, పెండ్లి చేయాల్సిందిగా అందరూ మా నాన్నకు సలహా ఇచ్చారు. కానీ నాన్న మాత్రం నాకు మద్దతు ఇచ్చారు. ఆయన ప్రోత్సాహంతో శిక్షణలో చేరాను' అన్నారు ఆమె.

శిక్షకుల లైసెన్స్ కోసం...

యుఎస్‌లో శిక్షకుల లైసెన్స్ పొందాలంటే ముందు రాత, బార్న్ పరీక్ష రాయాలి. జాకీ నుండి శిక్షకులుగా మారడం అంత సులభమైన విషయం కాదు. 'నా చుట్టూ ఉన్న వ్యక్తులు నా కంటే ఎక్కువగా నన్ను విశ్వసిస్తున్నారని తెలుసుకు న్నప్పుడు నేను నా శిక్షకుని లైసెన్స్ కోసం దరఖాస్తు చేసాను. వారి గుర్రాలు ఏడు రేసుల్లో ఐదింటిని గెలుచుకున్నప్పుడు సిగ్మా ప్రాపర్టీ ఇన్వెస్ట్‌మెంట్స్, మోనికా విలియమ్స్ వంటి నా యజమానులతో పాలుపంచు కోవడం నాకు దొరికిన మంచి అవకాశం. కెరీర్‌లో నాకు వాళ్లు చాలా సపోర్ట్ చేశారు. తర్వాత నేను నా గుర్రాలను పరిగెత్తించాను. అన్ని రేసుల్లో నా గుర్రాలు అద్భుతంగా ప్రదర్శించాయి. ప్రత్యేకించి హార్స్ మో మోన్స్ కాపీక్యాట్‌లో 5,000 డాలర్లను క్లెయిమ్ చేసాము. న్యూజెర్సీ-బ్రెడ్ అలవెన్స్ రేస్, మోన్‌మౌత్ పార్క్‌లో 50,000 డాలర్ల భత్యం గెలుచుకున్నాము' అంటూ ఆమె ఎంతో ఆనందంగా చెప్పారు.




వెన్ను విరిగింది

NARAలో శిక్షణ పూర్తి చేసిన తర్వాత 2011లో గల్ఫ్ స్ట్రీమ్ పార్క్, మయామి, ఫ్లోరిడాలో తన మొదటి రేసును గెలిచి జాకీయింగ్ కెరీర్‌ను ప్రారంభించారు. అప్పటి నుండి ఆమె జీవితం ఒక గ్లోపింగ్ రైడ్. అనేక విజయాలతో పాటు గాయాలు కూడా వచ్చాయి. ఎలాంటి పరిస్థితినైనా అధిగమించగలిగే శక్తి, ధైర్యం ఆమెది. కానీ ఒక గాయం ఆమె పోటీ జీవితాన్ని దాదాపుగా ముగిం చింది. అందరూ రేసు ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. వారిలో అపర్ణ కూడా ఉన్నారు. ఆమె స్వారీ చేస్తున్నప్పుడు కిందపడిన ఆమెపై గుర్రం పడి తీవ్రంగా గాయ పడ్డారు. మెలకువ వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నారు. ఆ ప్రమాదంలో ఆమె వెన్ను విరిగింది. ప్రాణాలతో బయట పడటమే అత్యంత కష్టంగా మారింది. అయితే 11 నెలల తర్వాత పట్టుదలతో అపర్ణ తిరిగి రైడింగ్‌కు వచ్చారు.

మెదడు ఆరోగ్యానికి...

బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, ఆప్రికాట్స్, డేట్స్ ఇవన్నీ నట్స్ కిందకే వస్తాయి. ఇందులో ఒక్కో నట్స్‌కి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఎంతో రుచిగా ఉండే ఈ నట్స్ మంచి న్యూట్రీషియన్ విలువలు కలిగి ఉంటాయి. నట్స్ తినడం వల్ల మెదడు ఆరోగ్యం బాగుంటుంది. మెమరీ పవర్ పెరుగుతుంది. అందుకే రెగ్యులర్‌గా తీసుకోవాలి. వీటిల్లో ముఖ్యంగా బాదం తినడం వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి కూడా మెరుగవుతుంది. శరీరంలోని పేరుకు పోయిన కొవ్వుని తగ్గించడంలో పప్పుదినుసులు బాగా పనిచేస్తాయి. వీటిలోని ఫొలేట్, మెగ్నీషియం, పోషకాలు గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయి. ఏ విధంగా అయితే ఇష్టంగా తినగలమో అలా చేసుకోని, రోజూవారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.



కుంకుడుకాయలతో...

ఒకప్పుడు అందరూ కుంకుడుకాయల రసంతోనే తలస్నానం చేసే వారు. కానీ.. మారుతున్న కాలాన్ని బట్టి, ఉరుకుల పరుగుల జీవితంలో కుంకుడుకాయలకి స్థానం లేదు. అయితే షాంపూలు పడని వాళ్లో, మళ్ళీ మన పాత పద్ధతుల వైపు వెళ్దాం అని ఉత్సాహం ఉన్న వాళ్లో కుంకుడు కాయల గురించి ఆలోచిస్తున్నారు. అయితే షాంపూల కంటే కుంకుడు కాయల వల్ల జుట్టుకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటంటే...

- కుంకుడు కాయల రసం నాచురల్ షాంపూగా పని చేస్తుంది. జుట్టుకి పోషణని స్తుంది. దాంతో జుట్టు మెరుస్తూ ఉంటుంది. జుట్టు ఒత్తుగా కూడా పెరుగుతుంది. కుంకుడు కాయల్లో ఉన్న విటమిన్స్ వల్ల జుట్టు డ్రై గా అవ్వకుండా ఉంటుంది. సిల్కీ, స్మూత్ హెయిర్ మీ సొంతమవుతుంది.
- తలలో ఫంగస్ పెరగడం వల్ల చుండ్రు సమస్య వస్తుంది. కుంకుడు కాయలు తలను పూర్తిగా శుభ్ర పరుస్తాయి. దాంతో ఫంగస్ సమస్యే ఉండదు. తరచుగా కుంకుడుకాయలతోనే తలస్నానం చేస్తూ ఉండడం వల్ల చుండ్రు సమస్య పూర్తిగా పోతుంది.
- కుంకుడుకాయల్లో ఉన్న విటమిన్స్ ఏ, డీ వల్ల జుట్టు బాగా పెరుగుతుంది. అందులో ఉన్న విటమిన్స్ జుట్టు కుదుళ్ళకి బలాన్నిచ్చి జుట్టు పొడవుగా ఒత్తుగా పెరిగేలా చేస్తాయి. ఈ విటమిన్స్ కొత్త ఫాలికిల్స్ ఏర్పడడానికి సహాయం చేస్తాయి.
- కుంకుడు కాయలు, హెన్నా కాంబినేషన్ మంచి కండిషనర్‌లా పని చేస్తుంది. దాని వల్ల జుట్టు డ్రై గా అవ్వకుండా ఉంటుంది.
- వీటిలో ఉండే యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వలన జుట్టు రాలడం తగ్గిపోతుంది. జుట్టు చిక్కులు లేకుండా స్మూత్‌గా ఉంటుంది.



జ్యుడీషియల్ కస్టడీకి పుర్కాయస్థ

న్యూఢిల్లీ : చైనా అనుకూల ప్రచారం కోసం సొమ్ము తీసుకున్నారని ఆరోపిస్తూ ఉగ్రవాద నిరోధక ఉపా చట్టం కింద అరెస్ట్ చేసిన న్యూస్‌క్లిక్ పోర్టల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల అభివృద్ధి విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని ఢిల్లీ కోర్టు మంగళవారం పది రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వీరిద్దరినీ మధ్యాహ్నం 2.50 గంటల ప్రాంతంలో అదనపు సెషన్స్ జడ్జి హర్‌దీప్ కౌర్ ఎదుట హాజరు పరిచారు. నిందితులను పది రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించాలని ప్రాసిక్యూషన్ కోరగా పుర్కాయస్థ న్యాయవాది దానిని వ్యతిరేకించారు. తన క్లయింటుకు వ్యతిరేకంగా ప్రాథమిక సాక్ష్యాధారాలేవీ లభించలేదని తెలిపారు. 'నా క్లయింట్ ఎలాంటి ఉగ్రవాద చర్యకు పాల్పడ్డారు? ఓ పాత్రికేయుడిగా తను అలాంటి చర్యకు ఎలా పూనుకోగలడు? ఎఫ్ఐఆర్‌లో ఉన్న ఆరోపణలేమిటి? కోవిడ్ సమయంలో ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తూ వార్తలు ఇచ్చారు. రైతుల ఆందోళనలను గురించి వార్తలు అందించారు. అది ఉగ్రవాదమా?' అని పుర్కాయస్థ న్యాయవాది వాదించారు. వారు నేరం చేశారని అనుమానించినప్పటికీ జ్యుడీషియల్ కస్టడీకి పంపడం న్యాయాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని తెలిపారు. కాగా చక్రవర్తి పాత్రికేయుడు కాదని, ఎలాంటి చెల్లింపులు స్వీకరించలేదని ఆయన తరఫు న్యాయవాది చెప్పారు. కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్‌ను చూపకుండా న్యూస్‌క్లిక్ పోర్టల్ భారత చిత్రపటాన్ని ప్రచురించిందన్న ఆరోపణలోనూ వాస్తవం లేదని తెలిపారు. ఈ కేసు ఆధారాలు సేకరించే దశలోనే ఉన్నదని, నిస్పాక్షికంగానే ప్రాసిక్యూషన్ నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కోరిందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాత్సవ చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం పుర్కాయస్థ, చక్రవర్తిని న్యాయస్థానం పది రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

అమిత్‌షాకు సీపీఐ నిరసన

(మొదటిపేజీ తరువాయి)

పదేండ్ల నుంచి తన కొడుకు సీఎం చేసేందుకే తాపత్రయ పడుతున్నారని, ఆయనకు పేదలపై ఎలాంటి ప్రేమా లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలిచి మోడీ నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సెంట్రల్ యూనివర్సిటీ ప్రకటిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ స్థలం కేటాయించలేదని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ మంజూరైందని గుర్తుచేశారు. కృష్ణాజలాల అంశంపైనా పార్లమెంటులో మాట్లాడి పరిష్కరించినట్టు తెలిపారు. 75ఏండ్లలో ఆదివాసులు ఎప్పుడూ రాష్ట్రపతి కాలేదని, బీజేపీ తొలిసారి నిరుపేద ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసిందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చాలా హామీలిచ్చారని కానీ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఆయన పేదల పనులు చేయరని, కేవలం ఆయన కుటుంబం కోసమే పనులు చేస్తుంటారని విమర్శించారు. ఈ సభలో కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లాకే జనగామ...

(మొదటిపేజీ తరువాయి)

ఖాయమని తేలిపోయింది. హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో గల క్లబ్ హౌజ్ ఈ సయోధ్యకు వేదికైంది. అక్కడ నిర్వహించిన జనగామ బీఆర్ఎస్ సమన్వయ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలనీ, జిల్లాలోని మూడు సీట్లనూ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈనెల 16న జనగామలో నిర్వహించే ఎన్నికల మొదటి సభను విజయవంతం చేయాలని నాయకులకి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రైతు బంధు సమితి చైర్మెన్, ఎమ్మెల్యే డాక్టర్ టి రాజయ్య, మాజీ ఎమ్మెల్సీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

నగుబాటు సభాపర్వం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం తొలి పది సంవత్సరాల కాలంలో రాజస్థాన్ అసెంబ్లీ సగటున ఏడాదికి 59 రోజులు, మధ్యప్రదేశ్ అసెంబ్లీ 48 రోజులు సమావేశమయ్యాయి. అయితే చివరి పది సంవత్సరాలలో వార్షిక సగటు పనిదినాల సంఖ్య మరింత తగ్గిపోయింది. రాజస్థాన్ శాసనసభ 29 రోజులు, మధ్యప్రదేశ్ శాసనసభ 21 రోజులు మాత్రమే పనిచేశాయి. తెలంగాణ అసెంబ్లీ 2017లో అత్యధికంగా 37 రోజుల పాటు పనిచేయగా అప్పటి నుండీ ప్రతి సంవత్సరం పనిదినాలు తగ్గుతూ వచ్చాయి. ఏడాదికి 20 కంటే తక్కువ రోజులే అసెంబ్లీ పనిచేసింది. గత ఐదేళ్లలో రాజస్థాన్ అసెంబ్లీ ఏడాదికి సగటున 29 రోజులు, ఛత్తీస్‌ఘర్ అసెంబ్లీ 23 రోజులు, మిజోరం 18 రోజులు, మధ్యప్రదేశ్ 16 రోజులు, తెలంగాణ 15 రోజులు మాత్రమే పనిచేశాయి.

ప్రోరోగ్ చేయకుండానే...

సాధారణంగా శాసనసభను సమావేశపరుస్తున్నట్లు గవర్నర్ తెలియజేస్తారు. సభను ప్రోరోగ్ చేస్తున్నట్లు గవర్నర్ నోటీసు జారీ చేయడంతో సమావేశాలు ముగుస్తాయి. రాజస్థాన్, తెలంగాణలో మాత్రం సమావేశాలను ప్రోరోగ్ చేయకుండా వాయిదా వేశారు. దీంతో సాంకేతికంగా సమావేశాలు అనేక నెలల పాటు కొనసాగాయి. సమావేశానికి, సమావేశానికి మధ్య చాలా తేడా వచ్చింది. ఉదాహరణకు 2021, 2022 సంవత్సరాలలో రాజస్థాన్‌లో ఫిబ్రవరిలో మొదలైన సమావేశాలు సెప్టెంబర్‌లో ముగిశాయి. సమావేశాలను ప్రోరోగ్ చేయకపోవడమే దీనికి కారణం. ఈ సమావేశాలలో 80% వరకూ ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే జరగగా మిగిలినవి సెప్టెంబర్‌లో జరిగాయి.

ఆర్డినెన్సులతో సరి

2019-2023 మధ్యకాలంలో అసెంబ్లీ సమావేశాలు జరగని సమయంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం 39 ఆర్డినెన్సులు జారీ చేసింది. తర్వాతి స్థానాల్లో ఉన్న తెలంగాణలో 14 ఆర్డినెన్సులు, రాజస్థాన్‌లో 13 ఆర్డినెన్సులు జారీ అయ్యాయి. మధ్యప్రదేశ్‌లో ఒక్క 2020లోనే 11 ఆర్డినెన్సులు జారీ చేశారు. ఆ సంవత్సరం శాసనసభ కేవలం ఆరు రోజులు మాత్రమే సమావేశమైంది. అయితే జారీ చేసిన 11 ఆర్డినెన్సుల్లో ఆరింటికి కాలదోషం పట్టింది. వాటి స్థానంలో సకాలంలో బిల్లులు ప్రవేశపెట్టకపోవడమే దీనికి కారణం. 2021లో శాసనసభ 20 రోజులు మాత్రమే సమావేశం కాగా ఆ ఏడాది ప్రభుత్వం 14 ఆర్డినెన్సులు జారీ చేసింది.

తగ్గిపోతున్న సభ్యుల హాజరు

ఐదు రాష్ట్రాల శాసనసభలు సమావేశమైంది తక్కువ రోజులే అయినప్పటికీ సభ్యుల హాజరు పూర్తి స్థాయిలో లేకపోవడం గమనార్హం. ఈ రాష్ట్రాల్లో గడచిన ఐదు సంవత్సరాల్లో సభ్యుల సగటు హాజరు 83%గా నమోదైంది.

చర్చ లేకుండానే బిల్లుల ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

14 బిల్లుల్ని ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో 2022లో రెండు రోజుల వ్యవధిలో కేవలం ఐదు గంటల పాటు సమావేశమైన శాసనసభలో 13 బిల్లుల్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. ఐదు రాష్ట్రాల శాసనసభల్లో బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పుడు మూడో వంతు సమయం చర్చకు వెచ్చించారు. మిగిలిన సమయంలో వివిధ శాఖల ఖర్చులపై చర్చించి, ఓటింగ్ నిర్వహించారు. మిజోరంలో అన్ని శాఖల డిమాండ్లపై చర్చించి ఓటింగ్ జరిపారు. మిగిలిన రాష్ట్రాలలో ప్రతి సంవత్సరం అన్ని డిమాండ్లూ చర్చకు రాలేదు. పార్లమెంటులో మాదిరిగా శాఖాపరమైన వ్యయాన్ని పరిశీలించేందుకు ఈ ఐదు రాష్ట్రాల్లో కమిటీలేవీ లేవు.

బస్సెక్కితే బహుమతులు

(మొదటిపేజీ తరువాయి)

డ్రాప్‌బాక్స్‌ల్లో వేయాలని చెప్పారు. ఇటీవల రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇదే తరహాలో లక్కీడ్రా నిర్వహించి విజేతలను సత్కరించి బహుమతులు అందజేశామని వివరించారు. దసరా సీజన్‌లో కూడా లక్కీ డ్రా లో గెలుపొందిన 110 మంది విజేతల్లో ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున మొత్తం రూ.11 లక్షల బహుమతులు ఇస్తామన్నారు. విజయదశమి రోజు లక్కీ డ్రా తీసి, ప్రతి రీజియన్‌కు ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు చొప్పున ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 తేది వరకు, మళ్లీ 28 నుంచి 30 తేదీల్లో టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆయా తేదిల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణీకులు కూడా ఈ లక్కీ డ్రాకు అర్హులేనని తెలిపారు. ఇతర వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించారు. బతుకమ్మ, దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

పెరిగిన కుబేరులు

న్యూఢిల్లీ : భారత్‌లో సామాన్యులు ఆదాయాలు లేక.. అధిక ధరలతో విలవిలలాడుతోంటే.. మరోవైపు కుబేరులు మాత్రం ఊహించని రీతిలో పెరిగిపోతు న్నారు. సంఖ్యా ఆదాయ పరంగాను భారీగా పెరిగారు. ఏడాదికేడాదికి వేల కోట్లు పోగేసుకుంటున్నారని హురున్ రిస్ట్ లిస్ట్ రిపోర్ట్‌తో వెల్లడయ్యింది. మంగళవారం నాడు "360 వన్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2023" పేరుతో హురున్ ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. క్రితం ఏడాది ఈ సంఖ్య 24గా ఉంది. ఆగస్టు 30 నాటి సంపద ఆధారంగా దేశ వ్యాప్తంగా 1,319 మందితో కూడిన ధనవంతుల జాబితాను హురున్ విడుదల చేసింది. లిస్టెడ్ కంపెనీల షేర్ ఆధారంగా, అన్‌లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి ఇన్వెస్టర్ రౌండ్‌ల విలువ ఆధారంగా ఈ జాబితాను రూపొందించింది.

హురున్ రిపోర్ట్ వివరాలు.. భారత్‌లో గతేడాది వ్యవధిలో ప్రతి మూడు వారాలకు ఇద్దరు బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రస్తుతం దేశంలో 259 మంది బిలియనీర్లు ఉన్నారు. గత 12 ఏళ్లలో ఈ సంఖ్య 4.4 రెట్లు పెరిగింది. హురున్ జాబితాలో ఉన్నవారిలో 51 మంది సంపద వార్షిక ప్రాతిపదికన రెండింతలు పెరిగింది. గతేడాదిలో ప్రతీ 10 మందిలో ఎనిమిది మంది ఆదాయాలు పెరిగాయి. ఈ జాబితాలో గౌతం అదానీని అధిగమించి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ అగ్రస్థానంలోకి వచ్చారు. దీంతో భారత్‌లో మళ్లీ అత్యంత ధనవంతుడిగా అంబానీ నిలిచారు. అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతం అదానీ సంపదకు హిండెన్‌బర్గ్ రిపోర్ట్ మర్చిపోలేని దెబ్బ కొట్టింది. అదానీ కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని.. కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుతుందని.. విదేశాల్లోని పలు డొల్ల కంపెనీలతో మోసాలకు పాల్పడుతోందని హిండెన్‌బర్గ్ ఈ ఏడాది జనవరిలో రిపోర్ట్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. దీంతో అదానీ సంపద 57 శాతం పతనమై రూ.4.74 లక్షల కోట్లకు పడిపోయింది. ప్రస్తుత ఏడాదిలో ముకేష్ అంబానీ సంపద రెండు శాతం పెరిగి రూ.8.08 లక్షల కోట్లకు చేరింది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌లో గౌతం అదానీ సంపద తగ్గిపోయిందని హురున్ మేనేజింగ్ డైరెక్టర్, రీసెర్చ్ చీఫ్ అనస్ రెహ్మన్ జునైద్ తెలిపారు.

హురున్ జాబితాలో సీరం ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా దేశంలో మూడో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. గతేడాది పోలిస్తే ఆయన సంపద 36 శాతం ఎగిసి రూ.2.78 లక్షల కోట్లకు చేరింది. తర్వాత హెచ్‌సిఎల్ టెక్‌కు చెందిన శివ్ నాడార్ సంపద 23 శాతం ఎగబాకి రూ.2.28 లక్షల కోట్లకు పెరగడంతో ఆయన నాలుగో స్థానంలో నిలిచారు. తర్వాత స్థానాల్లో గోపిచంద్ హిందుజా, దిలీప్ సంఘ్వీ, లక్ష్మీ నివాస్ మిట్టల్, రాధాకృష్ణన్ దమానీ, కుమార్ మంగళం బిర్లా, నీరజ్ బజాజ్ నిలిచారు. బైజూస్ అధినేత రవీంద్రన్‌కు ఈ దఫా జాబితాలో చోటు దక్కలేదు.

ఈ-కామర్స్ వేదిక జెప్టో సహ వ్యవస్థాపకుడు కైవల్య వోరా ఈ జాబితాలో అత్యంత చిన్న వయస్కుడుగా ఉన్నారు. 20 ఏండ్ల వోరా రూ.1,000 కోట్ల సంపదను కలిగి ఉన్నారు. 94 ఏళ్ల వయసులో ప్రెసిషన్ వైర్స్ ఇండియాకు చెందిన మహేంద్ర రతిలాల్ మెహతా హురున్ ధనవంతుల జాబితాలో తొలిసారి చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా ముంబయి నుంచి హురున్ ధనవంతుల జాబితాలో 328 మంది చోటు దక్కించుకున్నారు. తర్వాత ఢిల్లీ 199, బెంగళూరు 100మందితో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఫార్మాస్యూటికల్ రంగం నుంచి 133 మంది, రసాయనాలు, పెట్రోకెమికల్స్ రంగం నుంచి 119 మంది, పారిశ్రామిక ఉత్పత్తుల రంగం నుంచి 96 మంది చొప్పున బిలియనీర్లు ఉన్నారు.

లీకులతో పరేషాన్

- గాంధీభవన్‌కు వచ్చిన నాయకులు
- రేవంత్‌ను అడ్డుకున్న నాగం
- పది సీట్లు ఇవ్వాలి :రేణుకా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మీడియాలో ప్రసారమవుతున్న కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా ఆ పార్టీ నేతలను పరేషాన్ చేస్తున్నది. దీంతోపాటు పొత్తులు, సీట్లపై వెలువడుతున్న కథనాలు వారిని కలవరపెడుతున్నాయి.ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరికొంత మంది నల్లగొండ జిల్లాకు చెందిన నేతలు పరుగు పరుగున గాంధీభవన్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. సీట్లు, పొత్తుల అంశాల గురించి ఆయన్ను వారు అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. నాగర్‌కర్నూల్ స్థానాన్ని మాజీ ఎమ్మెల్సీ కుచుకుల్లా దామోదర్‌రెడ్డి కుమారుడు రాజేష్‌రెడ్డికి కేటాయిస్తున్నట్టు లీకులు రావడంతో మాజీ మంత్రి నాగం జనార్ధనరెడ్డి తన కుమారుడు శశిధర్‌రెడ్డితో కలిసి గాంధీభవన్‌కు వచ్చారు. పీసీసీ చీఫ్‌ను అడ్డుకున్నారు. ఆయన వర్గీయులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రేవంత్ వారికి నచ్చ చెప్పి పంపించారు.

భావ సారూప్య పార్టీలతో పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

పొందాలన్న ఆలోచన తప్ప దాని అమలులో చిత్తశుద్ధి లేకపోవడం దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. జన గణనతోపాటు కుల గణన జరగాలని కోరారు. గతంలో బీజేపీ తెలంగాణలో పాగా వేసి అధికారంలోకి రావాలని కుట్రలు చేసిందని, దానిని కమ్యూనిస్టులు అడ్డుకున్నారని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికలకు ముందు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు. బీజేపీకి అనుకూలంగా ఇప్పుడు కేసీఆర్ మాట్లాడుతున్నారని, ఎన్డీఏ అధికారంలోకి వస్తే మా భాగస్వామ్యంతోనే సాధ్యమనే విధంగా బీఆర్ఎస్ పార్టీ మంత్రులనోట వింటున్నామని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారన్నారు. ఇండియా కూటమిలోని ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో బీఆర్ఎస్ బెంబేలు ఎత్తుతుందని, కాంగ్రెస్ హామీలను విమర్శించడం తప్ప కొత్తగా హామీలు ఇవ్వలేకపోతోందని చెప్పారు. దీనికి కారణం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడమేనన్నారు. సీపీఐ(ఎం) దేశవ్యాప్తంగా ఇండియా కూటమితో కలిసి పనిచేస్తుందని, తెలంగాణలో పార్టీ నిర్ణయించుకున్న స్థానాల్లో పోటీలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, ఎండి హషం తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

చేసిందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పాలకమండలి దీనిపై కూలంకషంగా చర్చించి వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరిగే గ్రూప్-2 రాతపరీక్షలను రీషెడ్యూల్ చేయాలని నిర్ణయించామని వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అధికారులు, కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఎన్నికల విధుల్లో ఉంటారని స్పష్టం చేశారు. ఈ క్రమంలో గ్రూప్-2 రాతపరీక్షలను నిర్వహించడం కష్టమని కలెక్టర్లు నివేదించారని పేర్కొన్నారు. దీంతో వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరగాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను వాయిదా వేస్తున్నామనీ, వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో తిరిగి నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఆగస్టు 29,30 తేదీల్లో నిర్వహించాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, నవంబర్ 3న నోటిఫికేషన్, 30న పోలింగ్ ఉండంతో మరోసారి వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇదే తరహాలో డీఎస్సీ రాతపరీక్షలు కూడా వాయిదా పడే అవకాశమున్నది. బుధవారం దానిపై స్పష్టత వస్తుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పాకిస్థాన్ పంజా

- 345 టార్గెట్‌ను ఊదేశారు
- ఛేదనలో రిజ్వాన్, అబ్దుల్లా శతకాలు
- శ్రీలంకపై పాక్ ఘన విజయం



నవతెలంగాణ-హైదరాబాద్ : శ్రీలంకతో ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్. పాకిస్థాన్ లక్ష్యం 345 పరుగులు. ఓపెనర్ ఇమామ్‌ఉల్ హాక్ (12), కెప్టెన్ బాబర్ ఆజామ్ (10) ఆరంభంలోనే అవుటయ్యారు. 37/2తో పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడిలో కూరుకుంది. ఈ సమయంలో శ్రీలంక విజయం నల్లేరు మీద నడకే అనిపించింది. కానీ ప్రపంచకప్ అరంగేట్ర బ్యాటర్ అబ్దుల్లా షఫీక్ (113, 103 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సులు), మహ్మద్ రిజ్వాన్ (131 నాటౌట్, 121 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులు) శతకాలతో చెలరేగారు. రెండో వికెట్‌కు 176 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. కండరాలు పట్టేసి బాధతో విలవిల్లాడుతూనే మహ్మద్ రిజ్వాన్ కెరీర్ అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ధనాధన్ మెరుపులతో దండయాత్ర చేసిన అబ్దుల్లా, రిజ్వాన్‌లు పాకిస్థాన్‌కు ప్రపంచకప్‌లో వరుసగా రెండో విజయాన్ని కట్టబెట్టారు. సయిూద్ షకీల్ (31), ఇఫ్తీకార్ అహ్మద్ (22 నాటౌట్) సైతం ఆకట్టుకున్నారు. 48.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి పాకిస్థాన్ 345 పరుగులు చేసింది. ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం ఖాతాలో వేసుకుంది.

తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక సైతం ధనాధన్ జోరు చూపించింది. కుశాల్ మెండిస్ (122, 77 బంతుల్లో 14 ఫోర్లు, 6 సిక్సులు), సదీర సమరవిక్రమ (108, 89 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు) పాకిస్థాన్ బౌలర్లకు చుక్కలు చూపించారు. మహ్మద్ రవూఫ్, షహీన్ షా అఫ్రిది బౌలింగ్‌ను ఈ జోడీ చీల్చి చెండాడింది. ఈ ఇద్దరు మెరుపు సెంచరీలతో శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 344 పరుగులు చేసింది. ఓపెనర్ నిశాంక (51, 61 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఐసీసీ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులను ఛేదించిన జట్టుగా పాకిస్థాన్ రికార్డు నెలకొల్పగా.. ఓ ప్రపంచకప్ మ్యాచ్‌లో నాలుగు శతకాలు నమోదు కావటం సైతం ఇదే ప్రథమం. మహ్మద్ రిజ్వాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. పాకిస్థాన్, శ్రీలంక మ్యాచ్‌తో హైదరాబాద్ వేదికగా ఐసీసీ 2023 ప్రపంచకప్ మ్యాచులు ముగిశాయి.



ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఆతిథ్య టీమ్ ఇండియా మరో సవాల్‌కు సిద్ధమైంది. చెపాక్‌లో ఆస్ట్రేలియాను స్పిన్‌తో దెబ్బకొట్టిన రోహిత్‌సేన.. నేడు ఫిరోజ్ షా కోట్లలో అఫ్గాన్ నుంచి స్పిన్ సవాల్ ఎదుర్కొంటుంది. పరుగుల పిచ్ కోట్లలో స్పిన్నర్ల పాత్ర నామమాత్రమే అయినా.. నాణ్యమైన అఫ్గాన్ స్పిన్నర్లు భారత్‌కు సవాల్ విసిరేందుకు రెడీ అవుతున్నారు. ప్రపంచకప్‌లో వరుసగా రెండో విజయంపై కన్నేసిన టీమ్ ఇండియా నేడు అఫ్గనిస్థాన్‌తో తలపడనుంది.

భారత్‌కు ఎదురుందా?

- అఫ్గనిస్థాన్‌తో రోహిత్‌సేన ఢీ నేడు
- వరుసగా రెండో విజయంపై గురి
- మధ్యాహ్నం 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..
- 2023 ఐసీసీ ప్రపంచకప్

నవతెలంగాణ-న్యూఢిల్లీ



ఆస్ట్రేలియాపై అదిరే విజ యంతో ఐసీసీ 2023 ప్రపంచకప్ వేటను మొదలుపెట్టిన టీమ్ ఇండియా.. గ్రూప్ దశలో రెండో సవాల్‌కు సిద్ధమైంది. టాప్ ఆర్డర్‌లో ముగ్గురు బ్యాటర్లు సున్నా పరుగులకే నిష్క్రమించినా.. క్లిష్టమైన లక్ష్యాన్ని ఛేదించిన రోహిత్‌సేన అత్యంత ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుంది. మరోవైపు అఫ్గనిస్థాన్ తొలి మ్యాచ్‌లో మంచి జట్టునే బరిలో నిలిపినా.. పరాజయం తప్పలేదు. భారత్ వరుసగా రెండో విజయంపై కన్నేసి నేడు బరిలోకి దిగుతుండగా.. టైటిల్ ఫేవరేట్, ఆతిథ్య భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలనే తపన అఫ్గనిస్థాన్ శిబిరంలో కనిపిస్తోంది. న్యూఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్ల (అరుణ్ జైట్లీ స్టేడియం) మైదానంలో భారత్, అఫ్గనిస్థాన్ ప్రపంచకప్ సమరం నేడు.

పరుగుల పండుగే!

స్పిన్ స్వర్గధామం చెపాక్‌లో టీమ్ ఇండియా బ్యాటర్లు జూలు విదిల్చేందుకు అవకాశం చిక్కలేదు. ఆరంభంలోనే మూడు వికెట్లు నేలకూరటంతో.. విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ టెస్టు క్రికెట్ నైపుణ్యంతో భారత్‌ను ఒడ్డున పడేశారు. రెండో మ్యాచ్ వేదిక ఫిరోజ్ షా కోట్ల పరుగుల పండుగకు కేరాఫ్ అడ్రస్. దీంతో భారత్ భారీ స్కోరు సాధించటంపై దృష్టి నిలుపనుంది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అనారోగ్యంతో నేటి మ్యాచ్‌కు అందుబాటులో లేడు. అతడి స్థానంలో యువ ఆటగాడు ఇషాన్ కిషన్ మరోసారి ఓపెనర్‌గా రానున్నాడు. రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ సహా శ్రేయస్ అయ్యర్ ఇక్కడి పిచ్‌పై భారీ ఇన్నింగ్స్‌లపై కన్నేశారు. గత ప్రపంచకప్‌లో సెంచరీల మోత మోగించిన రోహిత్ శర్మ ఇప్పుడు సారథిగా అదే తరహా ఇన్నింగ్స్‌లు ఆడాలని కోరుకుంటున్నాడు. లోకల్ బాయ్స్ విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లకు ఈ పిచ్‌పై చక్కటి అవగాహన ఉంది. ఇద్దరూ మంచి ఫామ్‌లో ఉండటం అఫ్గనిస్థాన్ బౌలర్లకు కష్టతరమే. కెఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజాలు సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నారు. పరుగుల పిచ్‌పై మూడో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. జడేజాతో కలిసి కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు తీసుకోనుండగా.. బుమ్రా, సిరాజ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

స్పిన్ బలంతో..

అఫ్గనిస్థాన్ అతిపెద్ద బలం స్పిన్ బౌలింగ్. ప్రపంచ మేటి మాయగాడు రషీద్ ఖాన్ సహా ముజీబ్ రెహమాన్ ఆ జట్టు సొంతం. రషీద్ ఖాన్‌ను ఎదుర్కొవటం ఎంతటి బ్యాటర్‌కు అయినా సవాల్‌తో కూడుకున్నదే. ఫిరోజ్ షా కోట్ల మైదానంలో స్పిన్ ప్రభావం తక్కువ అయినా.. అఫ్గాన్ మాయపైనే ఎక్కువగా అంచనాలు పెట్టుకుంది. అయితే ఒక్క స్పిన్ విభాగం నైపుణ్యంతో భారత్ వంటి అగ్రజట్లను ఓడించలేమనే సంగతి అఫ్గాన్‌కు బాగా తెలుసు. అందుకే ఆ జట్టులో బ్యాటర్లు సైతం సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ ధనాధన్ ఆటకు పెట్టింది పేరు. అతడు ఆరంభంలో కుదురుకుంటే వేగంగా పరుగులు పిండుకోగలడు. ఇబ్రహీం జద్రాన్, రెహమత్ షా, కెప్టెన్ హస్మతుల్లా షాహిదిలు సైతం బ్యాట్‌తో మెరిస్తే.. అఫ్గాన్‌కు మంచి అవకాశాలు ఉంటాయి. కానీ నాణ్యమైన భారత పేస్, స్పిన్ బౌలర్లను ఎదురొడ్డి అఫ్గాన్ బ్యాటర్లు నిలిచేది అనుమానమే. మేటి జట్లతో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో తలపడే అవకాశం అఫ్గనిస్థాన్ వంటి జట్లకు పెద్దగా రాదు. కానీ ఆ జట్టు ఇటీవల ప్రతి ఐసీసీ, ఏసీసీ టోర్నీలకు నిలకడగా అర్హత సాధిస్తూ మెగా జట్లతో మహా పోరు చేస్తోంది. నేడు భారత్‌తో మ్యాచ్ అఫ్గనిస్థాన్‌కు కీలకం కానుంది.

పిచ్, వాతావరణం

ఫిరోజ్ షా కోట్ల మైదానంలో గత మ్యాచ్‌లో ప్రపంచ కప్ రికార్డులు బద్దలయ్యాయి. శ్రీలంక, దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. నేడు అఫ్గాన్‌తో భారత్‌కు సైతం అటువంటి పిచ్‌నే సిద్ధం చేశారు. దీంతో భారత క్రికెట్ అభిమానులకు పరుగుల విందు ఖాయమని చెప్పవచ్చు. ఇక్కడ టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు అవకాశం కనిపిస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కాస్త తక్కువనే చెప్పవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), ఇషాన్ కిషన్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

అఫ్గనిస్థాన్ : రెహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, రెహమాత్ షా, హస్మతుల్లా షాహిది (కెప్టెన్), మహ్మద్ నబి, నజీబుల్లా జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, రషీద్ ఖాన్, నవీన్ ఉల్ హాక్, ముజీబ్ రెహమాన్, ఫజహల్‌హాక్ ఫరూకీ.

ఆ రెండూ తెలుసు!

పొట్టి ఫార్మాట్‌లో అన్ని వేగంగా మారిపోతాయి. కానీ వన్డే క్రికెట్ అందుకు భిన్నం. ఇక్కడ నిలకడ సాధించటం సాధారణ విషయం కాదు. ఎప్పుడు నెమ్మదించాలి, ఎప్పుడు సహనంతో ఉండాలి, ఎప్పుడు దండయాత్ర చేయాలనే అనుభవం, వివేకం వన్డే క్రికెట్‌లో బ్యాటర్లకు అనివార్యం. లేదంటే ఒత్తిడిని ఎప్పుడు తట్టుకోవాలి, ప్రత్యర్థి బౌలర్లను ఒత్తిడిలోకి ఎప్పుడు నెట్టాలనే అంశంలో తికమక పడి గందరగోళంలో పడటం ఖాయం. సరైన లెంగ్త్, లైన్ అందుకుని పదే పదే అక్కడే బంతులు సంధించే నైపుణ్యం, అనుభవం సైతం బౌలర్లకు వన్డే క్రికెట్‌లోనే అబ్బుతుంది.

భారత జట్టులో ఇటు బ్యాటర్లు, అటు బౌలర్లు ఈ విషయంలో ముందంజలోనే ఉన్నారు. అందుకు సరైన ఉదాహరణ చెన్నై చెపాక్‌లో ఆస్ట్రేలియాతో ప్రదర్శన. ఆపద అనిపించినప్పుడు పది బంతులు డిఫెన్స్ ఆడటమూ తెలుసు.. అవసరం అనిపించినప్పుడు అదే బౌలర్లను చిత్తు చేయటమూ మనోళ్లకు బాగా తెలుసు. ఫిరోజ్ షా కోట్ల పరుగుల పిచ్ అయినా.. ఎప్పుడు ఏ బౌలర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆడాలనేది సైతం కీలకం. ఇక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా.. కథ మారిపోతుంది. అఫ్గనిస్థాన్ ఈ విషయంలో ఇప్పుడు అనుభవం గడించాల్సి ఉండగా.. టీమ్ ఇండియా ఈ అంశంలో 'మాస్టర్స్' చేసింది. నేడు ఈ రెండు జట్ల మధ్య ప్రపంచకప్ మ్యాచ్‌లో ఇదే అతిపెద్ద వ్యత్యాసంగా నిలువనుంది. అంతిమంగా, మ్యాచ్ ఫలితాన్ని ఇది శాసిస్తుంది.

జోడీ నం.1

- ప్రపంచ నం.1గా సాత్విక్, చిరాగ్
- అగ్రస్థానానికి చేరుకున్న డబుల్స్ స్టార్స్



నవతెలంగాణ-హైదరాబాద్ : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్‌శెట్టి జోడీ మరో అరుదైన ఘనత సాధించింది. ఇప్పటికే ఎన్నో చారిత్రక విజయాలతో భారత బ్యాడ్మింటన్ రారాజులుగా వెలుగొందుతున్న సాత్విక్,చిరాగ్ జోడీ.. తాజాగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం చేసుకున్నారు. ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్ విభాగంలో పసిడి పతకం సాధించిన సాత్విక్, చిరాగ్ తొలిసారి ప్రపంచ నం.1గా నిలిచారు. భారత బ్యాడ్మింటన్‌లో సైనా నెహ్వాల్ (ఉమెన్స్ సింగిల్స్), కిదాంబి శ్రీకాంత్ (మెన్స్ సింగిల్స్) మాత్రమే ఇప్పటివరకు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నం.1గా నిలిచారు. ఈ ఏడాది 18 టోర్నమెంట్లలో పోటీపడిన సాత్విక్, చిరాగ్‌లు 92411 పాయింట్లు కైవసం చేసుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన ఇండోనేషియా జోడీ కంటే 2000 పాయింట్ల ముందంజలో మన జోడీ కొనసాగుతుంది. చైనా, మలేషియా, దక్షిణ కొరియా షట్లర్లు టాప్-5లో నిలిచారు. ఆసియా క్రీడల ఆరంభానికి ముందు కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ నం.2 అందుకున్న సాత్విక్, చిరాగ్.. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఫైనల్లో దక్షిణ కొరియా స్టార్స్‌పై వరుస గేముల్లో అలవోక విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.

ఇంగ్లాండ్ అలవోకగా..!

- బంగ్లాదేశ్‌పై బట్లర్‌సేన గెలుపు
- శతకబాదిన డెవిడ్ మలాన్



ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్) : డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ ఎట్టకేలకు బజ్‌బాల్ ఆట బయటపెట్టింది. వార్మప్ మ్యాచులకు వరుణుడు ఆటంకం కలిగించగా, ఆరంభ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. ఐసీసీ ప్రపంచకప్ గ్రూప్ దశ రెండో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ అదరగొట్టింది. 137 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 364 పరుగుల భారీ స్కోరు చేసింది. తొలుత ఓపెనర్లు జానీ బెయిర్‌స్టో (52, 59 బంతుల్లో 8 ఫోర్లు), డెవిడ్ మలాన్ (140, 107 బంతుల్లో 16 ఫోర్లు, 5 సిక్సులు) తొలి వికెట్‌కు 115 పరుగుల అదిరే ఆరంభాన్ని అందించారు. అర్థ సెంచరీ అనంతరం బెయిర్‌స్టో అవుటైనా.. జో రూట్ (82, 68 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మలాన్ జోరు కొనసాగించాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 39 బంతుల్లో అర్థ సెంచరీ బాదిన మలాన్.. 12 ఫోర్లు, రెండు సిక్సర్లతో 91 బంతుల్లో శతక విన్యాసం పూర్తి చేశాడు. జో రూట్ 44 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో అర్థ సెంచరీతో కదం తొక్కాడు. 107 బంతుల్లో 140 పరుగులు చేసిన డెవిడ్ మలాన్.. కెరీర్‌లోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించాడు. జోశ్ బట్లర్ (20), హ్యారీ బ్రూక్ (20) వేగంగా ఆడినా.. ఎంతోసేపు నిలువలేదు. చివర్లో పరుగుల వేట కాస్త నెమ్మదించినా.. ఇంగ్లాండ్ 9 వికెట్లకు 364 పరుగులు చేసింది. ఇక భారీ ఛేదనలో బంగ్లాదేశ్‌కు భంగపాటు తప్పలేదు. ఆ జట్టులో ఓపెనర్ లిటన్ దాస్ (76, 66 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు), ముష్ఫీకర్ రహీమ్ (51, 64 బంతుల్లో 4 ఫోర్లు) అర్థ సెంచరీలు సాధించినా.. బంగ్లాదేశ్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. హసన్ (1), నజ్ముల్ (0), షకిబ్ (1), మెహిది (8) విఫలమయ్యారు. 48.2 ఓవర్లలో 227 పరుగులకు బంగ్లాదేశ్ కథ ముగిసింది. 137 పరుగుల భారీ తేడాతో ఇంగ్లాండ్ గెలుపొందింది. డెవిడ్ మలాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

బిగ్ బికి ప్రత్యేకమైన బర్త్‌డే



అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ బిగ్ బిగా ప్రేక్షకులు, ఫ్యాన్స్ ముద్దుగా పిల్చుకునే అమితాబ్ బచ్చన్‌ని 'కౌన్ బనేగా కరోడ్‌పతి' నిర్వాహక బృందం ఊహించని రీతిలో సర్‌ప్రైజ్ చేసింది. నేటితో (బుధవారం) బిగ్ బి 81వ ఏటలోకి అడుగిడుతున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిరంజీవి, విద్యాబాలన్, విక్కీకౌశల్, బొమ్మన్ ఇరానీ వంటి ప్రముఖులతో బర్త్‌డే విషెస్ చెప్పించారు. దీంతో భావోద్వేగానికి లోనైన బిగ్‌బి, 'ఇంకా ఎంత ఏడిపిస్తారు. ఈ సెట్‌లో నా పుట్టినరోజు వేడుక నిర్వహించడం నాకు ఎంతో ప్రత్యేకం' అంటూ ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. కెబిసి 15వ సీజన్ టెలికాస్ట్ అవుతున్న తరుణంలో బిగ్ బి బర్త్‌డే సెలబ్రేషన్స్ జరిగాయి. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ', రజనీకాంత్ సినిమాలోనూ అమితాబ్ నటిస్తున్నారు. లేటెస్ట్‌గా ఆయన కీలక పాత్ర పోషించిన 'గణపథ్' చిత్రం దసరా కానుకగా రిలీజ్ కానుంది.

బబుల్ గమ్

బ్లాక్ బస్టర్ ఖాయం : నాని



రాజీవ్ కనకాల, సుమ కనకాల తనయుడు రోషన్ కనకాల 'బబుల్‌గమ్' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవి కాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మానస చౌదరి కథానాయిక. మంగళవారం హీరో నాని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఘనంగా జరిగిన ఈ వేడుకలో 'బబుల్‌గమ్' టీజర్‌ని నాని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రోషన్ తొలి సినిమాకే చాలా కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నాడు. అలాగే ఇందులో బలమైన కంటెంట్ ఉందనిపిస్తుంది. ఈ చిత్రం తనకి బ్లాక్ బస్టర్ స్టార్ట్ అవుతుంది. మరో సక్సెస్ ఫుల్ హీరో తెలుగు ఇండస్ట్రీ వచ్చాడని కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. రవికాంత్ చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తనకంటూ ఒక యూనిక్ స్టయిల్ వుంది. ఆ యూనిక్ నెస్ ఈ టీజర్‌లోనూ కనిపిస్తుంది. తెలుగు సినిమాల్లో క్వాలిటీ ఫిలిమ్స్‌కి మారుపేరుగా మారింది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్, వివేక్‌కి మరో విజయవంతమైన చిత్రం అవుతోంది. డిసెంబర్ 29న విడుదల చేస్తున్నారు' అని తెలిపారు.

'నాని అన్న నాలాంటి ఎందరితో స్ఫూర్తి. ఆయన వచ్చి టీజర్ లాంచ్ చేయడం, ప్రైడ్ ఆఫ్ ఇండియన్ సినిమా రాజమౌళి మా ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేయడం మా కల నెరవేరినట్లయింది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ మాపై నమ్మకంతో ఎంతగానో సపోర్ట్ చేశారు. దర్శకుడు రవికాంత్‌తో పని చేయడం ఒక గౌరవంగా భావిస్తాను. మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుందని, ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని రోషన్ కనకాల అన్నారు.

దర్శకుడు రవికాంత్ పేరెపు మాట్లాడుతూ,'రోషన్, మానస చాలా గ్రేస్‌తో తమ పాత్రలని పోషించారు. పాత్రలను వారు అర్థం చేసుకున్న తీరు నన్ను చాలా సర్‌ప్రైజ్ చేసింది' అని తెలిపారు. 'రోషన్.. ఫ్యామిలీ ఆఫ్ ట్యాలెంట్. టీజర్‌లో అది కనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. వివేక్ మాట్లాడుతూ, 'రోషన్ చాలా కాన్ఫిడెంట్‌గా ఈజ్‌తో పెర్‌ఫార్మ్ చేశాడు. నాని ఎప్పుడూ కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తారు' అని అన్నారు.

నవచిత్రం

ఎన్టీఆర్‌కి నచ్చిన మ్యాడ్



నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) కుమార్తె హారిక సూర్యదేవర నిర్మాతగా పరిచయమైన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. ఈ సినిమా ఈనెల 6న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌తో బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది.

ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, 'బాబాయ్(చినబాబు)కి ఈ కథ బాగా నచ్చింది. బాబాయ్ ఆల్మోస్ట్ ఒక రైటర్ లాగా ఈ సినిమా కోసం ఎఫర్ట్ పెట్టారు. అలాగే ఎడిటర్ నవీన్ నూలి రాత్రి పగలు అనే తేడా లేకుండా సినిమాని ఎంతో క్రిస్ప్‌గా, ప్రతి పంచ్ పేలేలాగా ఎడిట్ చేశాడు' అని తెలిపారు. 'సినిమాకి వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉంది' అని నిర్మాత హారిక అన్నారు. దర్శకుడు కళ్యాణ్ శంకర్ మాట్లాడుతూ, 'ఈ సినిమా రావడానికి జాతిరత్నాలే పునాది. ఈ సినిమా సక్సెస్‌తో నాతో పాటు దాదాపు 40 మంది లైఫ్ మారిపోయింది' అని అని చెప్పారు.

హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాని మా అక్క(లక్ష్మి ప్రణతి), బావ (ఎన్టీఆర్) చూశారు. బావకి సినిమా చాలా నచ్చింది' అని అన్నారు.

సర్‌ప్రైజ్ చేసే.. నరకాసుర

రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'నరకాసుర'. అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్స్‌గా కనిపించబోతున్నారు. ఈ సినిమాను సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిలిం మేకర్స్ బ్యానర్స్‌లో డాక్టర్ అజ్జ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకుడు. నవంబర్ 3న ఈ సినిమా ఉషా పిక్చర్స్ ద్వారా థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ సెబాస్టియన్ మాట్లాడుతూ, ' ఈ సినిమా మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. మీరు పోస్టర్, టీజర్‌లో చూసిందే కాదు సినిమాలో ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి' అని అన్నారు.

'ఇది మేమందరం గర్వపడే సినిమా. కాఫీ ఎస్టేట్ నేపథ్యంగా సాగే సినిమా ఇది' అని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు. ప్రొడ్యూసర్ డాక్టర్ అజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'రక్షిత్ పర్ ఫార్మెన్స్ సినిమాలో హైలైట్ అవుతుంది. అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది' అని అన్నారు. ఉషా పిక్చర్స్ డిస్ట్రిబ్యూటర్ సురేష్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ రిలీజ్ చేస్తున్నాం. సినిమా చూశాం. చాలా బాగుంది. మంచి డేట్‌కు సినిమా వస్తోంది' అని చెప్పారు.



అపర్ణ జనార్ధన్, రక్షిత్ అట్లూరి



కృతిసనన్, టైగర్ షరాఫ్

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్

టైగర్ షరాఫ్, కృతి సనన్ జంటగా, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో పూజ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రూపొందిన చిత్రం 'గణపథ్'. దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా ఈనెల 20న హిందీ, తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలకి రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో కొత్త తరహా ప్రపంచంలో వినూత్నమైన యాక్షన్‌ను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. ట్రైలర్ రిలీజ్ సందర్భంగా నిర్మాత జాకీ భగ్నాని నిర్మాత జాకీ భగ్నాని మాట్లాడుతూ, 'టైగర్ షరాఫ్, కృతి సనన్, అమితాబ్‌ల కలయికలో వస్తున్న ఈ చిత్రం పై ఇప్పటికే ప్రేక్షకుల్లో విపరీత అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలతోపాటు స్టన్నింగ్ విజువల్స్, ఉత్కంఠ రేపే పోరాట సన్నివేశాలతో పాటు భారీ కాస్టింగ్ ఉన్న ఈ చిత్ర ట్రైలర్‌కు, ఫస్ట్ సాంగ్‌కు వస్తున్న ఈ పాజిటివ్ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. సినిమాను కూడా ఇలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

నవ్వుల.. కిస్మత్

కామెడీ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ కలిసి మోస్ట్ ఎంటర్‌టైనింగ్ బడ్డీ కామెడీ 'కిస్మత్'ను రూపొందిస్తున్నారు. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, అవసరాల శ్రీనివాస్, విశ్వ దేవ్ బెస్ట్ బడ్డీలుగా కనిపించనుండగా, రియా సుమన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్‌తో మేకర్స్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. హీరో సత్యదేవ్ ప్రధాన తారాగణాన్ని పరిచయం చేస్తూ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, అవసరాల శ్రీనివాస్, విశ్వ దేవ్, రియా సుమన్ ఎందుకో కలవరపడుతున్నట్లు కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో కరెన్సీ నోట్లు ఉన్నాయి. 'కిస్మత్' అంటే అదృష్టం. ఫస్ట్ లుక్ పోస్టర్ ఇది ఫన్ రైడ్‌గా సాగుతుందని భరోసా ఇస్తుంది. ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సిహెచ్ భానుప్రసాద్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



నరేష్ అగస్త్య, విశ్వదేవ్, అభినవ్ గోమఠం

ఫీల్ గుడ్ సినిమా



అభిషేక్ పిక్చర్స్, జీ 5 తో సంయుక్తంగా రూపొందించిన చిత్రం 'ప్రేమ విమానం'. ఈ వెబ్ ఫిల్మ్‌ను ఈనెల 13న జీ 5లో రిలీజ్ చేయటానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. అయితే ప్రేక్షకుల రిక్వెస్ట్ మేరకు ఈ చిత్రం, ఓ రోజు ముందుగానే అంటే ఈనెల 12నే జీ 5లో స్ట్రీమింగ్ కానుంది. సంగీత్ శోభన్, శాన్వీ మేఘన హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో చిన్న పిల్లలుగా నిర్మాత అభిషేక్ నామా తనయులు దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా నటించారు. సంతోష్ కాటా దర్శకత్వం వహించారు. వెన్నెల కిషోర్, అనసూయ భరద్వాజ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీ ప్రీమియర్ షోని మంగళవారం మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ,'ఇందులో శాంత పాత్ర నాకు ఇచ్చినందుకు దర్శకుడు సంతోష్‌కు థ్యాంక్స్. మంచి సినిమా అనే ఫీల్ అందరికీ కలుగుతుంది. ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా చూడదగ్గ చిత్రమిది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.